TIGHT BINDING BOOK

బుద్ధిసాగర విజయము

UNIVERSAL
LIBRARY
OU_204685
LIBRARY
UNIVERSAL

Buddhisagara Vijayam :: ::

(Triumph of Buddhisagara)

AN ORIGINAL DRAMA IN FIVE ACTS :: ::

OSMANIA UNIVERSITY
COLLEGE LIBRARY.

BY

P. V. SUBBA RAO,

Author of

Suvarnamukhi, Gangabayi,

Thribhuvanamu,

Chitra Bharatam and

Duryodhana Parabhavam.

FIRST EDITION.

PRINTED AT THE
VANI PRESS, BEZWADA.

1923

All Rights Reserved

PRICE: AS. 12.

శ్రీ

బుద్ధిసాగర విజయము.

(ఐదంకముల నాటకము)

ఇయ్యది

సువర్ణముఖి, గంగాబాయి, త్రిభువనము, చిత్రభారతము, దుర్యోధనపరాభవముల

గ్రంథకర్తయగు

పల్లె వేంకటసుబ్బారావుచే

రచియింపఁబడి

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు

పి. కే. పంత్ చే ముద్రింపఁబడి

"పి. వి. రమణయ్య అండు సన్, గుంటూరు" చేఁ

ప్రకటింపఁబడియె.

మొదటికూర్పు: 1000 ప్రతులు.

సర్వస్వామ్యసంకలితము]

1923

[వెల: 0-12-0

విజ్ఞప్తి.

మత్కృతవచనగ్రంథములతో పాటు నా ప్రథమప్రయత్నంబగు "సుయోధనపరాభవ" నాటకమును దమరు సాదరభావంబున గ్రహింపవలెనని నూత్నకృతిని బ్రచురింప సాహసించితి.

ఇందలి గుణలేశమును గ్రహించి, లోపములను క్షమింపం బ్రార్థితులు. నా నాటకమునకు విపులమగు భూమికను వ్రాసియిచ్చిన 'రోషనారా' గ్రంథకర్తలగు మహారాజశ్రీ కొప్పరపు సుబ్బారావు పంతులు గారికిఁ గృతజ్ఞతాపూర్వక వందనము లొనరించుచున్నాఁడ.

దైవకృపావిశేషముచేతను, పెద్దల యాశీర్వచనప్రభావముచేతను మత్పూర్వకృతుల పగిది యిదియు జనానురంజకం బగుఁ గాత!

ఇందలి ముద్రణాదిస్ఖాలిత్యములు రెండవ కూర్పున సవరించుకొందును.

గుంటూరు,
16—7—1923.

ఇట్లు, విధేయుండు
వల్ల వేంకటసుబ్బారావు.

అవతారిక.

నటరంగము జనసామాన్యమునకు పాఠశాలవంటిది. ప్రత్యక్షముగ నందు ప్రదర్శింపఁబడు భావాభినయములు ప్రేక్షకుల హృదయఫలకముల ముద్రితములై యావజ్జీవము నుత్సన్నములుగావు. హరిశ్చంద్రుని కష్టములను బొత్తంబునఁ జదివియు మనకు విచారము కలుగక పోవచ్చును; కథకులవలన వినియు మనకుఁ గరుణము గలుగక పోవచ్చును; కాని ప్రత్యక్ష ప్రదర్శనమునం దొక్కసారియైనఁ జూచినచో కట్టికఠినమానసమైనను ద్రవింపకమానదు. కావుననే నాటకములు కావ్యశ్రేష్ఠములని పండితవర్యులు నిర్వచించిరి.

మానవునికి రెండే యనుభవములు: కష్టము, సుఖము. కాన మానవహృదయ ప్రకటనైకలక్ష్యములైన నాటకములుగూడ కష్టాంతములనియు, సుఖాంతములనియు రెండు ముఖ్యభాగములుగా విభజింపఁబడియె. కాని, యేమానవుడును కష్టైక జీవికాడు, సుఖైక జీవియునుగాఁడు. మానవుని బ్రదుకు కష్టసుఖసమ్మిళితము. అట్లయ్యుఁ గష్టాంతనాటకములు మాత్రము మన లాక్షణికులచే నిషేధింపఁబడియె. ఇది ప్రకృతివిరుద్ధమగునా కాదా యను క్లిష్టవితర్కమునకు-మాయెడల దయచేఁగాఁబోలు-బుద్ధిసాగరవిజయ నాటకము చోటీయకున్నది.

ఏమన నిదిసుఖాంతమైన రూపకము. దీని నొకించుక విమర్శింపుదము.

నాటకమునకు కథ ప్రాణము. కథారహితమై, కేవల ప్రకృతివర్ణనాపటిష్ఠములైనవి రేవిరైనఁ గావచ్చుఁగాని నాటకములు మాత్రము కావు. ప్రతికథకును బీజమైన హేతు వేదో యొకటియుండును. ఆ హేతువున కేదోయొక ఫలితముండును. ఆ హేతుఫలితములను మనోరంజకముగా సంఘటించుటయే కథావిధాన (plot) మగును.

మన లాక్షణికు లీకథావిధానము నైదుభాగములుగా శాసించిరి. "ముఖం ప్రతిముఖం గర్భోవిమర్శశ్చ తథైవ చ-నిర్వహణంచేతి నాటకేపంచసంధయః" అని దశరూపకము. ఈపంచసంధులచే బంధితమైన కథ నాటయితవ్యమని వారు ప్రవచించిరి.

బుద్ధిసాగరవిజయమునం దీవిధానము సమంజసముగా సంఘటింపఁబడుటచేతనే, తత్కథ నిరుపమానలాలిత్యము నొందినదని నిస్సంశయముగాఁ జెప్పనగు. వివరింపుదము.

బుద్ధిసాగరుని సుదర్శన చిత్రరేఖా వివాహోద్యమమే కథయందలి ప్రధానాంశము. ఇది నాటకశరీరమున ముఖసంధి. అతనియెడ నీర్ష్యచే దమనుఁడేతదుద్యమమునకు విఘాతము సంకల్పించుకొని రాజున కాతనియెడ నగౌరవభావమును గల్గించుటయే కథయందలి ప్రత్యుద్యమము. ఇది నాటకశరీరమునఁ బ్రతిముఖ సంధియయ్యెను.

దమనుఁడు సుదర్శనుని చెవిని విసముతో నించెను. సుదర్శనుఁడు బుద్ధిసాగరుని యెడలఁ దామసియయ్యెను. ఇది పిడుగువంటి వార్త! దీనికితోడు మఱొకటి. ఏకన్నియను దాను తనయెడయునికి బెండిలిసేయు పొంటె తోడ్కొని వచ్చెనో, యామెయాయెడ యని నిరాకరించుటేగాక తన (బుద్ధిసాగరుని) పుత్రునే మోహించెను! దమనుని ద్వేష గీతమున కిది తాళమువలె బరిణమించె! కథ యిచట వడ్డముగాఁ దిరిగినది! ఇది నాటకశరీరమున గర్భసంధి.

దమన పిశాచావిష్టుఁడైన రాజు బుద్ధిసాగరుని కారాగారమున నిర్బంధించెను. తమ కేఁగూడ నేమికీడు రానున్నదోయని మదనచిత్రరేఖ లటవికిఁబలాయితులైరి. దమనుఁడు వారినిఁగూడ బట్టుకొనివచ్చెదనని కాననమున కేగెను. అతని కచట జిత్రరేఖకు మారు శశిరేఖ గన్పించెను. ఆమెయే చిత్రరేఖయై యుండునని భ్రమించి దమనుఁడామెను బల్లకిని బెట్టించుకొని రాజుకడకుఁ జేర్చెను. అత్యుత్కంఠచే నక్కసపడుచున్న రాజునకు బల్యంకమున బాలాదర్శనమునకు మారు బాలదర్శనమయ్యెను! ఏలయన శశిరేఖయీలోపున బురుషవేషధారిణియయ్యెను! రాజునకు వెఱ్ఱియెత్తినట్లయ్యెను! వెంటనే దమనునికి గారాగార నివాసము నాతఁడు విధించెను. కథావిశేషమువల్ల యున్మీలితములై సన్నిహితఫలితములై విస్పష్టములైన ఘట్టమిదియ. ఇది నాటక శరీరమున విమర్శసంధి.

తానుత్రవ్వుకొన్నగోత దమనుఁడే పడెను. చిత్రరేఖకు మదనుఁడే మనోహరుఁ డయ్యెను. తనతప్పు దానెఱింగికొని సుదర్శనుఁడే తనంతదాను బుద్ధిసాగరుని కారాగార విముక్తునొనరించెను. ఇదియిట్లుండ శశిరేఖ—కష్టాంతముగా బరిణమించుచున్న కథను సుఖాంతముగా మార్చిన శశిరేఖ—సుదర్శనుని వరించెను. కథయందలి ఫలితములివి. ఇది నిర్వహణసంధి.

పాత్రపోషణము.

పాత్రలెల్ల సమంజసముగా బోషింపఁబడినవి. అందును మిగుల సమంజసముగా బోషింపఁబడిన బుద్ధిసాగరదమన పాత్రలను బరిశీలించుదము.

బుద్ధిసాగరుఁడు సార్థకనామధేయుఁడు- మహోద్యముఁడు. ఇతని ప్రజ్ఞయాగంధర్యము. సుదర్శనరాజకీయ నౌకను సురక్షితముగా నడిపిన కర్ణధారుఁడు. రాజభక్తికిఁ గన్నకొమరునిగూడ బలినీయసంసిద్ధుఁడైన యుదాత్తనీతిజ్ఞుఁడు. తనకష్టములకెల్ల మూలకందమైన సుదర్శనుని తనలోఁదానైన నిందించుకొనని సౌజన్యరాశి. ఇది మిగుల సమర్థతతో బోషింపబడిన పాత్ర.

దమనుఁడు 'యాచకో యాచకశ్శత్రుః' అనునార్యోక్తికి లక్ష్యమైనవాఁడు. గాఢాంధబంధురమై కడుభయంకరమై మిగుల నగాధమైన సముద్రగర్భము వంటి దీతని మానసము అదియీర్ష్యా విషపూరితము; మిగులగంభీరము. కథయెల్ల గష్టాంతముగా మార్పఁగల యమోఘశక్తి యీతనియీర్ష్యయందు గర్భితమై యుండెను. ఆశక్తికిగథ దాదాపుగా నెఱయయ్యెను. చదువరుల కీతనియెడల నిందాఁక కలిగెడి యప్రియత శశిరేఖా కృతపరాభవమాది సానుభూతిగాఁ బరిణమింపక మానదు. దుండగీఁడైన వీనియెడలఁగూడ మనకు సానుభూతికలుగునట్లుగా వివరించుట కడుసాజముగా నుండుటేగాక కవికిగల మానవహృదయ వికార పరిచయమును, పాత్రపోషణ నైపుణ్యమును వెల్లడియగుచున్నవి.

శైలిద్రాక్షాకదళీ పాకములుగా వ్యక్తమగుచున్నది. కవితాధార యనర్గళమై యందం దుదకపాత వేగముతో బ్రవహించుచున్నది.

కవిగారిట్టి దృశ్యములను పెక్కింటి విరచించి యాంధ్రభాషాసేవయొనర్తురుగాక యని మామనోరథము.

గుంటూరు
16—7—23

కొప్పరపు సుబ్బారావు.

ఇందలి పాత్రములు.

పురుషులు.

సుదర్శనుఁడు	రాజు
బుద్ధిసాగరుఁడు	ప్రధానమంత్రి
దమనుఁడు	ద్వితీయమంత్రి
మదనుఁడు	బుద్ధిసాగరుని కుమారుఁడు
సయ్యదహమ్మదుఖానుఁడు	నవాబు
రామశర్మ	పురోహితుఁడు
వీరవర్మ	రామశర్మ విహితుఁడు
దూతి	
కారాగృహాధికారి	
సూత్రధారుఁడు	
మారిషుఁడు	
సేవకులు	

స్త్రీలు.

శశిరేఖ, చిత్రరేఖ	కళింగాధీశుని పుత్రికలు
భాగ్యశ్రీ	బుద్ధిసాగరుని భార్య
చలికత్తె	

Expired on 9th May, 1919.

కృతిసమర్పణము

ఉ॥ వ్రాసిన గద్యకావ్యములు । వాసిగనంగఁ బ్రచారసాధనల్
చేసితి ; నాటకంబుల రచింపఁగఁ బ్రోద్బలమిచ్చితో, పితా!
వ్రాసి వినంగఁ జేయఁగల । భాగ్యము నోచుకొనంగనైతి న
న్నాసి దివంబు కేగుకతనన్ ; కృతినైన గ్రహింపు వేడెదన్॥

గ్రంథకర్త.

శ్రీ శ్రీనివాసో విజయతే.

బుద్ధిసాగరవిజయము.

నాంది

శా॥ శ్రీమంతుండయినంతమాత్రమున గ ♦ ర్వీభూతచేతస్కుఁడై
స్వామిం నైతిము లెక్కసేయక వృథా ♦ వ్యాసంగముల్సేయుచుం
దా ముందంజను వేయ దైవలిఖితా ♦ ర్థంబెట్లో యట్లాట, ఖే
దామోదంబులఁ గూర్చు కృష్ణుఁడు ప్రప ♦ న్నానీకముం బ్రోచుతన్॥

చ॥ సమయవిహారి, గోపకులచంద్రముఖీహృదయాపహారి, సాం
గమదను, డద్రిధారి రసికప్రవరుం, డురుబుద్ధిసాగరో
న్నమహితు, డాదిపూరుషు, డమేయుఁడునైన సుదర్శనుండు, ని
త్యము మిముఁ బ్రోచుగావుత చిరాయురుపేతవిభూతిదాయియై॥

(నాంద్యంతమున సూత్రధారుఁడు పుష్పాంజలిని సభాస్తారులపైఁ జల్లి)

సూత్ర—బావా! రావేమి?

మారిషుఁడు—(లోననుండి) నీవు పనిఁ జేయుచుండుము. నేనిక్కడనుం డియే "ఊఁ" అనుచుండును. పాఠము మొదలుపెట్టుము.

సూత్ర—బావా! నీకై సభవారు నిరీక్షించుచున్నారు.

మారి—నీకు వకాల్తనామా యిచ్చిపంపినాను. మనవిచేసికొనవయ్యా. వెనుకముందులు సర్ది చెప్పుకొనుటకును సర్దుకొనుటకును సామర్థ్య ము లేనివాఁడ వెట్లు సూత్రధారుఁడనని తగుదువని పోయితివి?

సూత్ర—ఓయీ! గడుసరి! నీతో; నాకేమి! గుండ్రాయి లేకున్నఁ గూఁతుపెండ్లియాగునా? ఆహా! ఏమి నాభాగ్యము సర్వకళాసమ న్వితులగు సత్సభాస్తారులచే శోభాయమానమై వెలుఁగుచున్న సభం గాంచఁగల్గితి. లోపాలోపంబుల సైరించి రూపకము నాదర భావంబునఁ దిలకించి సామాజికులమగు మమ్మును ప్రమోదితాత్మ లం జేయ సభవారి కంజలిఘటించి ప్రొక్కువాఁడ.

మారి—(ప్రవేశించి) బావగారు దిక్కులుచూచుచున్నారు. పైముక్కలడుగునంబడి నట్లున్నవి. వివరింపఁదగినది గ్రంథకర్తవిషయము.

సూత్ర—బావా! నిన్నిందులకేగదా నే నపేక్షించుట. సమయమునకు లేనిది .... ఎందుకో యనినట్లుగాక ప్రత్యక్షమైతివి వినుము.

సీ॥ అవిభిక్షునుబెట్టి ♦ యభ్యుదయముఁగోరు
హానుమన్మనీషిని ♦ నాత్మనెంచి
దివికేగిననుగూడఁ ♦ దిలకించచుండు నాఁ
టెనకూర్మిఁ బెంచిన ♦ జనకుఁ దలఁచి
తనబాధ్యతలెఱింగి ♦ తగురీతిగనుఁ గాచు
మాతృపదద్వయి ♦ మది నుతించి
తప్పుల దిగనాడి ♦ యొప్పున్న గ్రహియించు
మతిమంతులకు భక్తి ♦ నతు లొనర్చి
తే॥ గీ॥ కార్యసిద్ధికి శ్రీమనః ♦ కాంతుఁ గొలిచి
ఆంధ్రభాషామతల్లి సే ♦ వాభిరతిని
వ్రాసె వల్లి వేంకటసుబ్బ ♦ రావు "బుద్ధి
సాగర విజయ" మనెడి దృ ♦ శ్యంపుఁగృతిని॥

ఈగ్రంథరచనకుఁ గారణకారకులఁగూర్చి యిట్లనుమునియె.

తే॥ గీ॥ వచనరచనలఁ దిలకించి ♦ పరమపక్షులు
పద్యరచనకుఁ గడఁగఁ బ్రో ♦ ద్బల మొసంగ
వ్రాసె దుర్యోధనపరాభ ♦ వమనునాట
కంబు హితులకుఁగల కొఱ ♦ కంబు దీర్ప.

పైనాటకంబున కాంధ్రప్రపంచ మొసంగిన యాదరణమే యీ ద్వితీయకృతికి నూతయయ్యె.

మారి—బావా! రూపకావలోక సద్భావతత్పరులై వేచియున్న సభికులు కాలహరణంబున కోర్వఁజాలరు. ఏగుదము రమ్ము.

సూత్ర—మంచిది.

(ఇరువురును వెడలుదురు)

ప్రస్తావన.

శ్రీ శ్రీనివాసో విజయతే.

బుద్ధిసాగరవిజయము.

ప్రథమాంకము.

ప్రథమరంగము:—అడవి.

(బుద్ధిసాగరుఁడు నిదురించుచుండును.)

(తెరలో) ఓరా! ఈదీనురాలి మొఱ యాలకించి సంరక్షించువారు లేరా! కావరారా! ఓవృక్షరాజములారా! మిమ్మాశ్రయించి యుండు భూత, ప్రేత, పిశాచగణంబుల నన్నాహారముగఁ గొనఁ బంపుఁడు. ఈ మదోన్మత్తుని వశమగుటకన్న నట్లుసరులంబాయుటే ప్రశస్తకార్యము. ఆహా! నే నెంతపాపాత్మురాలను. ఇంతగ విలపించుచున్నను నాయార్తనాద మాలకించి కావ నేతెంచువారు కఱవైరిగా. ఓ! అమరులారా! మర్త్యులారా! వంటయింటికుందేలనైతివి, ఎందేగెదవని, మదగర్వాంబజ్ఞానంబునఁ ద్రోయుఁడు, ప్రపంచమును మఱచి నోటికివచ్చినటులఁ బ్రేలుచు, పరమదౌర్భాగ్యుఁ డొకఁడు నన్నపహరించి కొంపోయి మానభంగ మొనర్పఁ గృతనిశ్చయుండై యేతత్సన్నాహంబున నున్నాఁడు. ఏమహాపురుషులైనను నాపాలి దైవములై నాకు నండయై యాదుకొనుఁడు. మానవతిని రక్షించి పుణ్యముఁ గట్టుకొనుఁడు. రక్షింపుఁడు! రక్షింపుఁడు! ఆర్తజనరక్షా దీక్షితులగు పురుషసత్తములారా! నావిన్నపమాలింపుఁడు. ద్రౌపదీ మానసంరక్షకా! శ్రీకృష్ణపరమాత్మా! రక్షింపుము. రక్షింపుము.

బుద్ధి—(నిద్దురనుండి దిగ్గున లేచి) (స్వగతము) హా! ఇమ్మహారణ్యంబున స్త్రీరోదనము విననయ్యెడి. కలవరమా; యథార్థమా? (నల్దిక్కులఁ

గలయుంజూచుచు వినుట నభినయించును.) (తెరలో) ఛీ! ఛీ! ఇది ఎట్టిపాపిష్ఠిఘడియ! మానవతులఁ గారించు నధమాధముల దండించి మానరక్షణ మొనరించు మానవుఁడే లేఁడయ్యెఁగా లోకమున నట్టివారు వట్టిపోయిరి కాఁబోలును.

బుద్ధి—ఓదొడ్డతల్లీ! అంతటనాగుము. ఆగ్రహానలసంతప్తమానసవై నిజసుతులపై జాలి వీడకుము. మానధనుల సరళమధురవాక్యఫలంబు లనిర్వచనీయ శుభాశుభంబులే యగు. తల్లీ! ఆలస్యంబునకు క్షమింపుము. మించినదేదియును లేదు. నీమేన ప్రాణంబులకు నాప్రాణమడ్డము. (ఆ దిక్కున బోవును.)

(బుద్ధిసాగరుఁడు చిత్రరేఖతోఁ బ్రవేశించును.)

బుద్ధి—ముద్దుబిడ్డా! నీ తలిదండ్రు లెవరు? ఈవిపినంబున నీ దుర్మార్గులచే నెట్లు చిక్కితివి? నీకథనంతయు సాంగముగ వినఁగోరెదను. నీకెట్టి భయమును లేదు. ధైర్యమును వహించి సవిస్తరముగ వినిపింపుము.

చిత్ర—మానప్రాణంబులఁ గాపాడి యుద్ధరించిన మహానుభావా! యంజలిఘటించి ప్రస్తుతించెద. నేననంగదేశాధీశుని జ్యేష్ఠపుత్రికను కొంతకాలముక్రిందట మా వీటి కొక నలంతుక పేదరాలుగఁ జేరి సైరంధ్రిగ నెంతయో నమ్రతతో మెలంగుచుండెను. నల్లనివన్నియు నీళ్లు, తెల్లనివన్నియుఁ బాలుఁగ నమ్మిన మా యక్క చెల్లెండ్ర మాపెను కృతజ్ఞురాలుగ నమ్మి యాపెవెంట మామూలురీతిగ నే యుద్యానవనమునకు విహారార్థము బయలు వెడలితిమి. యమ్మో నా నీచురాలు మాటలసందడిని దారిఁ దప్పించి యొక నిర్జనప్రదేశముం జేర్చి వైనద్దియో చల్లెను. వెంటనే మూర్ఛిల్లితిమి. పదపడి తమచేఁ గృతాంతు నిలయమున కతిథులుగఁ బంపఁబడిన దుర్మార్గుల కధీన నగుటఁ దక్క నొం డేనెఱుంగను.

బుద్ధి—అమ్మా! ఆ దాసి మాయందఁజేయు నాడే దుశ్చింతతోఁ జేరెనన నోపు. ఈనీచురాండ్ర మనంబుల నెఱుఁగజాలక వారివేషభాషలకు

జాలిఁగొని చేరఁదీయుటయే మనలోపము. పిల్లివలెఁ జేరి దెబ్బలు లగుదురు. కపటమైత్రిం జూపుచుఁ దుదకొట్టి యాగడంబులకైన నుడి గట్టుటకు సాహసింతురు. (స్వగతము) రాచకార్యంబుల నిర్వర్తించి యుజ్జయినీ పురంబునుండి బయలుదేరిన నాటి శుభశకునంబుల ఫల మా దారితప్పి యరణ్యప్రవేశ మొనర్పుట యనివిధిందూరితిని. గాని దైవానుగ్రహమ్మున నీనాఁటికి నాయీప్సిత మీడేర్పు దివసము సమీపించుచున్నట్లున్నది. రతీ మన్మథు లట్లు యీకన్యకాసమాగమంబున మా సుదర్శనుఁడు ప్రకాశించుటొప్పు. నేఁటికి ధన్యుండ నైతిని. ఐతినా? ఈ శృంగారవతి మనోనిశ్చయం బెఱుంగకయే యిట్లను కొనుటెట్లు? పొరపడితిని; పొరపడితిని. ఇట్లని చూచెదఁగాక.

(బహిరంగముగ)

తే॥ గీ॥ వగల లెస్సఁగఁ బొగలెడి ♦ వారొ నిన్నుఁ
గన్న వారలు దూరము ♦ గాఁగ నీవు
గర్భదుఃఖంబునకు మేర ♦ గలదె తెలుప
కడుపులోపలఁ జెయివెట్టి కలఁచి నటులె॥

కాన వైళంబ నిన్ను నీవారిఁ జేర్చుటయే న్యాయమని నా నమ్మకము.

చిత్ర— (స్వగతము) పాప మీ ప్రాజ్ఞశేఖరునకు నీ దీనురాలి దుస్థితి విదితముగాక లోకముతో పాటుగ నెంచుచున్నాఁడు. హతవిధీ! నా నోఁటిమీఁదుగ స్వీయచరిత్రము చెప్పించు చున్నావు గదా!

(బహిరంగముగ)

ఉ॥ తల్లియుఁ దండ్రియుఁ గతియుఁ ♦ దామె దయానిధి యెవరులేరు, నా
చెల్లెలి కెట్టి ముప్పొదవఁ ♦ జేసెను, తాదృశు లేరు గాచిరో
తల్లడముందునే సవతి ♦ తల్లికిఁ దమ్మున కాళ్లలందు నే
నొల్లఁ బురంబుఁ జేరఁగ ♦ నోర్తుల గాసిలఁజేతు రీవయిఁ।

తల్లిలేని పుట్టినిల్లు నిరర్థకమండ్రు. తల్లి మృతినొందినపిదపఁ తండ్రి పినతండ్రితో సమానుఁడండ్రు. ఈ రెండు సౌఖ్యంబుల

ననుభవించుటయే గాక సవతితల్లిని మఱచిన కన్నతండ్రి యపాంగ వీక్షణంబులచే సంతుష్టి నొందవలసినవార మైతిమి. ఆపాటి యోగ్యతకుఁగూడ నపాత్రులమై పితనుగూడఁ బొట్ట నిడుకొంటిమి. భర్తృ యజ్ఞానపు టాజ్ఞయనెడి శృంఖలఁ గట్టువడి యొక్కొకప్పు డించుకంత ప్రేమంజూప వలసెఁగా యని కుందు నామెకు స్వేచ్ఛ గలిగె. అప్పు డామె చక్రాహాలికిం దగినవారు, మాకన్న నొండొరు లర్హులా? పాపపుణ్యంబు లా పరమాత్ముఁడే యెఱుఁగు. త్రికరణ శుద్ధిగ నా నమ్మిక యేమన, మా కొనఁగూడిన యీ దుస్థితికి నామె ప్రోద్బలమే మూలకారణమని.

బుద్ధి—అమాయకురాలా! ప్రపంచ చిత్రవిచిత్ర చరిత్రంబులు నీ కగో చరంబులు. వెఱ్ఱికుమారీ! వినుము.

తే॥ గీ॥ గర్భశుక్తిముక్తాఫల ♦ కామి యగుచు
నిజసుఖం బోడి కనుఁ బడి ♦ నెలలు మోసి
కంటి కగు ఱెప్పపోలికఁ ♦ గాచి పెంచు
తల్లి ప్రేమకు సాటి దీ ♦ ధరణిఁ గలదె॥

తే॥ గీ॥ తల్లి భూమి, పాలికుఁ డనఁ దండ్రి చెల్లు
తాలొ, బోలునొ, సమబుద్ధి ♦ ధరణి యొసఁగు
తండ్రి విడఁదీయుఁ డాలును ♦ దండులములు
కన్నవారల ప్రేమ లీ ♦ కరణి నుండు॥

తే॥ గీ॥ అనఘ రెండవ భార్య నా ♦ నరఁటిపండు
ఆముదంబునఁ దేలుచు ♦ నవని మఱచు
మొదటి యిల్లాలి బిడ్డల ♦ మోముఁ జూచి
కనికరంబునఁ జరియించు ♦ ఘనులె యరుదు॥

తే॥ గీ॥ కంచయే చేనుమేయఁగఁ ♦ గావ నగునె
తండ్రి కన్నులె యవరోధి ♦ తంబు లగుడు
సవతితల్లిని ననుట దో ♦ షమ్ము గలదె!
మహినిఁ గందకు లేక చే ♦ మకును దురద॥

చిత్ర—పితృసమానా! నా స్వల్పానుభవంబున కనుగుణంబుగఁ దమ రాడిన వాక్యరత్నంబు లత్యంత నీతిదాయకంబులు.

బుద్ధి— సుతా! నీ కే కొఱంతయుఁ గలిగింపక నాయింటం జేర్చి శీఘ్రకాలంబున నొక సుందరకారుండగు రాజేంద్రున కొసంగి పరిణయ మొనర్చెద.

చిత్ర—తండ్రీ! నాయెడ తమ రవ్యాజ కరుణోపేతులై రాజ్ఞిగ నొనర్ప సంసిద్ధులైనట్లు భావము సూచించినందులకు వందనసహస్రంబు లొనర్చెద. రాచవారలయింటి మర్యాదంబట్టి మన్మనోకాంతుని వరించుకొను హక్కు నేను వహించియున్నానని విన్నవించు కొనుచున్నందులకు మన్నింపుఁడు.

ఉ॥ బింక మిదేల యంచుఁ బెద ♦ విన్ విఱువన్ వల దార్యభూపవా
మాంకముఁ జేరు భాగ్య మల ♦ యబ్జభవుండు లిఖింపకున్న నే
శంకయు దోపఁగూడ దనఁ ♦ జాలుదునే మొ, పదింతు మున్న, తే
మంకరమిద్ది! ఏల మొగ ♦ మాటపు టర్మిలి టొంకు మాటలున్॥

కానఁ బరభృతత్వంబున కోడి స్వయం వ్యక్తిస్వాతంత్ర్యంబులఁ గోల్పోవ నిచ్చగింపను. ఈ నా పల్కులు తమ కించుక మనోవైకల్యంబుఁ గూర్చునను భయము గలిగెడి.

బుద్ధి—బాలా! మాతేనికై కన్యాన్వేషణంబు నొనర్చుచున్నవాఁడ నగుట, వెతుకఁబోయిన దీగ కాలికిఁ దగిలినట్లు దైవనియతిచే గన్యకామణి వచ్చుటచేతను, సురూప సుగుణ సంపత్తిచే నలరారు బాలికామణి వొటను, నా యాంతరంగి కాభిప్రాయంబును బ్రకటించితి. సృష్టికిఁ బ్రతిసృష్టి నొనర్ప సామర్థ్యముఁ గల వాఁడనా? ఘటనాఘటన సమర్థుండనా? నీ పురోవృద్ధిఁ దెలిపితి. అందులకై నిర్బంధించి కొంపోవుట లేదు. ఇంకొకతూరి యుభయ మొసంగుచున్నాఁడను; నమ్ముము. (స్వగతము) మానవతులకు మానరక్షణమే ముఖ్యముకదా. కులమునుబట్టి బుద్ధు లుద్ధతులం

తెలంగు. కులపుఁ గట్టడులమ, నాత్మస్వాతంత్ర్యంబుకు రాణిపదంబు నకన్న మిన్నగ నెంచె. ఔరా! ఈ సుగుణవతి బుద్ధిబాహుళ్యము!

(బహిరంగము) అమ్మాయీ! పోవుదము రమ్ము.

(ఇరువురు వెడలుదురు.)

ప్రథమాంకము.

ద్వితీయరంగము. (రాజభవనము)

(మదనసుదర్శనులు ప్రవేశింతురు)

సుదర్శనుఁడు — మంత్రికుమారా! ఎల్లరకును కుశలమా ?

మద — రాజేంద్రా! చిత్తము. తండ్రిగారు రాచకార్యంబుల నిర్వర్తించుకొని గృహోన్ముఖులైనట్లు వార్తలెవ్వేని నేతేరెనా?

సుద — ఉజ్జయినీ పురంబునుండి పయనమైరఁట. వారు లేని కొఱఁత ప్రతిక్షణంబును నన్నలజడిపెట్టుచున్నది.

మద — కలఁడుగదా, ద్వితీయామాత్యశేఖరుండగు దమనాఖ్యుఁడు. తమ రట్లువచింపనేల?

సుద — వారిరువురిలోఁగల తారతమ్యంబులే నాయొక్కయు గతించిన మానాయనగారి యొక్కయు మనఃఖేదంబుల కాస్పదంబులు. వారిరువురిలో నైకమత్యము లేదు. దమనునకుఁ బట్టుదలయే ప్రధానము. బుద్ధిసాగరునకుఁ బ్రతివిషయమునను బ్రతిఘటించి నిలుచుటయే ప్రధానాంశము. వారు లేని తరుణమున వారొనర్చిన విషయములఁ దలక్రిందొనర్చుటయం దమోఘబుద్ధిసంపన్నుఁడు. అట్టి దీమధ్యకాలంబులో సంభవించకుండ జాగరూకతతో మెలంగు భారము నాభుజములపై నున్నది. వారలైనచో దమనుని వ్యర్థప్రలాపంబులకు సకారణంబుగ బదులొసంగుచు యథావిధి సక్రమ పరిపాలనంబు నకుఁ దారిచూపుచుందురు. వీరిలో వీరికే భేదభావము లేకయున్న రాజ్యపాలన మెంత సుకరముగ నుండును. వీరలం బట్టియేగదా!

ప్రజలతోఁ గక్షలేర్పడియు అన్యోన్యత వీరలతోఁ బొడమిన సర్వ మంగళంబు లీడేరు.

మద—నృపాలచంద్రమా! తరతరములనుండియు స్థానబలములవలనఁ బదవులతోపాటు భావములును స్థిరపడిపోయినవి.

(తెరలో సేవకుఁడు)

సేవకుఁడు—మహారాజునకు జయమగుఁగాక! రెండవ మంత్రిగారు వాకిట వేచియుండి దర్శన మపేక్షించుచున్నారు.

సుద—ఓరీ! వారిని సత్వరముగ లోనికిఁ గొనిరమ్ము.

మద—రాజసత్తమా! సెలవొసంగెదరా? పోయివచ్చెద.

సుద—బాల్యమిత్రమా! మంచిది పోయిరమ్ము. జరిగిన ప్రసంగము లతిరహస్యములు సుమీ!

మద—రాజేంద్రా! తమ బోటివారి సాంగత్యమున నిట్టివి పరిచితంబులు.

(మదనుఁడు వెడలును)

(దమనుఁడు ప్రవేశించును)

దమ—నృపాలమౌళి దీర్ఘాలోచన నిమగ్నులైనట్లున్నారు.

సుద—అమాత్యశేఖరా! అట్టిదేదియును లేదు. ఆ పూర్వాసనంబున నుపవిష్టుండవుగమ్ము. బుద్ధిసాగరుని వృత్తాంత మేదైనఁ జారులు తెచ్చిరా?

దమ—రాజా చారులరుదెంచు వేళమీఱలేదు. వచ్చిన రావచ్చును. ఈమాఱు తప్పక వాగ్దత్తముఁ జెల్లించుకొని వచ్చెదనని యమాత్యుఁ డేగినట్లున్నది.

సుద—మంత్రివరా! వాగ్దత్తమేమి? చెల్లించుకొని వచ్చుటెట్టిది?

దమ—ఓహో! రాజసత్తమునకుఁ గార్యభారంబునఁ బ్రధానాంశంబగు ప్రధానివాగ్దానమే మఱపునకుం దగిలెఁగా? అట్టిచో ధర్మమా? తమరు మఱచిన విషయమును నేనేల తలఁచుట? అదిదాఁగునది కాదు. చంద్రుని విదియనాఁడు కాకున్నఁ దదియఁ గనరాదుమా?

రాచకార్యానంతరము బుద్ధిసాగరుఁడు రాజకన్యాన్వేషణా భారంబున నిమగ్నుండై క్రుమ్మరుచుండి కాఁబోలు రాకున్నవాఁడు.

ఉ॥ రూపసిగూడదంచనఁ గు ♦ రూపియు వల్దన జాణలుగా సువి
ద్యావరి పూర్ణశీల యన ♦ ధాతయె తానయి బుద్ధిసాగరుం
డీపుడమిన్ సతీతిలక ♦ మేర్పడఁజేయున గాధిసూనుఁడై
భూప వినంగఁ గల్గితిమె ♦ భూవలయంబున నిట్టి చిత్రముల్॥

సుద — ఓహో! మాయమాత్య శేఖరులకుఁ గల విముఖత్వము వలన రాచకార్యములతోఁ బాటు వివాహప్రశంసకూడ విమర్శనా పాత్రమైనట్లున్నది.

దమ — రాజా! మీరట్లుద్దేశించిన నావిషయమంతటనే విరమించుకొందును. హెచ్చరింపనెంచియే యుండలేదు. తమ రవివాహితులై యుండుటయు, సంబంధములన్నిటిఁ దూష్ణీంభావమున నీసడించుటయు నన్నును నాతోపాటు మఱికొందఱగు యుష్మచ్ఛ్రేయోభిలాషుల మనంబులు సందడింప నిట్లాడితి.

సుద — మంత్రివరా! ఇవి సరససల్లాపంబులు. అన్యథా యోచింపకుఁడు. కల్యాణకాలము వచ్చినను గర్మ వచ్చినను నాగదందురుకదా. ఏల యీ విచారము.

దమ — అధీశా! అట్టిధర్మవిశ్వాసమున మిన్నకుండ లేదుగదా?

సుద — కాక నేనొనర్చినదేది?

దమ — బుద్ధిసాగరుని సందులకు నియోగింపలేదా?

సుద — లేదు. వారి స్వయంకృషి. వారితోపాటు తమరును చుఱుకుగనే యున్నారు. తమరు తెచ్చిన సంబంధములు రుచించుటలేదు, వారింతవఱకును బేర్కొనలేదు.

దమ — ఏకోద్దేశంబు గలవాఁడనౌటను, తావక పాణిగృహీతిని నిర్ణయించుకొనుభారముఁ దమకు వదలుటయే యుత్తమమని యభిప్రాయ పడినవాఁడనౌటను నామందబుద్ధికిం దోఁచిన సంబంధములఁ దోడ్తోడన విన్నవించుకొనుచున్నాను.

సుద—మీ వాక్యార్థంబుల రహస్యార్థంబులు గోచరంబగుచున్నవి.

దమ—కల్ల నిజంబులు కాలక్రమంబున విశదపడు. అయ్యదే దేవార్చనలకుఁ గాలము సమీపించుచునటుల ఘంటారవంబులు వినవయ్యెడి. సెలవొసంగిన నేగువాఁడ.

సుద—మంచిది సెలవు పుచ్చుకొనుఁడు.

దమ—[స్వగతము]

అమ్మయ్యా! ఇప్పటికిఁ గొంతమనశ్శాంతి చిక్కినట్లే. నావల్కులవలన బుద్ధిసాగరునియెడ భూవిభున కేవగింపు జనింపఁ జేయుటలో కృతార్థతఁ గాంచితి ననుకొనందగు. నేడే నాజన్మసార్థకతఁ గాంచె నననొప్పు. రాజు వశ్యుఁడగుటయేకాక మంత్రిసుతుఁడగు మదనుని సందర్శనముకూడ లభ్యమయ్యె. ఈదినమే సుదినము. అతనిని బుజ్జగించి చేరఁదీసి నూరిపోసితిని. కుటుంబములోఁ బోరుపుఁ బుట్టించితిని. ఈచిచ్చు బుద్ధిసాగరుని కుటుంబమును దహింపకతప్పదు. మదనునితో, నీడుమీఱిన కొడుకీవింటనుండ నిన్నుఁగాదని మున్ముందు రాజున కర్ధాంగి నన్వేషించుటకు మీ తండ్రి రాచకార్యంపు మిషచే నెల్లెడల గ్రుమ్మరుచున్నాఁడంటిని. పిచ్చికుఱ్ఱవాలె నీతండు ఎప్పటికైనఁ దండ్రి తేఁబోవు కన్యకకై వేచియుండి యపహరింపఁ గృతనిశ్చయుండై యుండు. అంతవరకును ముక్కుమూసికొనియుండి నాకోర్కెసిద్ధింపగనే తేనిం జేరి బుద్ధిసాగరుని కుబుద్ధులిట్టివని నమ్మంజేసి నాకసిఁదీర్చుకొందుఁగాక.

[దమనుఁడు వెడలును.]

సుద—అహా! కలి చిత్రము. కాలమహిమము.

తే॥ గీ॥ అరయ దమనాఖ్యుఁ డిపుడిట ♦ కరుగుటకును
గారణంబేది? బుద్ధి సా ♦ గరుని యెడల
ఆత్మఁగలయట్టి కూర్మిఁబో ♦ నాడఁజేయ
వెగటుమాటల వివరించు ♦ విధముదక్క!

ఔరా! క్రోధమెంతలేసి పనులం జేయించును! ఓర్వలేమి హెచ్చుగఁ గూర్చును. అకారణ వైర మేర్పడంజేయును. వైరి సంపదయెడ నసూయఁ గూర్చును. శత్రువు కడగండ్లం బడుటకై యుపాయముల నెమకించు. అట్టిది సేకూరఁ జేయ స్వీయసుఖంబుల నైన నించుక భంగపాటున కిచ్చగింపఁజేయు. కలుషము నతిశయింపఁజేసి వైరి కపకీర్తి గూర్ప గలవి, లేనివి గూడఁ గల్పింప జొరవఁ గలిగించు. నీతిని, నీమమును, ఖ్యాతిని, మర్యాదను నట్టేటిలో ముంచి యెట్టి నీచవృత్తి చేనైనను వైరి పతనమునకై పాటుపడ సాహస మొదవించు. దమనా! అతనియెడల నీకేల నిట్టి కుబుద్ధి? మానవుని సత్యశౌచాది సద్ధర్మ సుగుణంబులే సహాచరంబులై దిగ్విజయంబు చేకూర్చు. (వెడలిపోవును)

(తెరవాలును)

ప్రథమాంకము

తృతీయరంగము.

(రహస్య మందిరమున మదనుఁ డుచితాసనంబున నాసీనుండై యుండును)

మద—

ఉ॥ అంగనపేరు మాత్రమున ♦ నారడిగల్గె మనం బదెంతొ ర
వ్వంగినిఁ గాంతు ముందనెడి ♦ వాంఛ పితర్ నిరసింపఁ జేసె నా
సంగడి కాఁడు నా నృపతి ♦ సఖ్య మదెంతని దోఁచఁ జేసెఁ గ
న్నుంగవ కాంత గన్న నమ ♦ నో ధృతులెట్టులఁ దెల్లవారునో!

సుదర్శన క్షితీంద్రు దర్శనానంతరము మందిరమునుండి వెలువడునెడ దమనుఁ డేల గన్పట్టె? నిర్మలంబగు నామనంబున కింతం తెనరాని యాయాసంబు లవరచె. సంపూర్ణాంధకారంబునం బడక పూర్ణమగు వ్యక్తతలేక గోలనై పోయితి. ఆలోచనలకు మేరలేదు. యుచితానుచిత విచక్షణాజ్ఞానము నశించినది. ఇద

మిద్ధమని నిర్ధారణ జేసికొనుటకు స్థిరచిత్తము లేదు. గగన పుష్పంబుపై నాసను గలిగించి చిత్తవైకల్పికత్వముఁ గూర్చిన దమనా! నిన్నేమనందు. ఏక పుత్రిండనని యసమాన కరుణా విశేషంబులఁ బెంచుచున్న తండ్రిగారి కిట్టి బుద్ధిమేల అంకురించె? సుదర్శన భూధవునకుఁ గన్యను జేకూర్చుభార మీయనగా రేల వహింపవలయు? ఇందుఁ దప్పిద మేమున్నది? లేకపో లేదు. అవివాహితుండ నగు నా మాట మఱచి యితరుల బాధ్యత వహించుట! ఇరువురు బాలికారత్నములకై వెనుకు చున్నాడేమో? అప్పుడు నాకును నామిత్రుఁడగు సుదర్శనునకును స్వయంవరంబులవట్ల భేదాభిప్రాయంబు లేల పొడమకుండు? మాతండ్రిగారీవిషయంబున జోక్యము వహించుటలో దూరాలోచన యొనర్చినట్లు కన్పట్టదు. నేను వారి యాజ్ఞలఁ దిరస్కరించువాఁడఁ గానని నాయనగారభిప్రాయపడి యుందురు. కాని మదోన్మత్తత యీ మదనునితండ్రి వాచాశృంఖలల విదళింప జేయునని భీతి పొడముచున్నది. బొమ్మ తెరచాటున నుండఁగనే యీ మదనుని పోకడ లిట్లు ప్రాంగి పోవుచు వివిధగతులఁ ద్రిప్పించుచున్నది. తెరదాటినంతట, నిప్పుదొక్కినఁ గోఁతి నాదును గాఁబోలును. మదటి కంటిన యీ వ్యామోహము కంకరవట్టు పట్టినది. ఏపనియందును బుద్ధిని జొరనిచ్చునట్లు లేదు. ఏకాంతమున నున్న కొలందిగ నద్దముఁజూడను, దిద్దుకొనను, బుద్ధులన్నట్లు వికారంబు లెక్కువగుచున్నవి.

ఉ॥ లోకము వారలందరు వి ♦ లోకనఁజేయఁగ నన్నుబోలు న
శ్లోకుఁడు లేఁడటంచు ధర ♦ లో నిఁక నందురె మారుబారికేఁ
దాకి పితేచ్ఛలన్ జెఱుపఁ ♦ దారసిలన్ గొన నాపలీమణిన్
మేకొనుమాత్మమా! తనకు ♦ మించినధర్మము లేదు భూస్థలిన్॥

ఇదియె నానిశ్చితాభిప్రాయము. ఇతరుల దయాదాక్షిణ్యంబులతో నాకణుమాత్రమేని సంబంధము లేదు. నాస్వతంత్రభావము నరికట్టువారెవరును లేరు. ప్రతిక్షణంబును జరుగుచున్న విశేషంబుల నతిజాగ్రత్తతో గమనించుచు ఫలమునందుకొన నిరీక్షించుచుండుఁగాక!

(వెడలిపోవును; తెరవ్రాలును.)

బుద్ధిసాగరవిజయము.

ద్వితీయాంకము.

ప్రథమరంగము.

(బుద్ధిసాగరుని మందిరము)

భాగ్యశ్రీ—(ఇటునటుచూచుచు) నాథుఁడేల ననుఁజేరరాక యాల సించుచున్నాఁడు. దాసియనృతమాడెనా? చూచుటనభినయించి నాథుండు పరపురుషునితో నంతఃపురమును జేరవచ్చుచున్నాఁ డేటి విడ్డూరము! కానిమ్ము; ప్రాణనాయకుఁ డభిలషించిన కార్య మేనిట్లు సందేహించు టొప్పదు.

(బుద్ధిసాగరుఁడు సహచరునితోఁ బ్రవేశించును)

భాగ్యశ్రీ—నాథా! ఆజ్ఞసేయ నిదె ప్రణమిల్లుచున్నది.

బుద్ధి—దీర్ఘాయుష్మాన్భవ .[సహచరునుద్దేశించి] చిత్రరేఖా! ఈడుపులం దీయుము. (భార్యనుద్దేశించి) కాంతా! ప్రయాణపు టాయాసం బున నిబ్బాలికామణి బడలియున్నది. తగుయుపచారంబు లొనర్పం బడునట్లు చూడుము. ఈ యంతఃపురమునందే యీమె నుపచరించు నట్లు దాసీల కాజ్ఞలొసఁగి యాహారాదులుగూడ నిందేఁ జేర్పంబడు నట్లు ముదలనిచ్చి నీవిటకు శీఘ్రముంబుగ రమ్ము.

బుద్ధి—ఓరీ! ఎవరురా అక్కడ?

సేవకు—చిత్తము. దేవరవారి పాదసేవకుఁడిందున్నవాఁడు.

బుద్ధి—సేవకా మదనునిఁ దోడ్కొనిరమ్ము.

సేవకు—చిత్తము.

[మదనుఁడు ప్రవేశించును]

మద—నాయనగారి పాదపద్మములకు నమస్కారము.

బుద్ధి—చిరంజీవిగమ్ము. ఆయాసనంబున నాసీనుఁడవుగమ్ము. మోము కళావిహీనమైయున్న దేల? శరీరమం దస్వస్థత యేమియు లేదుగదా?

మద—తండ్రీ! నాయెడఁగల పరిపూర్ణానురాగమే మదనాస్వస్థతయా యనిప్రశ్నింపఁజేసె. కలత నిదురనుండి లేచి వచ్చుటయు అయ్యది మనంబు నమితంబుగ నాయాస పఱచినదియుఁ దలపని తలంపగుటయు మోమున కళమార్చి యుండనోపు.

బుద్ధి—అట్టిదేదీ పేర్కొనుము.

మద—తమరే తెంచినట్లు విని యేను తమరిని దర్శింపరాఁగా నేతత్కాలంబునఁ దమహస్తగతంబగు వస్తువునొకదానిని రహస్యభేదశంకచే నాకంటఁ బడకుండ గుప్తముగ దాఁచిన ట్లే గలగంటి. అభేదవృత్తిని మెలంగు మన కీయర్థవిహీనమగు స్వప్న మేమాయని కలలోనే నాలోనే వితర్కించుకొనుచు దల్లడిల్లితిని.

బుద్ధి—కుమారా! కలలోఁగూడ నిట్టిది పొడమదని దీనిభావము. శాంతివహింపుము. నిద్రాభంగమొనర్చక నీలు లేదయ్యె. ఈక్షణంబున నీవిందుండి పయనంబై ఉజ్జయినీపురంబేగ వలయు ఇటురమ్ము.

మద—సమీపించును [బుద్ధిసాగరుఁడు చెవిలో నేదియో జెప్పును]

బుద్ధి—ప్రియసుతా! గ్రహించితివా? సత్వరముగ నేగుము.

[మదనుఁడు వెడలిపోవును]

బుద్ధి—

ఉ. నందనుఁ డాడినట్టి వచ • నమ్ములె సాక్ష్యము, గాక మారితో
మందిరమందుఁ జేరి తన • మాటఁ గనుంగొనెఁ బొంచియుండి, మే
నందముఁ గప్పిపుచ్చి, పుర • ప్రాగ్రణి వేషము, బాల తాల్చి నన్
ముందుగ మొండిచేతులఁ బ్ర • మోదమునన్ వెలిబెట్టితే సుతా!

అమాయకుఁడగు సుతుండు తనబుద్ధిసూక్ష్మత బయలుపఱుప నిట్లాడెనేగాని నిజసంకల్పంబునకు విఘ్నకారణంబని యెఱుఁగఁడయ్యె. చతురుండైయే యెడల నిజాభిప్రాయంబును డాచి కార్యతత్పరుండై యుండు. ఉజ్జయినీపురంబునుండి సుతుఁ డరుదెంచు లోపల విషయంబులఁ జక్కఁబెట్టవలయు. ఇంతి రాకుండుట కేమి కారణము?

(భార్యప్రవేశించును)

భాగ్యశ్రీ—నాథా! ఆలస్యంబునకు క్షమింపుఁడు.

బుద్ధి—సఖీ! ఆ బాలకు వలయు సౌకర్యముల నేర్పఱిచితివా?

భాగ్యశ్రీ—చిత్తము.

బుద్ధి—కాంతా! ఈయంతఃపురంబునకుఁ బోతుటీఁగ నేనిఁ జొరకుండఁ జూచుటయు, సర్వకాలసర్వావస్థలయందును నీ వానెలఁత నెడబాయకుంటయు నీ వొనర్పవలసినవిధి. ఉపేక్షయనర్థమునకు మూలము సుమీ! అత్యంతశీఘ్రకాలములో నీకన్యకను మనఱేనికొసఁగి వివాహ మొనర్పవలసియున్నది. ఈరహస్యము మదిలో నుంచుకొమ్ము. ప్రాణసఖీ! మోము వెల్లదనము నా నియమితకార్యభారంబును సూచించుచున్నది "పుత్రుండగు మదనుని యాపు టెట్లా? మొగమాటము లేక పల్కఁదరమా?" యని సందేహించుచున్న ట్లున్నది. తరుణవయస్కుండగు తనయుం డిట్టి విషమస్థితి యందు నింట నుండుట యుపద్రవకరంబని యీనిమిత్తంబుననే ఉజ్జయినీపురంబున కనిపితిని.

భాగ్యశ్రీ—ప్రాణనాథా! సుగుణఖనియగు మనపుత్రుండు వివేకవంతుఁడౌకదా? అట్టి దారుణకార్యంబొనర్చునని సందేహమేల? ఎక్కట్లు?

గ్రామాంతర మంపితిరా? వారముదినములనుండియుఁ బిడికెడు మెతుకులు దినుటలేదు.

బుద్ధి—చెలీ! దమనుఁడు స్వయముగనో యితరుల మూలముగనో మదనుని కైవశపఱుచుకొని దుర్బోధలంగఱపి యంగజుఁబారికిం ద్రోసి నేనొక కన్యందెత్తు గమనించుచుండుమని యుసిగొల్పినట్లు నాకనుమానము. అతని వైఖరియు వచనధోరణియు బాగుగ బట్టిచ్చుటచే మదను నంపుట విధాయక కృత్యమయ్యెను.

ఉ॥ నమ్మొనరించఁగాదె పర ♦ భామలు వావిని తల్లితోడులే
సుమ్మను నీతిఁ, దెల్వి యగు ♦ శూన్యము దేహికి; గామవశ్యతన్
గొమ్మరొ! యింద్రుఁడుం శశియుఁ ♦ గూడ విచారణ సల్పఁగల్గిరే
క్రమ్మ మదాంధకారము వి ♦ కారము హెచ్చును గ్రుడ్డివౌ కనుల్॥

భాగ్యశ్రీ—నాథా! ప్రపంచానుభవంబున గడతేరిన తమకెద్ది దురూహ్యంబగు? ఈతమపదదాసి యాజ్ఞల శిరసావహించి మెలగెడిని. కాలాతీతమగుచున్నది ప్రయాణప్రయాసము వాయ జలకంబాడి భుజింపఁ వేడుదాన.

బుద్ధి—ఏమంటివి? అబ్బాయి వారము దినములనుండియు మామూలు రీతి భుజించుట లేదనియా? ఆమాట వినినప్పటినుండియు హృదయము దహింప మొదలిడినది. ఛీ! ఈ పాడు మంత్రిపదంబునుఁ బట్టిగదా సుతు నెడఁబాయవలసె. పదవియే లేకున్న భూజానికిని నాకునేమి సంబంధము? ఊడిగమునఁగదా యీ ముప్పుగలిగె. కుమారునకీయకాలపు పయనము దేహస్థితికిభంగముఁ గూర్చునో. రాజుతున కాలింగూర్ప నెంచుటయు, నిజసూనునకై యీప్రయత్న మొనర్ప కుండుటయు నాలోపము. దైవమా! పుత్రుని యారోగ్యవంతునిగఁ సంరక్షించు భారము నీయది. దుర్బోధనల ఫలంబు లంది సన్మార్గగామియగుగాత! దైవమే యాతనికిఁదిక్కగుఁ గాత!

భాగ్యశ్రీ—నాథా! బిడ్డనితోఁ దమ రీబాలికామణిని బ్రభునకైఁ దెచ్చితి నని విస్పష్టముగఁ బలికియుండిన నవ్యథా దలంపక సోదరీన్యాయంబునఁ బ్రవర్తిలుచుండెడి వాఁడేమో.

బుద్ధి—కలికీ! ఆతఁడు దుర్బోధలఁ దగుల్కొనియున్నట్లు వాక్యసరళి వివరించుటచే నదొక్క చెత్రోవగ గన్పట్టె.

భాగ్యశ్రీ—పరుల బోధనల జనకు నగౌరవపరుప సాహసించిన యాతఁడు ప్రేమాస్పదుండెట్లగు? విచారము మానుఁడు. ఏగుదము దయచేయుఁడు.

బుద్ధి—మంచిది రమ్ము.

(ఇరువురు నేగుదురు.)

(తెరపడును).

—* ద్వితీయాంకము *—

ద్వితీయరంగము.

(మదనుఁడు—రహస్యమందిరము)

మద—కన్యారత్నమా!

తే॥ గీ॥ నయనపాంగవీక్షణములే ♦ నీరజాక్షి
పైపైఁ బ్రసరింపఁ దనువు కం ♦ పంబునొందె
నిందుచూడ్కుల కెనయైన ♦ నిముషమునను
దనువు బరువును వాపు నా ♦ ధార మీవె॥

ఈస్వల్పున కంతభాగ్యమా? మేఘములలోని మెఱుపట్లు నీవదనము ప్రకాశించుగదే! కళానిధికి కళంకముగలదు. అట్టిది లేమిచే నీమోముజాబిల్లియే శ్రేష్ఠతమము. నీ పాదములకు నిలయమనుటలో నతిశయోక్తి లేదు.

తే॥ గీ॥ మోమునందమ్మునకుఁ దోడు ♦ ముంగురులును
సొగసుఁగుల్కెడి చేరేఁడు ♦ సోగకనులు

నన్నుఁ గనుమంచుఁ బైఁగొన్న • నాసికంబు
సహజ సౌందర్యభూష లే • చానసీకు
దాఁచ లేఁడాయెఁగాఁదండ్రి • తంత్రకలన॥

నేను తెలివిమాలినవాఁడను, అత్యాశాపూరితుఁడను, నన్ను నే నెఱుఁగనివాఁడను, ఆత్రగాఁడను.

ఉ॥ ఆముఖబింబదర్శనము • నాత్మ ననారత మిచ్ఛగించు చే
జామునఁ దండ్రి చేరుఁ గనఁ • జాలుదొ చాలనొ యాశుభాంగి నం
చేమురిపంబునుంటఁ గని • యిందుముఖి ప్రసరించెజూడ్కులం
చే యుదమందఁ జోద్యమె సు • మీ! చెలికూర్మికి భాజనంబనే॥

అచ్ఛపలాక్షి దృక్పథంబుపై నింత పమ్మికమునిచి యొండొరుల చూపులు లగ్నమైనవని భ్రమసి యనురాగచింతాభరంబులమునిఁగి దరిఁగాననట్లు తపించు టేటిన్యాయము? నావైపునఁ గాంచియుండి నన్నుఁ గానకుండరాదా? ఆసుందరీ సుందరముఖకమలంబు వీక్షింప నేవేఁచి యుంటిఁగాని, ఆచక్కనే వేఁచియున్నట్లా చక్కరబొమ్మ ఎట్లెఱుఁగు? ఏనదానెనని మిన్నకుండక జనకుఁడు పిలిపింపఁగ నేనేల వదరితి? నాశుఁణయముమాటఁ దలఁపడని కోపము, గొని తెచ్చిన కొమ్మను కన్నులఁగాంచనీయక దాచి నన్నురప్పించు కొనెగా యను తామసము, ఒడలుమండింప నాగోతిలో నేనేపడితిని. సహనము లేమి నీచేటుమూడె. ఇంటనుండి శక్తికొలఁది శ్రమపడ శృంగారవతి సాన్నిధ్యమొక్కనాఁటికేని లభ్యమగుట కవకాశముండి యుండెడిది. చేతులారఁ జెడఁగొట్టుకొంటిని.

తే॥ గీ॥ తండ్రిపన్నిన పూర్వాహ్ణ • దన మొనర్చి
శక్తియుక్తులఁ బ్రకటింప • సాముఁజేయ
శృంగభంగము విధియె ని • ర్మించెఁగాదె
గ్రుడ్డునకు కాన పిల్లను • కొఱకరింప॥

తండ్రియాజ్ఞ నెన్నక వనితాసందర్శనభాగ్యమే నభిలషించుచు నింటఁగాకున్న నేమి ప్రచ్ఛన్నవేషంబున నిప్పురవరంబున నేనుండి తదుపరి వనితాపహరణంబునకుఁ బాఁడికల వేయుచుందునా? ఛీ! బుద్ధిసాగరుని పుత్రుండిట్టి నీచకార్యంబున కొడిగట్టె నను వదంతి ప్రామోగదా? జీవితకాలమంతయు నతికియుండు యపవాదమెట్లు భరించుట? గర్హ్యుండనై మను టొప్పునా? నావిశ్వాసంబురీతిగఁ బరస్పరావలోకనంబులే ప్రాప్తించియున్నయెడల నారీతి నబ్బాలయుఁ జలితహృదయయై సంతాపమొందుచుండు. లేకున్న నాకోదన మరణ్యారోదనమననొప్పు. ఏల నాకీవెఱ్ఱి? ఈబాలపై నాకింత మరులేల? ఇంతకన్న సౌందర్యవతులు లేరనియా? కాదు, కాదు. ఇక్కన్యయే నామనోహారి. కూడిన నీమెనే కూడవలయు. గృహస్థాశ్రమ మీమెతోనే స్వీకరింపవలయు. దైవఘటన యున్నఁ దప్పదు. తండ్రియాజ్ఞలఁ దారుమారులొనర్చుటయు, దాస దాసీజనంబుల వశపఱచుకొని బలంగ్రహించుటయు నేనొల్ల.

ఉ॥ నీవుదమాన దైవతమ ♦ నిష్ఠమెయిన్ వచియించువాఁడ నా
చూపులకయ్యెఁ దావలము ♦ సుందరి, యన్యు నేవరింప, నీ
మూఁపులపైన భారమును ♦ మోపితిఁ, దండ్రికొ కాంతకోమదిన్
భూపునిరాకరింపఁ దగు ♦ ప్రోద్బల మిత్తువె యెట్లుఁగూర్తువో॥

ఉ॥ ఒండొరులాత్మమెచ్చి మద ♦ నోత్సవమందునఁదేల బ్రహ్మ వ్రా
లుండవలెన్ లలాటమున; ♦ నూరకఁ జంకలఁ గొట్ట నేమగున్
పంచునె యీప్సితంబు, లన ♦ పాయత భక్తులకోర్కె దీర్పఁడే
యండజవాహనుండు నను ♦ నంగజుఁబారికిఁ ద్రోసిపుచ్చునే॥

శ్రీకృష్ణా! నేను నిష్కల్మషుండను. నాప్రేమకాస్పదులీ నెలంతఁ దక్క యన్యులు లేరు. కృత్రిమానురాగముగాదు. మనోవాక్కాయకర్మల నేనాకాంతనే ప్రేమించియున్నాను. జనకునాజ్ఞఁదీర్ప నిలువీడి యేగువాఁడ. ముకుందా. ఐనవారినిగాని ద్రవ్యార్జనాపరులకు లంచమిచ్చిగాని వంచనమొనర్చియో బల్మినో కన్యంగ్రహింప నెంచలేదు.

నీదయను ఆపె మక్కువను నపేక్షించుచున్నాను. నీవే నాయభిమానదైవమవు.

(తెఱలో) ఆర్యా! నమస్కారములు. ప్రయాణసన్నద్ధులైన యంగరక్షకు లిరువురు తండ్రిగారియాజ్ఞమైవచ్చి వాకిటనిలచితమరాక నిరీక్షించుచున్నారు.

మదనుఁడు—సేవకా! ఇదే వచ్చుచున్నానని వారికిం దెల్పుము. పొమ్ము. ఔరా! కాలమహిమ! నోరుజారిమాటాఁడు టెంతటి యనర్థములకు నాలవాలమయ్యె! తండ్రికి నాయెడఁగల నమ్మిక చెడియె. ఆజ్ఞలధిక్కరించి యుండేనిలచి ప్రయత్నములఁ బ్రతిఘటింతు నేమోయని భటుల నన్దరుముకొనిపోవం బుత్తెంచె. నాయవ్యక్తప్రసంగము జనకునికి నాయెడఁగల పరిపూర్ణానురాగంబును పెనునమ్మకమును విడనాడ జేసెఁగా! లేదు, లేదు. నాయనగారు వ్యవహారములు నావ్యామోహంబున మారురూపుఁ దాల్చునని నన్ను పరిహరింపఁ దలఁచిరి. అటులేయగుగాక. నాయనగారి కార్యదీక్షాపరత్వంబును, స్వార్థత్యాగంబును నన్నోముగాత. ఈయస్ఖలిత బ్రహ్మచారి కంకురించిన యనురాగలత యుషఃకాలభానునట్లు క్షణక్షణ ప్రవర్ధమానమై దైవ నియతిచే నశి మోహనాంగ స్కంధావారంబున కలిబిల్లిగ నల్లుకొనుగాత. తడవుచేయుట లెస్సగాదు. ఏగెదగాక.

[వెడలిపోవును].

(తెరవ్రాలును.)

బుద్ధిసాగరవిజయము.

తృతీయాంకము.

ప్రథమరంగము.

(అంతఃపుర మందిరము. చిత్రరేఖ యాసనమున నాసీనయై యుండును.)

చిత్రరేఖ—బుద్ధిసాగరుఁ డుత్తమోత్తముఁడు. అనుకూలయగు నాతని యింతి సాధ్వీమతల్లి. నన్ను పూలలోఁ బెట్టి పూజించుచున్నారు. పదచలన మొనర్ప నవసరములేకుండ నన్నివసతుల నిందే యేర్పఱచిరి. వనవిహార మొక్కటియే కొఱఁత. నన్నిట్లుంచుటలో వీరియుద్దేశ మీ కుటుంబమువారికిఁ దక్క నన్యులకేనును నా కన్యులును గోచరము కాకుండుట యనుకొన వలయును. మంత్రి వెడలించిన యూహయే దీనికి మాతృక. మేమీ గృహప్రవేశ మొనర్చినపు డీ యావరణములో విద్యుల్లతవోలె మెఱసి భ్రమింపఁజేసిన పుణ్యుం డెవండో కదా.

తే॥ గీ॥ త్రోసిరాజను వదన స ♦ రోరుహంబు
పూర్ణశశినేని, మీస లే ♦ పురుషుఁ గూర్చి
ప్రథమ సృష్టిపైఁగల పక్ష ♦ పాతమొకద
శీతకరుఁడతఁడె మనో ♦ వశీకరుండు॥

ఆహా! ఏమి యాముఖసంపద! దీనిఁబట్టి సర్వాంగ సౌందర్యంబును నిరుపమానమై యుండి తీరవలయు.

తే॥ గీ॥ మనము హరియించి మదనసా • మ్రాజ్యలక్ష్మి
గా, గ్రహింప విన్నాణపుం • గాన్కలోయనఁ
బ్రేమపుం జూడ్కులను మనో • ప్రియుడు తాను
పువ్వులుగఁ జల్లెఁ బుంఖాను • పుంఖములుగ॥

ఔరౌరా! ఏమియా వన్నెగాని చతురతా విశేషము! బుద్ధిసాగరుని కంటఁబడనొల్లక సందర్శన మాత్రంబున ముప్పిరిగొన్న వలపుఁదెలుప నెంత చిత్రముగ మెలఁగుచు భావాళి వివరించె! తొలుదొల్త నా సుందరాకారుఁడు నిర్మలమగు నా మనము నాకర్షించి తత్తరమందుచు మధ్యమధ్య నరుకుచుండుటేలనా? యని సందేహించుచు నిలిచియుండి బుద్ధిసాగరుని పిలుపున మోహజలధినుండి తెప్పరిల్లి వనరమణీయకమును గనుచుంటినని తప్పుకొంటి. మనోహరా! గాఢముగ నాటనేసిన దృగ్బయంబుల ధాటి యట నానాఁడు నస్వప్నావస్థఁ జేయుటయెగాక ముందువెన్కలా లోచింపనీయక నేఁటివఱకు మనంబు నుఱ్ఱూతలూఁగుచున్నది. నా యుత్తలపాటునకు మేరలేదు. నే నసమర్థురాలను. బుద్ధిసాగరుని స్వాధీనమున నున్నదానను. ఈ విషయంబులు పరిచితంబులయ్యు నుపేక్షవహించి యీమహామహుఁడు నన్నాంచి గేలందరామి నా దుర్దినంబు లనవప్పు. కమలాసనా! చూపులఁగూర్చిన వాఁడవు ప్రాపునేలఁ గూర్పవు? ప్రాణదాతయగు బుద్ధిసాగరునకును వానికిని మనోభావంబులు భేదించినట్లే. నా నిక్షేపము జాడయి యుండనోపఁడు. భూపుఁ డమాత్యునింటికడఁ దట్టాడుచుండునా? ఇట్టి దసంభవము.

(తెరలో) అమ్మా! నాయనగారు వచ్చుచున్నారు.

(బుద్ధిసాగరుఁడు ప్రవేశించును)

చిత్ర—తండ్రిగారికి సుత యిదే ప్రణమిల్లుచున్నది. ఈ పీఠంబు నలంకరింపుఁడు.

బుద్ధి—శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు.

(పీఠము నలంకరించి) సుతా! కూర్చుండుము. బిడ్డా! కుశలమా! అన్నపానాదికములన్నియుఁ దిన్నగ జరుగుచున్నవా? కాఁబోవు మా ప్రభ్వికి నీ దీనుని సపర్య లామోదకరంబులుగ నున్నవా?

చిత్ర—(నవ్వుచు) నా కేలోపఁబులును లేక పరమసౌఖ్యంబున నున్నదానను. రెండవప్రశ్నకు బదులాడ ననమర్థురాలను.

బుద్ధి—బాలా! భువన సుందరుండగు మా భూపాలుని రేపటి మాపున ద్వదీయ దర్శనార్థము వీడ్కొని రాఁదలచితిని. సుస్నాతవై శ్వేతదుకూలంబులం ధరించి, వివిధ విభూషణా ద్యలంకృతవై విరాజిల్లు చుండుము. మీ యిరుపురి సురూప సౌభాగ్యంబు లొండొరులం బ్రేమించు నను పెనునమ్మిక యధికంబుగఁ గలదు.

చిత్ర—తండ్రీ! దైవము మన కా శ్రమను బాపె.

బుద్ధి—బిడ్డా! ప్రభువునే వరింపఁ బరాత్పరుఁడు సంకల్పసిద్ధిఁ గూర్చునా?

చిత్ర—తండ్రీ! సంకల్పసిద్ధిఁ జేకూర్చెంగాని, మీ రనుకొనినట్లు కాదు. నే నల్లనాఁ డనుమానించినట్లే తటస్థించె.

బుద్ధి—ఏమా యెనమ్మా?

చిత్ర—తండ్రీ! నావంటి దురదృష్టురాలికి నృపతి కేల్వట్టు భాగ్య మబ్బునా? తమ రెట్టి దొడ్డ యుద్దేశమున నున్ననేమి? నా నుదుటి వ్రాలును మార్పగలరా? విధివ్రాలు తప్పింప నెవరివశము? అందని మ్రానిపండుల కఱ్ఱులఁ జాచిన నేమి లాభము? తమ యభిప్రాయ మునకు దైవ సంకల్పము భిన్నముగనున్న మీ యభిమత మీడేర్ప జాలనిదాన నగుదునేమో యని నే నలనాఁడే మన ప్రథమ సమా గమ దినమున మనవి చేసికొంటిని. అట్లే మనోవిభుఁడిట నమరె.

బుద్ధి—ఏమేమి! ఇచ్చటనా! విభుఁడా! తటస్థమగుటయా! మాటలు అర్థరహితములు.

చిత్ర—కాదు. క్షమింపుఁడు. అర్థసహితములు.

బుద్ధి—కుమారీ! అతని నెచ్చటఁ గాంచితివి? ఎపుడు గాంచితివి? ఎట్టివాఁడు?

చిత్ర—పురుషవేషంబునఁ దమ గృహప్రవేశ మొనర్చునాఁడు మీ యారామములోని వృక్షములమాటున డాఁగిన యాతఁడు నా మనంబును దొంగిలించె. మోముమాత్రమే గోచరమయ్యె. ఎవ్వరో నే నెఱుంగను.

బుద్ధి—బాలా! దాంపత్యము జన్మాంతమువఱకు సుస్థిరమై వెలయు బంధము. పాత్రాపాత్రతలు దీర్ఘపుమంతనం బొనర్పందగిన యంశంబులు. మేడిపండువోలె సుందరాకారుల బుద్ధులు విచారణీయంబులు.

చిత్ర—దైవబలంబు మనోబలంబునకన్న మిన్నకదా. మానవుల చర్యలు దైవప్రేరితంబులు. దేహి యోగ్యతానుసారముగ సుఖదుఃఖంబు లనుభవించుచుండు. నాకుఁ దగని వానిపై నాప్రేమ నేల శ్రీహరి పారఁజేయును? తగనివానినిఁ దమచేఁ జించి చెండాడం జేసెను గాని వ్రాఁతం ద్రోఁసెనా? దైవబలమెన్నదరమా!

సీ॥ వలువలనూడ్చి ద్రౌ • పదిని బరిభవింప
 ధార్తరాష్ట్రులు చేరి • ధన్యులైరె
దబ్బరలాడింపఁ • దగుపాట్లఁబడెఁగాని
 కౌశికుమాయలు • వాసిఁగనె
శ్రీరాము పట్టాభి • షేకార్థమిడినట్టి
 శుభముహూర్తమున న • శుభము మూడె
ముల్లోకములలోన • మ్రొక్కులందిన శౌరి
 బోయని వింటిచే • భువినిఁ బడఁడె
తే॥ గీ॥ బహుళబుద్ధియుఁ బ్రకటిత • బాహుబలము
 ధైర్య శౌర్య గుణాధిక • దర్పములును
 భోగములఁబాసి వడయుత • పోబలంబు
 దైవదత్తము లెదురునే? • దైవబలము॥

కావున భగవదిచ్ఛానుసారంబుగఁ బ్రవర్తించితినని నే నమ్మియున్నదాన.

ఉ॥ వేఁడెద దోసిలొగ్గి మన ♦ విన్ ఏను మాదుఁ గృతఘ్ను నేను

బుద్ధి— ... ... కా

పాడిన నాఁడె పల్కితి వి ♦ వాదముకల్గుట యేలబాల నీ
వాడిన వేఁడి కోల్వ్యథ మ ♦ దాశయ భంగ మనాదరంబుగా
దీనునకిన్ని సద్గుణము ♦ లేర్పడె సార్థకజన్మవోసుతా॥

ఉ॥ రూపవివేక ధీగుణ శి ♦ రోమణి వబ్బుటఁ గూర్పనెంచితిన్
భూపున కాలిగా గుణ వి ♦ భూషణఁ గూర్చు తలంపులందునన్
ఏపదమందఁ గాదు, వల ♦ దీవనఁ బోవునదెద్ది లేదు నీ
కే పతియో క్షితీంద్రునకు ♦ నింతియొ భూస్థలిఁ జిక్కకుందురే॥

అమ్మాయీ! నే బోయి వచ్చెదను.

(బుద్ధిసాగరుఁడు వెడలిపోవును)

(తెరలో) అమ్మా! అమ్మగారు వచ్చుచున్నారు.

(బుద్ధిసాగరుని భార్య భాగ్యశ్రీ ప్రవేశించును)

భాగ్యశ్రీ—అమ్మాయీ! నాన్నగారు ముకుళితవదనులై తీవ్రగమనంబున నేగుచున్నా రేల?

చిత్ర—తల్లీ! దైవాజ్ఞచేఁ దండ్రి యీప్సితంబులకు వ్యతిరేక భావము వహింపఁ బురికొల్పె. అయ్యది మానసంబున కాయాసంబు గూర్చియుండు?

భాగ్య—బాలా! అదేది?

చిత్ర—వారు భూకాంతుని వరింపుమనిరి. నామనంబితరుని వశ్యమైన దంటెని.

భాగ్య—తల్లీ! నరేంద్రునే యొల్లనైతివా?

చిత్ర—ఔను.

భాగ్య—కారణమేమి?

చిత్ర—అన్యుని వలపునకుఁ బాత్రనగుట.

భాగ్య—ఆతండెవ్వఁడమ్మా? ఎచటివాఁడు? ఎపుడు వరించితివి?

చిత్ర—ఆతని నేనెఱుంగను. ఈగృహోన్ముఖులమగు సమయమున నీయావరణమునఁగల తోటలోని వృక్షములచాటున నిలిచిన పుణ్యమూర్తి యెవరో నామనోధనంబును ముచ్చిలిమె.

భాగ్య—[ఇంచుక తడవాలోచించి] మావనముననా?

చిత్ర—వాస్తవముగ నిందే. మృష లేల పల్కుదు?

భాగ్య—ఎట్టివాఁడో వివరింపఁగలవా?

చిత్ర—మోముఁదమ్మిని మాత్రమే కదా కనంగల్గినది.

భాగ్య—అయ్యో! మీకిరువురకు సమాగమ మెట్లు ప్రాప్తించు? ఆతఁడు నక్కి చూచినదేలనో? వెతకుట కానవాల్లేమియును లేవా బాలా?

చిత్ర—అడవి యుసిరిక యంబుధి లవణ మన్నట్లు హరి లగించియే మనసులఁ బెనఁగొనఁజేసె. అమ్మా! వెతకించుటేల? ఆత్రమొందులకు? మనుజులకు మఱపు సహజమగుట యుద్బోధన లవసరము. సర్వవ్యాపియు, ప్రాణికోటి మనోవాక్కాయకర్మంబులకు మూలాధారుండును నగు చక్రికిఁ బరాకు లేల? నాపూర్వపుణ్యము పండిన నాఁడు నామనఃకాంతుని లక్ష్మీధవుండె చేర్చు. తల్లివగు నీకడఁ గనుమరుగేల? నాకుఁగల చిత్రకళానైపుణ్యముకొలఁది నా మనోనాధుని ముఖపద్మముఁ జిత్రించితి. వీక్షింపుఁడు [లేచిపోయి పటము తెచ్చియిచ్చును]

భాగ్య—[పుచ్చుకొని తేఱిపాఱఁ బలుసార్లు చూచుచు, తలపంకించుచు నవ్వును]. అమ్మాయీ! అందగానినే వరించితివి. తగిన వరునెన్నుకొంటివి. శీఘ్రకాలంబున వివాహితులైన వధూవరులం దిలకించి కన్నులపండువగుడు సంతోషించెదము. మీబాబుగారికీ పటమునుం జూపి యీవరు నన్వేషింపుమనెదవా? తడవేల?

చిత్ర—తల్లీ! వలదు వలదు. నాపటమును నాకిండు. నిక్కపుం బ్రేమం గల్గిన మనోహరుం డెన్ని దినములు కేల్వట్టక యుపేక్షసేయు? సైరించుటయే మేలు? తల్లీ! నాయందాగ్రహము వహించియున్న యెడల నాయనగారికి సర్వంబును విశదపఱచి మనసుం ద్రిప్పం దమరిని వేడుదాన. కానున్న రాణినని యింతటి వైభవముల నిన్ని దినములు సపర్యలొనర్చితిరి. ఇందులకు వందనంబులు. ఈపటినుండియు మీకుటుంబములో దానివలె జూచుకొనుఁడు.

[తెరలో] అమ్మా! పెదతల్లిగారూ! బాబుగారు పిలుచుచున్నారు.

భాగ్య—బిడ్డా! వింటివా? ఇరువురమేగుదము రమ్మా.

[ఇరువురు వెడలుదురు]

[తెరవ్రాలును].

—* తృతీయాంకము *—

ద్వితీయరంగము.

[నిజమందిరమున దమనుఁడు పీఠముపైఁగూర్చుండి యుండును.]

దమ—నేనల్పసంతోషిని. నామంత్రము పారిన దనుకొంటిని. ఉబ్బితబ్బిబ్బులైతిని. తండ్రికుమారులకు వైరకారణము లొదవించితిగదా యని హర్షపులకితశరీరుండనైతి. నాకుసాటి యొరులు లేరని నేనుబ్బితబ్బిబ్బులగుట కాక్షణమున మదనుఁడెట్లునటించె! నిండుకుండ యగుటచేఁ దొణకకుండెను. పెనునమ్మిక మొదవ బసవన్నవోలె మెందుగఁ దలఁద్రిప్పె. అమాయకుఁడనగుటచే నేనాతనినక్కజిత్తులని గ్రహింపక, దీర్ఘమంతనం బొనర్పక వ్యర్థప్రసంగం బొనర్చితి. కానం తేని లాభింపదయ్యె. ఒండొరుల మనంబులు నెఱియుటకుఁగారము రాచితి నని మురిసితిని. నామనమాతనికి వెలిబుచ్చి నేవెఱ్ఱినైతి. మదను

నకు నాపోఁతప లేశమాత్ర మిముడవయ్యె. గ్రామాంతరమేగుచున్న దంప్రశిమాటల నాదలమోపి మారాడకఁబోయె. వారియాత్మలందు భేద మిసుమంతేని యేర్పడదయ్యె. ఆవులించినఁ బ్రేగులలెక్క వెట్టు సామర్థ్యముఁగల బుద్ధిసాగరుఁడు సామాన్యుఁడా?

తే॥ గీ॥ కాక యిసుమంత పెడత్రోవ ♦ రాకఁజూచి
మధురభాషల మదిఁద్రిప్ప ♦ మంత్రినేరు
పనుభవైక వేద్యంబయ్యె ♦ నాత్రపడి స
హజగుణముఁ జూపితే క్రోధ ♦ మతిశయింప॥

ఛీ! ఇదేటివెఱ్ఱి! నాకేమిలోపము? నాకును బుద్ధిసాగరునకును, అష్టమచంద్రుఁడు నైదవతారయేకదా.

ఉ॥ పుట్టిమునింగినట్లవర ♦ బుద్ధులె కారణమంచుఁ జింతిలం
గట్టులె సేతుబంధనము ♦ గండిన నీరముచన్న పిమ్మటన్
గట్టగఁ గట్టఁగట్టుకొని ♦ గ్రాలుచునుంటిమె మైత్రిభంగమే
పెట్టిన చిచ్చుమండ నొక ♦ వీవనతో విసరంగఁజెల్లదే॥

తే॥ గీ॥ ఆరఁబోవు దివ్వెవెలుఁగ ♦ నాముదంబుఁ
జేర్చునట్లు సమిధలను ♦ చేర్చి క్రోధ
వహ్నిరగుల శక్తికొలఁది ♦ పాటుపడుదు
త్రొక్కువడినట్టి పామునై ♦ రోషమూని॥

బుద్ధిసాగరునికిఁ జాలనిగ్రహముల కూటమి యగువరకును నా ప్రయత్నములు ఫలోన్ముఖతఁ గాంచనేరవు. ఆతని వశీకరణశక్తి యమోఘము.

ఉ॥ తేనికిఁ బ్రాణమై తగిన ♦ రీతిని నిచ్చకమాడనేర్చి భూ
జానిని బుట్టవైచుకొన ♦ సాహసమూర్తియె బుద్ధిసాగరుం
డౌ, నిరతానుమోదినయి ♦ హాసవిలాస విధానువర్తినై
కానుప మెచ్చు భూధవుఁడు ♦ గాని నుతించును నాతనిన్ సదా॥

[తెరలో] దేవరవారికి పాదసేవకుఁడు నమస్కారములు.

దమ — వారి పార్శ్వక! విశేషమేమి?

[తెరలో] స్వామీ! నవాబు నయ్యదహమ్మదుఖానుసత్తముఁడు విజయముచేసి తమదర్శనార్థము వాకిట వేచియున్నారు.

దమ—సేవకా! వారిని సత్వరముగ నిందుఁ జేర్పుము.

[నవాబు నయ్యదుఖానుఁడు ప్రవేశించును]

దమ—(లేచి ఎదురేగి) బాల్యమిత్రమా! నవాబా! సలాము. (ఉచితాసనమునుజూపి) ఈ యాసనము నలంకరింపుము.

నవాబు—అచ్ఛా. సలాం. దమక్ భాయిగారూ! తుమారాముఖం మీాద కులాసా హక్పడటంలేదు. ఏం? నాకీ ఎందుక్ రా చెప్పావ్?

దమ—మిత్రమా! దీర్ఘాలోచనయందుండుటచే నీకట్లు తోచియుండు.

నవాబు—హేం మాట నీకీ తిన్నావు వా. అబీచి మేం బుద్ధిసాగర్ సూసేం. ఆ చమక్, ఆ చలక్, ఆ కులాసా మారింది లేదుగా? ఆయనాకీలేని ఫర్, దిగుల్ యోచింపింసటం మీాకీఉందీయేం?

దమ—సఖా! నీవేల కృశించినట్లున్నావు?

నవా—అరే! ఖల్లా. అయ్యల్ మియ్యల్ హేకం ఉండాలే అన్నంటంలో మాకీ హెండ్కా పోతున్నాం. జీవహింసా వద్దు సెప్పి మా మాంసం నోట మట్టిగొట్టార్. మత్తుపదారదం సారా సిక్కకుండా సేసించార్. మదం పోయాతో మన్సీకి క్యాహై!

దమ—ఔను! సాత్వికాహారమే మంచిది.

నవా—నీకీ ఏం హరాను! సెప్పామల్లీ మేరావాలా జాక్ జాతీహై మావాల్లపాణం ఎల్లిపోతార్గావై.

దమ—పాపము! కొంచెము సారాయి తెప్పించమందువా? కుతిఁదీరఁ గ్రోలెదవు గాక.

నవా—ఆరే క్యాబాత్ హై. మాకీ నకో చెప్పటం. మీా యింటిమే ఉంచుకొని జర్దాజర్దా పుచ్చుకోటం తిన్పించడం! ఖ్యారే? భాయి? మరంనై మీాకి? బుద్ధిసాగర్కే బుద్ధి బడావుంది. నీకీసీమం తాగుడ్కీ మానాలా. తాగుడ్కీమానాలా. మాంసము తిన్పించటం వద్దు. మాంసం తిన్పిచటంవద్దు. క్యా త్రావఖత్ ఆయనగారు శోధనం

యిచ్చించారు. నీవు మట్టీ మహాణాం చెప్తుంది ఏమిండి? లుచ్చాకూకు మాకీతింటాం? మాకీమాట వృక్తి, పనిబక్తి. మాటఅనటం మళ్లీ తిర్గటం?

దమ—నీమనోదార్ఢ్యముఁ గనుగొంటకే యిట్లంటి.

నవాబు—అరే! మేరే భల్లా ఎంతావాడ్ నీకీ! [నవ్వును] తప్పీల్మాటాకీ తక్రార్ కారణం అన్కొన్నాం. మాకీ మాకీ తెల్వదమ్కునావేం. మేరాపాస్ యే పొఖ్బిజాంతాన్నె. ఏకీచ్ బాత్ మీాద ఉండు అని లోకుల్కి చెప్పాటాం, మీాలోమీాకీ యిరోధం. వహారే. వహ్వ బల్ నాయముపుందిగా!

దమ—సాహెబా! నీవును నేనును బుద్ధిసాగరుఁడును యిప్పటి వారము కాము. తదితరులవోలె నీవును విషయపరశీల మొనర్పక యాత్ర పడకుము.

ఉ॥ సోదర భావమూని పరి ♦ శోధనఁ జేయుము భావవైఖరుల్
నాదురితంబులాతని ఘ ♦ నంబులు వేవివరించి తెల్పుమా
గాదిలి మాటలన్ బరుల ♦ కన్నులు మూయు, ప్రతాపశాలియే
మేదినిబూజ్యుఁడౌను నను ♦ మెత్తురె లోకులమాయికుల్గదా॥
తే॥ గీ॥ ఇరువుర మమాత్యులమె కద ♦ పౌరుపుత్రేల
కార్యనిర్వహణంబునఁ ♦ గెల్వకోలు
తగదె, గుసగుస లేల భూ ♦ ధవునితోన
ను విడనాడి స్వోత్కర్ష య ♦ నూనమగునె?

రాజ్యపరిపాలన విషయముల యందేగాక ప్రభుని స్వకీయముల యెడఁగూడ దల నిరికించుచు ప్రాముఖ్యము వహింపనెంచును. అట్లొనర్చిన యాతనితో జేతులుగలుపుకొను యోచన లేల? ఈతఁడు పూసికొని తిరుగుచుండుటచే తేసికి విశ్వాసముండక పోదు. నే నట్లొనర్పమి నాయం దసూయ స్వభావికముగ నుండునుగదా? ఇట్టిదానికి బుద్ధిసాగరుఁడు కారణముండువా?

సాహెబు—హాలేలెఅయ్యా హూలే? ఎత్నా బాతా కైకూ భయ్యా. బుద్ధిసాగర్ గారు గులాంగిరీకి తర్భితైనారు అన్నమాట.

తే॥ గీ॥ తండ్రి వీక్షింప యత్నముల్ • దగ్ధమగు న
నెడి భయమున నాఁ డీయింతి • నెమ్మొగంబు
తనివిఁదీఱఁగఁ జిలికింపఁ, • దడవి కేల
పూర్ణదృష్టులఁ బిగిడించి • పొలఁతిఁ గాంతు॥

ఔరా! ఈ లతాంగి సుకుమార సౌభాగ్యసంపద లేమని వర్ణింపనౌను.

చ॥ మనుజవిలాసినీ మణుల • మంగళరూపము లిట్టులుండునే,
అనిమిషకాంత యేమసదు • ద్రాగ్రహకీలల కింధనంబునై
జననము నొందె నిక్కడమిఁ • జక్కఁదనంబనఁ జాలు, మోహవా
ర్ధి నను మునుంగనీయక త • రింపఁగఁ జేసెడు తెప్పయో యనన్॥

నిదుర మేల్కొంచుచున్న నాప్రాణప్రియా వాక్సుధలాన నిండె వేచియుండుఁగాక. చెలికత్తెవద్దనుండి గ్రహించిన యీ నాచిత్తరువు మూలమున పలనాఁటి నాదోహదము భగవదిచ్ఛానుసారంబుగ నభివృద్ధియై యొండొరులఁ బెనఁగొనినయట్లు ప్రబల నిదర్శనంబయ్యె. ఇఁక నే ధైర్యమువహించి యుండఁదగు. దైవము నాపాలనుండి నానిశ్చలప్రేమ కాస్పదంబగు కన్యకామణిని మదీయాభిమతానుసారంబుగ నాకుంగూర్చె. నామురిపెముల మూట లేవనుంకించుచున్నది. ఇందొదిగి విశేషంబు లరసెద.

చిత్ర—(లేచి కూర్చుండి) చెలీ! చెలీ! ఎందేగితమ్మా? నా పెన్నిధి నందిడి పోయితి? (లేచినిలిచి కలయ వెదకి) అయ్యో! ఇందెందును గానరాదే. క్షణమేని నెడఁబాయక వక్షస్థలంబున నిలుపుకొని మనస్సునకు ధైర్యమును జెప్పుకొనుచు గంపెఁడాశతో నుంటిని. నేనద్దాని గోల్పోవుట యశుభము. పరులకంటఁ బడుటయే మోసముగూర్చె. కాకినోఁటగడ్డకొట్టి గద్దకిడినట్లు, తల్లి కాపట మూనాఁ డొసంగక దీని పొట్టంబెట్టుకొంటి. నా మనోనాధుఁ డెవండో దీనిమూలమున వినంగోరు నుద్దేశమే మహాపరాధము. ఇన్నాళ్లు వేచియున్నదాన, నేనేల తీవ్రపడి బయలుపడితి? మది చలించినపుడెల్ల త్వదీయవద

నాంబుజముపై దృష్టులం బాఱఁజేయుచుఁ గనులకద్దుకొనుచు నశ్రులరాల్చుచు, నేనాఁటికిఁ ద్వదంఘ్రుల కుపచరించు భాగ్యమబ్బునా, పైపైకిదునుకు మారుం దూలింతునా, యని విన్నవించుకొనుచుండెడిదానను. చిత్రఫలకమా నేనట్టి యకృత్యమొనర్చితి? నాపైనలుక పొడమనేల? నిజేశురూప ప్రతిబింబమును స్పృష్టించుకొని పతిప్రత్యక్షమగు దనుక ముచ్చటలాడుచుఁ గాలంబుగడుపఁ దలఁచియుంటి. చెలీ! చెలీ! శారదా! ఎన్నిమార్లు పిలిచినను బలుకవేమే? లాలించి బుజ్జగించి మృషలాడి, నారహాస్యం బెఱింగి నామోహానాకారు రూపపటము గ్రహించి నన్నేమిచేయుమవే? నీ నీచబుద్ధియే వెలువడియె. నాకుఁ బనినిగల్పించినదానవైతివి. ఇది నాకుశ్రమ యనుకొంటివా? ఉత్తరక్షణంబునకుఁ జిత్రించి సిద్ధమొనర్చి ద్రోహము సైరింపుమని యంజలిఘటించి మ్రొక్క-యుచితరీతి మనఃపీఠి నిల్పి పూజించెదఁగాక.

(మదనుఁడు ప్రవేశించి స్వగతము)

ఈమగువ వినయాది సద్గుణసంపద లసమానంబులనం జెల్లదే? నేనింకనామె సాన్నిధ్యముఁజేరక యొదిగియుండఁజాల. ఈకాలయాపన మెట్టి యనర్థముల కాలవాలమగునో? ఐన నిట్లొనర్చెద. (తనవద్దఁగల చిత్రఫలకమును, ఆమెవైపునకు విసరును)

చిత్ర—(పటమునందుకొని కనులకద్దుకొని) నాథా! నన్వీడి యెచట కేగితివి? నన్మాసితివని నామనఃఖేద మేమందును? ఈయశ్రులధారలే నిదర్శనములు. చెలీ! నానిక్కంపు ప్రేమ స్మరించుట కిట్లొనర్చితివా? పరితోషఫలితంబులఁ జేర్చకున నేల ప్రసన్నవుగావు? ఈ దాగుడుమూఁత లాటలేల? నేనవచ్చెదఁగాక. (ఆ దిశంబోయి చెలి గాకుంట దిగ్భ్రమనొంది నాల్గడుగులు వెనుకకువైచి మ్రాన్పడి నిలిచియుండును).

(మదనుఁడు ప్రవేశించును)

మద—కన్యారత్నమా! ఏలబెగడొందెదవు?

చిత్ర—(స్వగతము) పురుషుఁడొకఁడు ప్రవేశించె ననుట ధ్రువము. బుద్ధిసాగరుం డనిన రాజవతంసుడే బలిమిని సన్గవయఁ బ్రవేశించెనేమో? ఏది దారి? ఎట్టియప్రతిష్ఠల పాల్పడవలసియున్నానో కదా. అతండు నిలచియున్న వైపునుండియే నానాధుని చిత్రఫలకము నన్జేరె. నిస్సంశయముగ నీతండే దానిని విసరియుండును. నాప్రసంగము నాలకించి ధైర్యముతో నీతండిందుండి వెడలకుంటయే మనో నిశ్చితమును కార్యదీక్షయు విశదమయ్యెడి. అయ్యో! నాపాపి గ్రహమా! బుద్ధిసాగరున కిట్టిబుద్ధి నేల పుట్టించితివి? అతని యంగీకారమును బడయకయే నీతులువ యిటకడుగిడఁగలఁడా? బుద్ధిసాగరుని దూరు టన్యాయము. ఇన్నిదినములు నన్నాతని పాల్పడకుండ నాఁచఁగల్గె. ఈ యుదంత మంతయు నేరిమూలముననో నాదురదృష్ట వశమున రాజేంద్రుని వీనులంబడ నాతం డిందు జేరియుండనోపు. సచివోత్తమునిందూరుట పాపకార్యము. దైవమా! నీవే నాకు శరణ్యమవు. నిన్నే నమ్మినదాన. అడ్డుపడువారెవరును లేరు. (తలవాంచి బహిరంగముగ) ఆర్యా! కాంతాజనాంతికంబులకుఁ బురుషులు రాఁజెల్లునే? అందునే నీయింటివారి యవ్యాజకరుణచే నభిమాన పుత్రికగఁ బరిగణింపఁబడుచుఁ బెరుగుచున్నదాన. తమరిట్లొనర్చుట నాపురోవృద్ధికి భంగకరము. తమరు విసరిన చిత్రఫలకంబునఁ జిత్రింపఁబడిన యాతఁడే నామనఃకాంతుఁడు. మహాపురుషా! అతనిఁదక్క నేనన్యుల ముఖావలోకనం బొనర్పనొల్ల. మహనీయా! ఇయ్యది తమహస్తగతంబెట్లయ్యె?

మద—మా చెలియొసఁగె.

చిత్ర—మనఃపూర్వకంబుగ నొసంగెనా?

మద—బలాత్కారంబుగ నిప్పించుకొంటి.

చిత్ర—ఆయమ యెందేఁగె?

మద—నేనిందుండి వెడలఁదగిమితి. ఇపు డాపె చింతయేల? శ్రద్ధాళువవై నాపల్కు లాలకింపుము.

తే॥ గీ॥ అసమశరుఁడేచు విరహదా ♦ వాగ్నిఁ బాపు
చల్లనానీదుచూపు ని ♦ శ్చలతఁ బఱపు
శీతకిరణాళి నను నింపు ♦ నూతనంపు
శశిని నినుఁ దాల్చియాడు నే ♦ చంద్రమౌళి॥

చిత్ర—శంకరుఁడౌట యెటులునున్నను తలతిక్క శంకరయ్యవైతివి. కుసుమశరంబులకే సహింపలేని సుకుమారుఁడవు. జమునిక్రూరపు శూలంపుఁ బోట్లకెట్లాగఁ గలవు?

సీ॥ పంచశరునెదిర్చి ♦ వంచింపనేరవు
పడఁతుల వంచించి ♦ పట్టఁగలవె
విరహదావాగ్నికే ♦ బీరంబులుడిగెఁగా
కులకాంత శాపాగ్ని ♦ నిలువఁ గలవె
ఈశ్వర దత్తమా ♦ నింగితం బేపోవ
మూర్ధంబుపైఁ గ్రొత్త ♦ మోఁతయేల
ఉన్నకళలతోడ ♦ నుబ్బుఁ దెలుపఁగదు
కళలకు నిధివిగా ♦ గతులుకలవె

తే॥ గీ॥ మాటకును మాట తెగులను ♦ మాటవినవె
నీటికిని బాచి తెగులను ♦ నీతిగనవె
వినఁగఁ జెప్పితి నామనో ♦ భీష్టమెల్ల
వాదమును వీడి వెడల భా ♦ వ్యమ్ముసుమ్ము॥

మద—కాంతామణీ! ఏమి నీకున్న రగాన మాధుర్యము!

చిత్ర—వాఙ్మాధుర్యముఁ గ్రోలి యుబ్బి తబ్బిబ్బులగుచుంటివిగాని అర్థగాంభీర్యము నజ్ఞానివై చవిగొనలేకున్నావు. మోటుతనమేల? నిన్ను వలచిననాతికడ నీనేర్పుచూపి శ్రమపడిన నీప్సితార్థంబు నెఱవేఱును. వలదుపొమ్ము. దేవుఁడాయను నాకడ నీయుపాధ్యాయత్వమేల? ఈవిరాగియెడ నీకేల యనురాగము? దయయుంచి తరలుము.

మద—(స్వగతము) అయ్యో! ఇదేటిపాపము? నే నొకటిదలంచిన దైవము మఱొండు దలంచినట్లున్నది. నాసాధనలన్నియు వక్రగతుల నొప్పుచున్నవి. ప్రవేశించిన వెంటనే సాక్షాత్కరింపక నూతన మార్గ మేల ద్రొక్కితి?

తే॥ గీ॥ కాంత యేకాంతముగనుండఁ జెంతఁ జేరి
శీతలోపచారంబుల సేదఁ దీర్ప
కేల కొఱమాలిన పరీక్ష లింతిపొందు
దూరముగఁ జేసె మదినెంత దూఱుకొందు.

(ప్రకాశముగ)

ఉ॥ మాను విచారమో యబల మంత్రిసుతు న్మదనాఖ్యుఁగా ననున్
ఆననమెత్తి గుర్తుఁ గొనవో; భవ దాత్మబలంబు, ప్రేమయుక్
దాననె యీ జగానఁబర కాంతల మానసవీధులందు; భా
మా! నిను కుత్సితుండనయి మత్తిలి యాసఁ బెట్టితిం జుమీ!

చిత్ర—(స్వగతము)

తే॥ గీ॥ ఔదునని డీ మనఃకాంతుఁ డౌనొ కాఁడొ
మోసగింపంగఁ జేరిన ప్రముచ్చొ యితఁడు;
కాంతుఁగా కన్యనింగనఁ గలుషమబ్బు
ముంపుపోయిన నాయి పి యుంద గోయి॥

ఉ॥ ఓ పరమాత్మ! తోఁచదెటు లుత్తరకార్యవిధాన పుంగతల్
నాపతి యౌనొ కాఁడొ! కన నా! వలదా! పెఱవానిఁ గాంచుటల్
పాపపుఁ గార్యమై వెలయు భర్తయె యైన నసంప్రదాయమా
నాపతి నాత్మనిల్పి చర నద్వయినెన్నుచుఁ జూతు సీతనిన్॥

(మదనుఁడందున్న నిలువుటద్దముకడ దిద్దుకొనఁ జేరఁ బోవుచుండును)

చిత్ర—(ఆవిధముఁ గ్రీకంటంగాంచి మెల్లనవెను వెంట వెన్నంటి తాను గానరాకుండ నందాతనింగాంచి నిక్కంబుగ నితఁడు నాపతియే యనుచుఁ జివాలునఁ బాదములపైఁబడి)

నాథా! నాతప్పుల సైరింపుము. ప్రల్లదంబులాడితి. అమర్యాద గఁ బ్రవర్తించితి. ముంజేతి కంకణంబున కద్దమేల? సర్వమును దమ సమక్షముననే తటస్థించినదిగాన దండింపుఁడు, మందలింపుఁడు. క్షమించితి నన్నుఁగాని పాదంబుల స్వీడువను.

మద—(లేవెత్తుకాంతా) నీమనోధైర్యము, అకళంకప్రేమ యచ్చెరు వొందించెడి. నీసందియముఁ బాప మున్ముందు నే నీబుద్ధిసాగరుని పుత్రుఁడనని తెల్పుకొనుటవసరము. రాసుతునకై తండ్రి తెచ్చిన మన్మథురాణివగు నిన్నుఁ దరుమూలములమాటున దాఁగి తిలకించి యమాయకురాలవుగ నిన్నింత నలయించిన యపరాధి యితండె. నాకై విలపించితి, యత్నముం గాచితి, మోహాతిరేకంబున నాప టంబునే నన్నుగా భ్రమసి ముద్దాడితి, నక్కు-నసొక్కి-కొంటి, వక్ష స్థలింజేర్చితి, అయ్యెభాగంబులా కఠినఫలకస్పర్శంబున శోభ చెడి యుండు. ఇంతీ! నాతప్పు లసంఖ్యాకంబులు. శిక్ష నీచిత్తము, నాప్రాప్తము.

చిత్ర—(చిఱునవ్వు నవ్వుచు) మీ తల్లిగారి సందేహవాక్యంబులే యథా ర్థంబులయ్యె. కరుణమీఱుచుండెడు మచున్న వారలకుఁ బాదసేవకు రాలనై యుపచరించు భాగ్యము శ్రీహరికూర్చినందులకుఁ బర మానందమయ్యె.

మద—ప్రేయసీ! తల్లియేమనియె ?

చిత్ర—(సిగ్గునఁ దలవంచి) అందగానినే వరియించితివి. దంపతులఁ గాంచి సంతోషించు భాగ్య మెప్పుడేయని నేఁజూపిన మీపటముం జూచుచు ముసి ముసి నవ్వులు నవ్వుచు నుడివిరి.

మద—తథాఽస్తు. ఆపె మాటప్రకార మొనర్తము. ఆలస్యమేల?

ఉ॥ అంగముఁ దూలఁజేసెడి ♦ యనంగుఁడనం; జెలినొచ్చె నెమ్మనం
బంగజుఁడేపురోధ విర ♦ హాగ్ని యె సాక్ష్యము పాణిసందఁ, ద

న్వాంగిరో, చిత్తజల్లాయన ♦ సంబకముల్వ్రాదళించుమూరు, క్రు
క్కంగనఁ బంతమూనుచు ని ♦ కామముగాఁ జరియింపఁ దగ్గునా॥

(ఇరువురును లోనికిఁ బోవుదురు.)

(తెర వ్రాలును.)

—* తృ తీ యాం క ము *—

(పం చ మ రం గ ము.)

బుద్ధిసాగరుని మందిరము.

[బుద్ధిసాగరుఁడు—ధూర్తుఁడై కృపాణముఁ దాల్చి
పద్యము చదువుచుఁ బ్రవేశించును.]

బుద్ధి—

ఉ॥ ఓరి దురాత్మ! ఘోరకలు ♦ షోదధిముంచి మదన్వయంపుఁ బే
రూరుల మాపఁగా జనన ♦ మొదితె కావలిగాఁచు భామలన్
దూరముదోలి యంతిపురి ♦ దూరితె కామమదాంధకారివై
క్రూరత; వంటఁబల్గవియు ♦ కుందేలు వైతివిఁ దక్కనేర్తువే?

కులము కూఁకటివేళ్ళతో జెఱుపంబుట్టిన చీడపురుగా! మదన్వయంబున కపయశస్సు గూర్చుట కీవెక్కడ దాపరించితివి? నా సంరక్షణయందున్న కన్యకా మణిం గవయఁ జేరుట దుష్టకృత్యమనియు వావిని సోదరియగు ననియు మదనపిశాచగ్రస్తుఁడ వౌటఁ జిత్తభ్రమపోఁ బఁజేయదు కాఁబోలు. పరమకిరాతకుఁడా! వినిన వారు రుమియు కార్య మొనర్చితివి గదరా.

మ॥ కరవాలంబునఁ గండ కండలుగ నిన్ ♦ ఖండింతుఁ; ద్వన్మాంసముల్
వఱదుల్ శ్వానములారగించు; రుధిరా ♦ ప్లావంబునన్ గాని నేఁ
దరియింపన్; బితరుల్ సహింపునురే; హాం ♦ తారమ్మిటుల్ వైశమే
దురమందీ వెదిరించి తున్నఁగడు సం ♦ తోషంబు పంచత్వమేన్!

ఈ ద్వారంబుననుండియే యాతఁడు వెలువడవలయును. నావ్రేటు తప్పించుకొని యెట్లుపోవునో చూచెదఁగాక. లేక నాభృత్యులు మృషలువల్కిరా? ఏఁడీ. ఇందెందు, నాదుష్టబుద్ధి కానరాఁడే. భీకరకంఠారవంబున నేనఱచినను బదులాడఁడుగా. కామరుఁడైన కారణంబున మదిచలించి దాసదాసీజనంబు లనృతంబులాడిరేమో యని యనుమానించుచున్నాను. ఆహా! ఏమినాతెలివి! ఆరంభముననే పెడదారిఁద్రొక్కిన భ్రష్టునిసేతలయెడ నమ్మకమా! భక్తిశ్రద్ధలతో సంచరించుచున్న యనుచరులయెడ విశ్వాసమా? వాఁడింతటి కార్యమాచరించియే యిందు నక్కియుండును. ఇంచుక వేచి చూచెదఁగాక

(అనుచు నిటునటు దిరుగుచుండును)

(హర్మ్యాంతర భాగంబున నిలిచి మదనుఁడు చిత్రరేఖయు వినుచుందురు).

మద—సతీ! నేనిందుఁజేరి నిస్సరించుట మత్పితకెట్టికట్టలుకంగూర్చెనో విశదమయ్యెనా?

చిత్ర—(గజగజవడఁకుచు) నాథా! ఏదిదారి?

మద—లలనారత్నమా! ఏలకంపితశరీరవయ్యెదవు? ఇందేనెఱుంగనిదేదియు లేదు. జనకునాగ్రహంబునకు బాల్పడసిద్ధపడియే యుంటిని. మదనజ్వరతాపంబునఁ గన్నులలోఁ బ్రాణములుంచుకొని కృశించుచు నీపైనాసలు నిగిడించుచు నోటవేలు వేసికొనిజీవించుటకన్నఁ దండ్రియాజ్ఞల మీఱి యుసురులఁ గోల్పోవనైన సర్వసన్నద్ధుఁడనై యింతసాహసం బొనర్చితి. సఫలీకృత మనోరథుండనైతి. నాయనగారు చంపనుండె చావనుండె ప్రతినఁ బూనియున్నారు. నాయది దుశ్శీలమా నా? కాదా? యను సంశయము వేలు. వారినియమంబును మించిచరించితిననుటలో నణుమాత్రమేని సందియము లేదు. పిత్రాజ్ఞాతిరస్కారణాపరాధ మొనర్చినీదుష్కృత్యంబున కేసద్గతికిఁదప్పినవాఁడనైతిగా

యను పశ్చాత్తాపంబునఁ బొగులుచు బైసిమాలి తగుదునని తల యెత్తి యసిఁబూని యీ నీచఁపుటసువులం గాచుకొన యుద్ధసన్నద్ధుఁడ నగుటయా? ఇంత కొఱమాలినవని వేఱొం డుండఁబోవునా?

చిత్ర—నాధా! నాకై రహస్యముగ మందిర ప్రవేశ మొనర్చినట్లును, తనుత్యాగంబునకైన నొడిగట్టి మదనోత్సవంబున నన్నుఁ దేల్చ నుంకించినదియుఁ జెవిసోకిన నభ్యంతరముఁ బేర్కొనఁ బనియుండదు. మాటునఁడాగి నా మనోనిశ్చయం బెఱింగిన వా రంతటఁ బోయి పెద్దల యంగీకారము వడసిన పిమ్మట వివాహితులమై యుండవలసినది. అత్రపడితివి.

మద—ప్రేయసీ! ఇదేటివెఱ్ఱి? మనల నాత్రపడఁ జేసినవి మన యంతరాత్మలు. ప్రోద్బలము భగవంతునిది. నా చేతిలోనిదైన నింతటి పిరామమున కేల యోర్తును? సుదతీ! పంటిబిగింపున నసుచున్న వాడనే గాని హృదయము తత్తరం బడుచున్నది. తండ్రి పిలువ పంపిన పిమ్మట నిటనిచియుంట యప్రస్తుతము. రోష కషాయిత నేత్రుండై మండిపడుచున్న జనకుండు నేను తడవు సవర్చిన, హర్మ్యంబే చేరవచ్చు. "ఇనుము వల్ల నగ్నికి సమ్మెట పె"ట్టన్నట్లు నామూలమున నీకు వెతలు సంప్రాప్త మయ్యెఁగదే. తరుణీ! ఆనాడు దమనుని దుర్బోధవలన వేచియుండి నేను నీముఖారవింద సందర్శనం బొనర్ప నాపాడుబుద్ధి నన్నేల ప్రోద్బలఁ బఱచె? ప్రేయసీ! ఎంతలో మనకు ఋణములు తీరిపోయెనే. తండ్రి కృపాణము నా యసురు లందుకొన సంసిద్ధమై యెదురుచూచుచున్నది. నాజీవితముపై నాశ పాసితి. చానా! నిన్ను గామించి వరించుటలో నే నప్రయోజక కార్య మొనరించితి నని యే తలంపవలయు. స్వీయరక్షణ మొనర్చుకొన శక్తియుక్తుండ నౌదునా కానా యని మంతనం బొనర్పక యే నినుఁగూడ రంగంబునకుం దించితి. "తాఁజెడ్డకోఁతి వనమెల్లఁజెఱిచె" నను లోకోక్తికి నేనే తార్కాణము. నేను గడుంగడు దూష్యుంబగు

పాపకృత్య మొనరించినవాఁడ. అయ్యో! యెంతఘోర మెంత ఘోరము! అన్నము పున్నము మెఱుంగని నిన్ను మోహాంబుధిం ద్రోసి నీయుచ్చస్థితి కంతయు మారక గ్రహంబునైతి. ఈ శని గ్రహమును నీవు ప్రారంభమున విలోకించకున్న యెడల సుదర్శన భూధవున కిల్లాలివై సౌఖ్యాంబుధిం దేలుచుండెడి దానవుగదా. ఈనిర్భాగ్యుని మూలమున "రెంటికిం జెడ్డ రేవడ" వన్నట్లైతివి.

చిత్ర—నాథా! తమ రేల నాదుస్థితికై వగచెదరు? పతివ్రతకు వల్లభుని కన్న దైవము లేఁడు. తమ రేగిన పిదప నీ జీవి యుర్వీస్థలిని మనఁ బోదు. మన జంటను విడఁదీయ నొల్లకఁ బరాత్పరుఁడు సంరక్షించిన నుభయుల మిందుందము. లేకున్న స్వర్గలోకముననే మోదావహులమై యుందము. నాథా! ఇం కేటికి? మామగారిపాదసరసీరుహంబులపై వ్రాలి పతి భిక్షఁ బెట్టుమని వేఁడుదాన.

మద—నాతీ! నీయనుపమానప్రేమ కే సలఁతి. భార్యామూలకంబుగఁ బ్రాణంబులు దక్కించుకొనె నను నపవాదమును నే భరింపఁ జాల. అయ్యది యశాస్త్రీయము. వలదువలదు. అట్టి ప్రయత్న ముడుగుము. ఇంతియె కాదు. నాతోడంగూడ మత్పిత్రు సందర్శనంబునకు నీవు చను టే నొల్ల.

చిత్ర—ఏల! ఏల! ఆమాటయేల!

మద—ఇంతటి యాగ్రహంబున నున్న మజ్జనకుండు మన యిరువురము ప్రత్యక్షము కాఁగనే, కూళా! జాలిఁ బుట్టింప నమాయకురాలిఁ దోడ్తెచ్చు కొంటివా? యనకఁ దప్పఁడు. ఇచ్చకములాడకు; మరణమనుకొనిన నంతటి సులభకార్యము కాదు. అందులో బలవన్మరణము మఱియు హింసాకార్యము. భర్త మరణానంతరము భార్య మన వచ్చును. చరింపఁదగు నిష్టలు గలవు. ఇదిగో మదీయ కరవాలము. యోచించుకొని యవసరమైన నుపయోగించు కొనుము. ఇందే నిలిచి సర్వంబు వీక్షింపుచుందుము.

బుద్ధి—ఔరా! ఏమి! యింత యాలస్యమైనను నీచుండు వెలువడఁడయ్యె! నా భయమున నందే నక్కియుండు నట్లున్నది. ఆగారమునుండి బలవ దుత్తరణంబునకు నవకాశము గల్పించునట్లున్నది.

ఓరీ దురాత్మ..............

కరవాలం.........

(రెండు పద్యములం దిరుగ చదువును.)

మద—సఖీ! తండ్రిగారి హెచ్చరికలు వినవయ్యెడి. నా మురిపెంబుల నిధీ! నీభావిసౌఖ్యంబులకన్న నాక్షణసుఖమే మిన్నగ నెంచి అత్యంత దుఃఖకరంబగు నిరంతర వైధవ్యంబును బొంద నున్నావు. ఇంతీ! పోయి వత్తునా? అయ్యో! పోవుటయు వచ్చుటయునా! కాలవ్యాళ మట్లు నోరు తెఱచుకొని తళుకుతళుక్కుమని మెఱయుచున్న జనకుని కరగతంబగు ఘోర ఖడ్గంబున విగతఁ జీవుఁడనగుటయేకదా! కలికీ! కన్నుల నీరు నించకు. ఇదేమి చిత్రము! ముంటున కడుగిడఁ బాదము బలవంతముగ నెత్తినను పాముకొనిపోవుచున్నది. కారణము మృత్యువు వాతంబడనున్నా నను భయమా! యువతీ! వ్యామోహ పాశంబులఁ జిక్కి తెప్పరిల లేకపోవుటయా! రెండును భవిష్య దుద్యమంబునకు భంగకరంబులే. భయమా! నన్వీడిపొమ్ము. మోహమా! ఈదంపతులకడ నీకిఁక స్థానములేదు. రమణీమణీ!

సీ॥ కడసారి చూపులే ♦ కనమొుండొరుల నింక
యీ జన్మమునకింతె ♦ యిందువదన
చిత్ర—అటులేల యనుట మా ♦ మయ్యగారికి మది
మారంగరాదె మీ ♦ మాటపైన
మద—పేరాసలేల యా ♦ వేశపూరితుఁడగు
పితమది తిరుగదు ♦ విదిత మతిప
చిత్ర—మన ఖేదమును జూచి ♦ మనుపరి దయనెంచ
మామగారిని శాంత ♦ మతినిఁ జేయు

మద — తే॥ గీ॥ ఆత్మపారిశుద్ధ్యము! నను ♦ నాదుకొనుము
చిత్ర — నాపతివ్రతాత్వము! రావె! ♦ చూపంగరుణ
మద — పోక విధిలేక చాన నే ♦ పోవుచుంటి
చిత్ర — సహచరిణినయ్యు వలదన ♦ సాగకుంటి॥

(మదనుడు వెడలిపోవును)

(చిత్రరేఖ కంట నీరుగార్చుచు నిలిచియుండును.)

చిత్ర —

తే॥ గీ॥ జంటనిడఁ బాయఁ బాప సం ♦ చయము కతము
నవ్వుచుం జేసి ఫలమంద ♦ నవయఁ దగునె
తప్పఁ బోవదు నీడ నాఁ ♦ దగిలియుండు
నీసడించి చరింపఁగా ♦ నెవరితరము॥

(తెరలో)

అమాత్యశేఖరునకు వందనములు. తల్లిగారు దర్శన మపేక్షించుచున్నారు.

బుద్ధి — సేవకా! దర్శన మలభ్యమనుము. ఇంత యాగడంబునకు నా యిల్లాలి ప్రమత్తతయే కారణమో లేక కొడుకునకై యిట్లు మెలఁగెనో, స్త్రీలకు రహస్యంబులఁ దెలిపి నమ్మియుండుట నా దోషము.

(మదనుఁడు ప్రవేశించును.)

మద — తండ్రిగారి పదకమలంబులకు వందనంబులు.

(పదములంటఁ బోవును.)

బుద్ధి — ఛీ! దుండగీడా! నాపదముల నపవిత్రము లొనర్పకుము. ఆవల నిలుపుము.

తృతీయాంకము.

మద—చిత్తము దూరముగ నిలిచి యుండెదను. (అట్లొనర్చును.)

బుద్ధి—ప్రతిన నాలకించితివా?

మద—చెవులార వింటిని.

బుద్ధి—నిరాయుధుండవై ప్రవేశించితివే. ముష్టియుద్ధంబునకుం గడంగుదువా?

మద—తమ్మునుం బ్రతిఘటించు దురుద్దేశమునం జేరలేదు.

బుద్ధి—కృపాణమునకు నసురుల నర్పింతువా? దుస్తర సహనమెట్లు వహింతువు? మరణమునకు సహింప నెంచినవానికి మారుని కరకుటమ్ములు దుస్సాధ్యములై యుండవిగా! ప్రశాంతసత్త్వమును వహించి నట్లు క్రిందిచూపులు, ప్రియభాషణములు, నమ్రత నన్నొసగించి జీవములం గాచుకొన నెంచి వహించితివా?

మద—కష్టసహిష్ణుకతచే నీ వ్రతము ప్రస్తుత మవలంబించితిని. నా తుదికోరిక యొకటి కలదు. తల్లి..................

బుద్ధి—ఛీ! మూర్ఖా! ఆపెయైన నా కాళ్లం గడుపునం బడి బ్రతిమాలి ప్రాణదాన మొసంగ సమర్థురాలనియా. అభినవ ప్రహ్లాదుండు వప్పులో నడుగు వేయ మొదలిడుచున్నట్లున్నది.

మద—అపరాధము మన్నింపుండు. తల్లిం బిలువ నంప నక్కఱలేదు. ఇంక నొకమాట పలుకను. మౌనవ్రత మూనితిని. కనులు తెఱవను. సాగిలం బడుచున్నాను. ఈ శరీరము తమ స్వాధీనము.

(అట్లొనర్చును.)

బుద్ధి—ఔరా! ఇదేమి! హృదయము కలగుండు పడియె. ఆపాదమస్తకము గజగజ వడంకెసి. కర మెత్త రాకున్నది. చూపులు నిలుచుట లేదు. తల తిరుగుచున్నది. వైశ్యభ్రమయా!

పైత్యభ్రమ కాదు. చిత్తభ్రమ. కాదు ప్రేమాంకురబీజ విజృంభణము. కఠినమన మను ఘోరాసి ప్రేమాంకురమును మొదలంట ద్రుంచదయ్యె. క్రోధమా! నన్నావహింపుము. దైవమా! నూతనబలమును, ఘన స్థైర్యమును, నిష్కరుణతయుఁ బ్రసాదించి యీ తులువను రూపుమాపఁ జేయుము. (బలవంతముగ లేవఁ బోయి జారిపడును). ఏమిది! కాలూఁది జారినది. కంప మధిక మగుచున్నది. ఏకపుత్ర విషయమే యను వ్యామోహమే నన్బీ డించుచున్నట్లున్నది. ఔను. చేతులమీఁదఁ బెంచిన వానినిఁ జేతులారఁ జంపుటెట్లు? "చిత్తమా! చంచలత వహింపకుము. ధైర్యముఁ జెప్పుకొనినను దుఃఖమాగుటలేదు. గుండె బ్రద్దలగుచున్నది. నఱుకలేను; నఱుకలేను. లోకాపవాద భరింపఁజాల. రాజునకై తెచ్చి కోడలి నొనర్చుకొనెనందురు. నా శిరమును నేను ద్రుంచుకొందు. అట్లొనర్చిన నా పుత్రుండీ దుండగమును నొనర్చెనని యురిశిక్ష వేయుదురేమో? అయ్యో! పాపిని; కూళను. తల్లినిఁ దిలకింప నెంత యారాట ముండెనో. కఠినపుమాటాడి మనము విరిచితి. మనమా! నిన్నావరించినది బుద్ధిసాగరుని కళేబర మనుమాట మఱచి వెఱ్ఱిపోకడలు పోవుచున్నావు! ఇది గుండె కాదు; లోహము. దయాదాక్షిణ్యములు కర్కోటకుల యెడ వహింప నెందు స్థానము లేదు. (అనుచు, చివాలున లేచి) ప్రశస్తమగు హస్తమా! ఒక్కవ్రేటున మొండెమునుండి తలను విడఁదీయవలయుఁ జుమీ. (అట్లొనర్పఁ గర మెత్తును).

(తెరలోనుండి, అరే బుద్ధిసాగర్ ఠైరో రే! భాయి! ఠైరో యనుచు, నవాబు సయ్యదహ్మదుఖానుఁడు ప్రవేశించి బుద్ధిసాగరుని చేతిలోని కత్తిని పెఱికివైచి గట్టిగఁ బట్టుకొనును)

నవాబు—అరే! అన్నాగారూ! కూని చేస్తాయి నీకీ ఖబుర్ మీద ఉడాయించి వచ్చేగావా.

బుద్ధి—ఓసీ దుర్మార్గురాలా! ఎంతపని చేసితివే!

నవాబు—మీాది హచ్చామార్గణం ఏం. చెట్టంత కొడుక్కిచి చేయటం కోణ్ బోలా మీాకి? హే! అబ్బాగారు! మదనగారు! ఉరోజీ! అయ్యో! ఉరో బాబూ ఉరో. హిద్దర్ మన్సుల్ మే హెంతా ఆశాసం కల్గింది! కల్గింది; హెంధూఖా నీక కోపం బుద్ధిసాగర్?

బుద్ధి—రాజనస్త్రై నే తెచ్చిన కన్య యంతఃపురమునసుండ బలిమి నందుఁ జేరి యాపెను వశపఱచుకొనియె.

చిత్ర—(హర్మ్యమునసుండి) మామగారికి వందనములు. భర్తయాజ్ఞ నుల్లంఘించి సమీాపింపఁ జాలనందులకు నగచుచునిం నుండి మాటాడుచున్నందులకు మన్నింపుఁడు. రాజనస్త్రై తమరు నన్నుఁ దెచ్చినవారు కారు. ఆమాటకడ్డుమాట నే నారంభమునసే నుడివితిని. అనాథను రక్షించితిరి. మా యిరువురి గాంధర్వ వివాహంబులును గట్టుబాటునకు లోఁబడినవే. ఆదినుండియు నొండొరులఁ బ్రేమించి యున్నవారమే. తుదకు సతీపతులమైతిమి. ఒకరికొకరు నూతనులమై సందర్శనమాత్రంబున విరహదావాగ్ని దుమికినవారము కాము. మనములఁ బరీక్షించుకొని మసలితిమి. నవాబుగారి ప్రవేశమువలన నీ మాత్రమామంత్రించుట కవకాశముఁ గల్గె. భర్తకరవాలము నాకడ నునిచి చనియె. భర్త కంఠములోని ప్రాణవాయువులు తిమచే నివర్తింపఁ బడినతోడనే మన్మస్తకము నాతని పాదములకడ సివేదించుటకే యీ కరవాలము.

నవాబు—బుద్ధిసాగర్! అమ్మాయీాగార్ అమృతం చెప్పారు. మేం రాఖాపోయాంతో రెండు పీనగల్ చేసేవాడ్. మీాకీ బేటాకి లే చెప్పు. తప్పుషూది శిచ్ఛాదబ్బాణం మన్సు మిలాఖత్ గాని యెల్లాదు జనానాకి. అల్లా అచ్చామాసాడు. ఖులాసాహోగా. జనానాకీ ఎల్లాడ్గ్నాని చంపటం. నీకీ అంతకోపం బోం చేయటం బాగా ఉండాయి లేసు. అక్బార్ జరాజరా హై. అది చెప్పాతో మదనగార్కి దమన్న భాయి ఉసా రెక్కపించాక్. మై సాబ్బీ బోల్తుంలే. బచ్చాకు హటో బోలో. మస్కీ ఎల్దాంరా.

బుద్ధి—నాయనా! మదనా! లెమ్ము. నవాబు సయ్యదుఖానుఁడును చిత్రరేఖయును వివరించిన వాక్యవిశేషంబులు నే తొందరపడినట్లు విశదమయ్యె. నేనెంత ధీచాతుర్యములతో నారంభమునుండియు నిష్కార్యాచరణంబునఁ గాలూనినను దైవమననుకూలుఁడగుటచేఁ బర్యవసానము ప్రకృత్యన్యథాభావమును సూచించుచున్నది. నాయనా! కాచితి లెమ్ము.

మద—మహాప్రసాదము.

(బుద్ధిసాగరుఁడును, సాహెబును వెడలుదురు.)

(హర్మ్యాంతరమునుండి దిగివచ్చుచున్న చిత్రరేఖను మదనుఁ డెదుర్కొని కవుగలించికొనును)

చిత్ర—నాథా! నాపాలిటి భగవానునట్లు నవాబు సాక్షాత్కరించి పతిభిక్షనిడియె. తమ యాజ్ఞకు విరుద్ధముగ వారల ప్రస్తావనయందు నేను చొరవఁ జేసికొని మామగారి దురభిప్రాయమును బాప సమకట్టినందులకు మన్నింపుఁడు. యథార్థమొకరీతినుండ భిన్నాభిప్రాయులై యన్యపథానువర్తులగు మామగారిని సత్పథంబునం ద్రిప్పుట కట్లాడకఁ దప్పినదికాదు. వారింప నేతెంచిన యమ్మహాత్మునకు నాపల్కులు సాయపడియె. ప్రాణేశా! ఆతురమక్కనత్తముఁ డేవంతు!

మద—ఈ సాహెబు పలుకుబడిగల గొప్పజమీందారుఁడు. మా తండ్రిగారును వీరును బాల్యహితులు. ఏకోదరులట్లు వ్యవహరించుచుందురు. తండ్రిగారు తీవ్ర కోపోద్దీపితులై నన్నునుమ నిశ్చితాభిప్రాయులై వెన్నాడుటంగని మాతృశ్రీ, యితండు దక్క నన్యులు నివారింపనశక్తులని కబురంపి యుండును; దాన నాతఁ డత్యంత తీవ్రగమనంబునఁ బ్రవేశించె. కన్నతల్లియు, తండ్రిగారాబు చెలికాడును, కరమందిన కాంతామణియు, విశ్వప్రయత్నమొనర్చి యీ నిరర్థక జీవినిఁ గాపాడిరి.

చిత్ర — నాథా! మనుష్యయత్నంబులు దైవ సహాయంబుననే ఫలోన్ముఖతఁగాంచు ఆతని నియామకమట్లు కార్యము లాచరణీయంబులు కష్ట సుఖంబు లనుభవనీయంబులు. ఈ యల్పురాలి మూలమున గదా యింతకింత యలజడి కలిగె

మద — (కౌఁగలించుకొని) ప్రేయసీ! మనకొండొరులకుం గల నిర్మల గాఢానురాగమును, నిశ్చలమనస్సంకల్పమును పరమాత్మ గ్రహించి భద్రముం గూర్చి, గతమును మఱచి సర్వకళ్యాణంబులఁ దేలుదము రమ్ము.

(ఇరువురును వెడలుదురు)

(తెర వ్రాలును)

బుద్ధిసాగరవిజయము

నాల్గవయంకము

(ప్రథమ రంగము)

రాజమందిరము:—సుదర్శనుఁడు, దమనుండును
పీఠంబులఁ గూర్చుండి యుండుదురు.

దమనుఁడు—రాజా! అర్ధాంగలక్ష్మి నిర్ణీతయయ్యెనన నిను భాగ్యమిా నాఁటికైన లభ్యమాయెనా?

సుదర్శనుఁడు—మంత్రివరా! అట్టి శుభంబులేవియు ఘటింపవయ్యె.

దమ—ఇఁకఁ దడవు కానేరదు. బుద్ధిసాగరుఁ డింటిలోని పోరుం దీర్చుకొనియె నఁట. నృపకులావతంసమా! భవదర్థము బుద్ధిసాగరుఁడు గొనితెచ్చిన నవవిలాసినీమణిని మదనుఁ డపహరించి మదన సామ్రాజ్య లక్ష్మిగఁ బడసె నఁట.

సుద—సచివశ్రేష్ఠా! ఇట్టిది సంభవించియుండునని నమ్మిక పొడమియుండుట లేదు.

దమ—అవును పాపము. బుద్ధిసాగరునియెడ దమకుఁ గల పూర్ణ విశ్వాసము, ప్రబలభక్తియు నట్లనిపింపకఁదప్పవు.

సుద—ఐనను, నీవు వినినతీరున వినిపింపుము.

దమ—వచించుటకేమియున్నది? కనకను దెచ్చినమాట వాస్తవము. పురుషవేషంబున గృహప్రవేశమొనర్చునెడ మదనుఁ డామెను గాంచి వరించెనఁట. ఆమెయు మదనుం బ్రేమించెనఁట. ఈబుద్ధిసాగరుం డెట్టులో యావిధమును వాసనఁబట్టి కార్యాంతర మిషచేఁ బుత్రుని యిల్లు వెడలఁ దరిమెనఁట. అతఁడు నియమిత కార్యభారమును నిర్వర్తించి గృహోన్ముఖుండైనతోడనే యంతఃపుర కాంతా జనంబుల నవలఁద్రోలి యామెం గూడెనఁట. తదనంతరం బావిధాన మంతయుఁ జెంగలమూలమున మన సచివాగ్రేసరుం డారసి మించి వచ్చినదానిం గప్పిపుచ్చ సరభసంబునఁ హిరణ్యకశిపు నవతారమూని రోషకషాయిత నేత్రుఁడై కన్న కుమారు కంఠమునుం దునుమ రాద్ధాంత మొనర్చునెడ, నవాబు సయ్యదహ్మదుఖానుం డీ యుదంతం బెఱింగింపఁ బడినవాఁడై, వారిని, శాంతయుతులను జేసి, మరణాంతక ప్రదర్శనంబును సంతోషదాయకంబుగ మార్చెనఁట.

సుద—ఇంత గాథజరిగెఁగా! మంత్రి నాకై తెచ్చిన కాంతను దనయింట నుంచుకొనుటదేల? ఆదుష్కార్యమే యింత ముప్పులకాలవాలము. నిదర్శన పూర్వకంబుగ నుడువుచున్న నీ వాక్యసరణి నిరాకరింప నలవిగాకున్నది.

(తెరలో)

(సేవకుఁడు, దేవరవారికిఁ బ్రణమిల్లి విశదపఱచుకొనున దేమన మన హాజారము కడ బుద్ధిసాగరుఁడుగారు ప్రవేశము నపేక్షించుచున్నారు.)

రాజు—సేవకా! వారిని సత్వరంబున లోనం జేర్పుము.

(బుద్ధిసాగరుఁడు ప్రవేశించును)

బుద్ధి—(స్వగతము)

ఉ॥ అప్పుడె చేరి నీ తులువ • యక్కసుఁబూనఁగ జేయదేవర౯,
దప్పులఁబట్టఁగా వెదకు • దైవము ప్రార్థనఁ జేయఁగూర్ప, నా

యిప్పటి రీతికిం దగిన ♦ వెవ్వియొ కల్పనచేసి పల్కు—, నే
ముప్పునొ కూర్చు, మత్సుతుని ♦ మోహామ! కొంపకుఁ జేటుఁగూర్చి తే

తే॥ గీ॥ మాటిమాటికి సుతుని కా ♦ మంబు నెంచి
దూరుటొప్పదు నాయకే ♦ దోసమిందు
రాజునకు దేవిఁ గూర్చు దు ♦ ర్గర్వమేల
అనవసరపు జోక్యపు ఫల ♦ మందనుంటి॥

నా యనుమానమున కనుగుణముగఁ బార్థివేంద్రుని మోమున నేదియో మార్పుగోచరించెడి. ఱోటిలోఁ దలనుంచి ఱోఁకటి పోటునకు వెఱవనేల? (ప్రకాశముగా) దమనార్యా! ఎప్పుడు దయచేసితిరి?

రాజు—సచివాగ్రణీ! ఆపీఠ మలంకరింపుఁడు.

దమ—ఆర్యా! కడచిన సాయంసమయమునఁ బురముఁ జేరితి. సచివాగ్రేసరా! నృపుఁడు

“చను నె? కృపావిహీనులయి ♦ సంగడు లొండొరు మోసగించుటల్”
యను పద్యపుఁ గడపటి పాదము నొసంగి పై మూఁడుపాదంబులఁ బూరింపుమనియె నా శక్తికొలఁది నే నిట్లంటి.

చం॥ కనులకుఁ దాకు పుల్లలను ♦ గాంచి చరింపక, యే వృథాప్రసం
గ నిరతినేని దంభముల ♦ గవ్వకునాలుఁగు ప్రేలుచొప్ప, దా
పసికిఁ గడంగ “నాది” యను ♦ భావము వీడక యుంట లెస్సయే?
చను నె? కృపావిహీనులయి ♦ సంగడు లొండొరు మోసగించుటల్॥

తమరు నద్దానిం బూరింపుఁడు.

బుద్ధి—(స్వగతము) ఱేఁడు గౌరవింపకుండుటయు, పూర్ణాధికారమును వహించి దమనుఁడు ప్రసంగించుటయు, నీతఁడు స్వామిని నాయెడ విముఖునిగ నొనర్చుటలో విజయము గాంచెననుట ధృవమయ్యెడి. అగుఁగాక. కానున్నది కాకమానదు. (ప్రకాశముగా) భావగర్భిత మయి త్వద్విరచిత మలరారుచున్నది. నాయది యాకర్ణింపుము.

చం॥ ధనమును గోరియో, యితరు దర్పమడంపను, యోర్వలేమినో
ఘనత వహింపఁగోరియొ, వికావికఁజేసెడిఁ గూర్మి మిత్రులన్
జెనఁటి దురూహతో నిమిడి? చెట్టునుగూల్చెడి చీఁడపుర్వు నా
చను నెి? కృపావిహీనులయి సంగడు లొండొరు మోసగించుటల్॥

రాజా! తమ రేరీతిఁ బూరించితిరో వినం గుతూహలమయ్యెడి.

సుద — అనుభవశాలులగు మంత్రుల మ్రోల నా చిల్కపల్కులేల?

దమ — తమరట్లానతీయనేల? సింహకిశోరంబునకు గాంభీర్యంబును, కోకిలల పిల్లలకు గానమాధురియు స్వభావసిద్ధంబె కదా.

సుద — తమకట్టి యుత్సాహభంగముఁ గూర్పనెంచిన నా భావము వివరించెద నాలకింపుఁడు.

చం॥ ఘనగుణశాలినంచుఁ దమ కంటుపడఁ బిల్వని పేరఁటాలకున్
జనుటకు సిద్ధమౌచు, నిజ శక్తిఁ దలంపక కార్యభారమున్
బనరుప సాహసించి, తుద కోడి, యడంచు ఖలుండు సత్యమున్
జను నెి? కృపావిహీనులయి సంగడులొండొరు మోసగించుటల్॥

దమ — ఆహా! తమ భావము కాలానుగుణ్యముగను, స్వభావసిద్ధముగను, ప్రత్యక్ష నిదర్శనముగను దోఁచి వీనులకు సంతసంబు నించె. బుద్ధిసాగర మంత్రివతంసమా! భూపాలుని భావప్రదర్శనమున వారికై తమరొనర్చు కన్యాన్వేషణ పరిశ్రమ ఫలితార్థంబులయెడ భేదాభిప్రాయములు తలలెత్తినట్లు స్థిరపడెడి. ఇంతటియాలస్యము మాబోంట్లకే సైఁప దుస్సహముగ నున్నది. వారి కిట్లనిపించుటలో విపరీత మేమియు లేదు. దీనికిఁ దోడుగఁ దమ యింటిలోని "చిత్రరేఖా మదనాభిరామ" నాటకము పూసగ్రుచ్చినట్లు స్వామికి విదితమై యమితాగ్రహమూన హేతుభూతంబయ్యె!

బుద్ధి — దైవసంకల్పానుసారంబుగ గార్యంబు లట్లయ్యె.

సుద — కన్యందెచ్చిన ట్లే సంభాషణలయందును సూచింపవైతి వేల యమాత్యవర్యా?

బుద్ధి—ఆరంభము నుండియు మీ కేల్పట్టుట కాపె యనంగీకారమును గన్పఱచుటయే కారణము.

దమ—మదనుండు దప్ప నన్యుని వరింప ననంగాంబోలు.

బుద్ధి—తొలుదొల్తనే వివాహవిషయంబుల పరాధీనవు గావనితిమె.

దమ—అట్లైనం దమకేల తో డ్తెచ్చితిరి?

బుద్ధి—ఈప్రశ్న యర్థశూన్యము. అర్థుల రక్షించి పోషింపరాదో? పాపులబారినుండి బ్రోచి దిక్కు లేనివానిం జేరన నిలుచేర్చితి. భూప తికిం గూర్పనెంచి వివరించితి. ఆబాలయు మా మదనుండును నొండొరుల, మా గృహప్రవేశ మొనర్చునాండే చూపులం బ్రసరించుకొని మనోభావంబుల వెదలించుకొనిరట. తుదివఱకును యీ విషయమే నెఱుంగను. మీ సౌందర్య విశేషాతి రేకంబులును, తానందనున్న యుత్కృష్ట ప్రభ్వీపదంబును దెలియంబల్కినను వ్యతిరేక భావంబునం దాను వలచినవానిం గాని తా వరింపననుట భవన్నికాయంబునకుం జేర్పవలనుపడదయ్యె.

మ॥ తెలియం బల్కితి భూప నావివరముల్ ♦ తీవ్రంపు భావాళిచే
గలంతం బొడంగం జేయంగాం గలుగు, సా ♦ కర్యంబులేయున్న, నే
కలుషాత్ముండను, సత్యసంధుండను, త ♦ ర్కంబొప్పం గావింపుం డా
వలనైనం దమ యంతరాత్మకు స్ఫురిం ♦ పం బోవె సత్యస్థితుల్॥

శా॥ నీసాన్నిధ్యమునం వచింప నెమ్మపై ♦ నీతిం విలోకింపకే
వోసాకుల్ సమయానుకూలముగ నే ♦ నొందంగ సౌభాగ్యముల్
గాసిం బెట్ట నమాయికుం దమ గటా ♦ తు శ్రీ విలాసార్థినై
నీసంబేనియు దోస మే నెఱుంగం బృ ♦ థ్వీనాథ! ఆలింపవే॥

భూపాలా! నీ జనకునియెడ నాకుంగల భక్తి విశేషమునను, ఆతని నిర్యాణ కాలమున నేనొనర్చిన వాగ్దానానుసారముగను, నీయెడంగల పుత్రవాత్సల్యమునను, నీ కర్ధాంగినింగూర్పం బ్రయత్నము లొనర్చితి. అంతియె కాని, స్వశ్రేయమున కాధారమగునని సంకల్పించినవాండను గాను.

దమనా! నీ దుష్క్రియలే నీ భవిష్యదభివృద్ధికి భంగకరంబులని దూరదృష్టిం దిలకింపలేనివాఁడవై నాలేమి నీ జయప్రదంబున కత్యంతావశ్యంబని పొరఁబడి నా శీఘ్రపతన మభిలషించుచు మొద తెగని కార్యదీక్షం జరించుచున్నావు. పరునిమేలు మన మపేక్షించినఁగాని యొకమేలు మనకు సేకూరదను న్యాయ మజ్ఞానివై తెలియవైతివి. ఆరంభమున నా పుత్రుని రేపెట్టితివి. అసత్యంబులనేకంబులు సమయానుకూలంబుగ బట్టువోలె రాజుకడ నేకరు వెట్టుచు నాసిరిం దుల్లఁజేయ సిద్ధమైతివి. అశరీరుఁడై ప్రపంచ చిత్రంబులం గనుచున్న విరాట్స్వరూపుఁడు మానవుల యఘ సంచయంబులకు ప్రతిఫల మప్పుడప్పుడే కూర్చుచుండు. వెన్ను విఱుచుకొని తిరుగు టొప్పదు.

దమ—ద్రోహ మొనర్చి పట్టువడి నా పైఁబడిన నేమిలాభము? మిన్ను మన్ను నెఱుంగక వెన్నువిఱుచుకొని దిరుగనేల? ఇప్పుడైనను దాసోహమ్మనక యీ తెగనీలు గేల? నీ వొక్కనాఁడు నను భూషించితివా? ఇపుడు దూషించుచున్నావా? జన్మాంతర వైరులము. పొమ్ము; నీపాపమున నీవు పోదువు.

రాజా—

తే॥ గీ॥ "శాపనార్థంబు" లంబెట్ట ♦ సాఁగె నితఁడు
నన్ను మొదలెత్తె రాజ **యీ** ♦ నామ మెత్తు
పైన విషపుఁ బన్నులను దా ♦ విప్లవంబు
మూఁడుఁగానఁ దొలఁగఁ జెల్లు ♦ ముప్పువాయ॥

సుద—(కోపముతో) దమనాఖ్యా! బుద్ధిసాగరుని మోమును నేనిఁకఁ జూడనొల్ల. ఆతని పల్కులన్నియు ననృతములు. నాకై దెచ్చిన కోమలాంగిని సుతున కీతఁడే కూర్చెననుట నిర్వివాదాంశము. ఈ క్షణముననే యాతనిని యుద్యోగమునుండి తొలఁగించితిని. ఇఁకముందు నీవే ప్రప్రధానివి. **ఈతనిం** జీఁకటి కొట్టులోఁ ద్రోయింపుము. మదోన్మత్తుండగు మదనునిఁగూడఁ జెఱసాలం

శీఘ్రముగ. నన్వరింపనని మదనునిఁ బాణిగ్రహణ మొనర్చిన నాతిని నాకడ కీడ్పించుకొని రమ్ము.

(సుదర్శనుఁడు వెడలి పోవును.)

దమ—రక్షకభటులారా! బుద్ధిసాగరుని చెఱఁ ద్రోయుఁడు?

(దమనుఁడు వెడలి పోవును)

మొదటి రక్షక భటుడు. } స్వామీ! ఇదేటి విపరీతము!

రెండవ భ—రాజ్య వినాశనమున కిట్టివే నిదర్శనములు.

బుద్ధి—భటులారా! అశుభంబుల నాడఁ జెల్లదు. దారితీయుఁడు. మీ విధ్యుక్తధర్మంబులొనర్పక యుపేక్షించుట పరమ దుర్మార్గము. నాయందు నింతకుమునుపు మీకుఁగల భయభక్తుల కిఁక స్థలములేదు. జీవనపోషణయందున్న మీ రాతని యాజ్ఞలకు లోఁగుట సేవాధర్మము. అర్హకృత్యము. తప్పుట తనకుఁదాను గొయ్యి దీసికొనుట యనుట ధ్రువము. పరమాత్మా! మంచి గుణపాఠము నేర్పితివి. మానవులు, ఎదుటివారి యంతర్గతాభిప్రాయంబుల నరయ నసమర్థులు; అసమర్థులు.

శా॥ నాసర్వస్వము ధారవోసి, స్థిరమౌ ♦ నారాజ్యమే యుంచు నే
వీసంబేనియుఁ బ్రాలు మాలక విధుల్ ♦ వేవేగ నీడేర్చఁగా
నీసుంబూనిన నేఁడు లోఁదలఁపఁ "డె ♦ ద్దీనిందనం గొట్టమే
వాసంబన్న" తెఱంగునన్ దమను డు ♦ ర్వాక్యమ్ములే నమ్మెఁగా॥

ఉ॥ తేఁడును రాజ్యలక్ష్మియె త ♦ రింపఁగఁ జేయును నన్నటంచు ది
గ్గాడుచు శ్రీశ! నేఁ గడు బ ♦ రాఙ్ముఖతన్ స్మరియింప నిన్ను; న
న్వాడని నీచుడంచు దయఁబాసి ♦ చెఱన్ నరకంపుబావిలోఁ
బాడిమె ద్రోయ? మత్కృత వి ♦ పాక మహత్తర పాతకంబె పో॥

(ముప్పురును వెడలి పోవుదురు.)

(తెఱ వ్రాలును.)

—* నాల్గవయంకము *—

ద్వితీయరంగము.

[అడవి—మదనుఁడు నిలిచియుండును]

మద—

సీ॥ నామూలమునఁగదా ♦ నన్నుఁ గన్నయ్యకు
బందిలోఁబడుట సం ♦ ప్రాప్తమయ్యె
నామూలమునఁగదా ♦ నన్నుఁ గన్నతల్లికి
భరణపుంగూటి దా ♦ ర్భాగ్యమబ్బె
నామూలమునఁగదా ♦ నాతన్వి నడిచెడిక
కంటకావృత ఘోర ♦ కాననముల
నామూలమునఁగదా ♦ సల్గిశల్ నుతిగన్న
బుద్ధిసాగరుకీర్తి ♦ బుగ్గిఁగలసె
తే॥ గీ॥ కాదు కులనాశకుఁడను నే ♦ నౌదు కుమతి
మోహజలధి నిమగ్నత ♦ మూర్ఛవోయి
తల్లిదండ్రుల కష్టముల్ ♦ దలఁపలేక
తరుణితోఁ సాఁగితేఁ దల ♦ దాఁచుకొనఁగ॥
తే॥ గీ॥ కొడుకనిన నేన, యుద్ధార ♦ కుఁడను నేన
పెల్లగించితి కూకటి ♦ వేళ్ళతోడ
మొలకలెత్తంగనీక స్వ ♦ కుల ముశన్ను
వంశపారంపరీణమా ♦ వాసితొలఁగె॥

అయ్యో! నే నెంతవెఱ్ఱిని! జన్మమునకుఁ గారణభూతులగు మాతాపితల సరకుసేయనైతిగా! ప్రత్యక్షదైవముల కెగ్గుగూర్చిన వాని కెన్ని దుర్గతులున్నవో కదా. మోహమా! ఏమి నీ చతురత! కన్నుల కెగదట్టి చేయించిన ద్రోకటి; మరలఁ బశ్చాత్తాపము సూచించెదవా? అప్పుడంత మదాంధత యేమి? ఇప్పుడీ పరితాప మేల?

ఉ॥ ఎక్కడిరాగమిద్ది తర ♦ శేక్షణపైఁ దలి తండ్రికన్నఁ; బె
న్మక్కువఁ బెంచి విద్యల స ♦ మర్థునిసర్వరె, గంపెఁడాశతోఁ,
జిక్కరబొమ్మయుంచుఁ బలు ♦ సార్లను చజ్ఞత మోహరజ్జులం
జిక్కి చరించుటల్ క్రమమె, ♦ ఛీ! పెడబుద్ధి! ననుఁ ద్యజింపుమా॥

ఆ! ఏమనుచున్నాను! చిత్రరేఖపై నేటి ప్రేమయునియా! నా యాటవప్రాణము నవమానించుటయా! విడిచిన తలిదండ్రులు లెక్కవయా? నెన్నంటిన విమలాంగి మిన్నయా? స్వసౌఖ్యమును దృణప్రాయముగ నెంచి నిరుపమాన సౌభాగ్యసంపదల నందుట నిక్కవమని చెప్పకయే చెప్పుచున్న రాజేంద్రుడు భోగమును వాక్కై తృణీకరించిన యీ చానకన్న నీ యుర్వి నా కొరు లెక్కు... వారున్నారా? సుఖదుఃఖంబులఁ దులయై పాల్గొన్న కలికిం జుల్కన జేయు టేటిమాట? ఇంతీ! నీ పరోక్షంబున నేమనుకొనిన నేమి? నీ ముఖావలోకనంబున మరులు పైఁగొన నెండు తలంపుల కవకాశ మెట్లుండును? సూదంటు రాయివోలె నిష్కల్మషమగు ననురాగపుం జూడ్కులు దుశ్చింతలఁ బాపి యాకర్షింపఁగలవు. జలాశయంబున జలకమాడునెడ సహోదరులుగ భ్రమసి నీటిపాములు కురులను, మీనములు నేత్రములను, తామరతూండ్లు కరములను ముద్దిడుకొనుచున్నవి. నారశ్మిసోఁకి కమలని కమల ముద్భవించెనే యని ప్రకృతి చిహ్నము తెలవంచె నన్నట్లు మేఘముచాటున నొదిగె. అంచయానా! సిగ్గని హంసలు అడుగిడక సిగ్గున మూలముడుచుకొని యున్నవి. సప్తజన్మములెత్తినను నిన్బోలిన సహచారిణి నాకు లభించుట దుర్లభము. (చప్పట్లుగొట్టుచు) చిత్రా! వియోగభరము కడుంగడు దుర్భరము. జలక్రీడలం జాలించి రా రమ్ము.

[దమనుడు ప్రవేశించును.]

దమ—(స్వగతము) కపటీ! నవాబా! రహస్యముగ సాగసంపిన దంపతులను చేఁజిక్కించుకొంటిని. నా కనులు మూయు నితరమగునా?

తే॥ గీ॥ ఔర నాశక్తి నాబుద్ధి ♦ యాత్మబలము
క్రొల్లునిని జేసితిం బిల్లి ♦ కూనసిప్పు

కప్పఁబట్టిరి నాకడఁ ♦ గావువింత
యురగమును బోలెఁ గబళింప ♦ నుంటిమదన॥

తే॥ గీ॥ మదనుఁడొక్కఁడె గననయ్యె ♦ మగువయేడ?
మదనుతలమూర్తి యేరైన ♦ మగువఁగొనిరో
చిత్రరేఖను శిక్షింపఁ ♦ జేతునంటి;
జనపతియటన్న కేసరి ♦ స్వప్నమయ్యె!

చిత్రరేఖ యుండెందైన మసలుచున్నదేమో చూచెదఁగాక.

(దమనుఁడు లోనికిఁ బోవును)

(ఒకపురుషుఁడు, ఆవలిపార్శ్వమునుండి ప్రవేశించును)

పురు—(స్వగతము) ప్రసంగమువలన నేఁగిన యాతఁడు దమనుఁడనియు నందు నిలిచిన యతఁడు మదనుఁడనియు విదితమయ్యె. నవాబూహించినట్లే దమనుఁడిందుఁ బ్రవేశించుటయు, దంపతులఁ జిక్కించుకొంటిననె మురియుటయు, చిత్రరేఖాసహితుఁడై యేగకున్న స్వనాశమున కవకాశమని విలపించుటయు వినంగల్గితి. నేనీ మదనునకు నన్నెఱిగించుకొనుటయే యుత్తమము కాకున్నఁ గార్యము చెడును.

(నాల్గడుగులు ముందునకుఁ బోవును.)

(ప్రకాశముగ) మంత్రిసుతా! మదనాఖ్యా! నేను మీ ముఖ్యమిత్రుఁడగు నవాబుగారి యాజ్ఞను పాలించుచు నిటకు విచ్చేసితి. దమనుఁడు మిమ్మురహుపురం బంధించి కొనిపోవ నీక్షణమున నివ్విపిన ప్రవేశమొనర్చె. నీయింతి జాడఁ గననేగె. ఆపె నిటకుఁ బిలువుము. నేనన్యుఁడనని సందేహింపకుము. నీసతీతిలకమును సత్వర మెదురేగి కొనిరమ్ము.

మద—మహాత్మా! అటులనా. పుణ్యమూర్తి! నవాబా! నిశ్చయముగ నీవే నాపాలిటిదైవమవు. తెప్పపాటుకాలములో సతీయుతుండనై వచ్చెద.

(లోనికేగును)

(పురుషుఁడు బాణతూణీరంబులం దిగిచి యోధుని వేషముఁ దొలఁగించి సహజ స్త్రీరూపమున నిలిచి)

(ప్రకాశముగ) ఈదినముకదా సుదినము. నాతోఁబుట్టువుం గనఁబోవుచున్న దాన. అక్కయ్యా యీ శశిరేఖను గుర్తింపఁ జాలకుందువా?

(మదనుఁడు, చిత్రరేఖయుఁ బ్రవేశింతురు)

చిత్ర—(ప్రవేశించిన వెంటనే శశిరేఖఁజూచి తత్తరమున) ఏమిది! నాశశిరేఖయా! ఎంతటిభాగ్య మెంతటిభాగ్యము!

(అనుచుఁబోయి కౌఁగలించుకొనును)

శశి—(మదనునిఁ జేరఁబోయి) బావగారికి నమస్కారములు. పురుష వేషమునఁ దమసాన్నిధ్యముఁ జేరి తొలుదొల్త నావిషయము వివరింపనందులకు మన్నింపుఁడు. కార్యభారమున నట్లొనర్చితి. మీచరిత్రనంతయు నవాబుగారి మూలమున సాంగముగ వింటి. నా నిజ చరిత్రము వారికిం దేటపఱచితి. వారిపంపుననే మిముంగన వచ్చితి. ఈవనము తమకుఁ బరిచితమే యగుడు నిందెందేని మీరు దమనుని కంటఁబడకుండ దాఁగియుందురు. నేనిందు విహరించుచుందు. దమనుఁడు నన్నే చిత్రరేఖయనుకొని రాజు పాలికిం గొంపోవును. పైవిషయమెట్లుండునో చూచుకొందము. మీముప్పు వాపుకొనుటకిదియె మార్గము. ఇది నవాబుగారి పన్నుగడ. తమరిరువురు వేవేగమే తర్లుఁడు. నవాబుగారహర్నిశ మాహార నిద్రలమాని మామగారి విడుదలకును, దమనునిపొంగడపను, మామగారి కీర్తిని బునరుద్ధరింపను, రాజునకుఁ దారతమ్యజ్ఞాన మలవఱుపను విశ్వప్రయత్న మొనర్చుచున్నారు. తమ రాలసించుట వారికార్యదీక్షకు భంగమొనఁగూడు నేమో? అక్కయ్యా! ఎడఁబాటునకై వగవకుము. సక్రమముగ విధులు నెఱవేఱిన నత్యంతాల్ప కాలములో మనకు సమాగమ మయ్యెడి. నాకుఁగీడు మూడునని భయపడకుఁడు. అగోచరులగు నవాబుభృత్యులు నన్నురక్షింప

నెల్లెడల విజృంభించి యున్నారు. (లోదాఁచిన కరవాలమును లాగి చూపుచు) నన్ను రక్షించు నదియు, రక్షింపనున్న దియు నిదియే. నిర్భయముగ వెడలుఁడు. (కరవాలము దాచును.)

(మదనుఁడును, చిత్రరేఖయు వెడలిపోవుదురు)

[దమనుఁడు ప్రవేశించును]

దమ—(స్వగతము) (శశిరేఖను దేఱిపాఱఁజూచి) ఈ పెయే చిత్రరేఖ. నిస్సంశయము. నా ప్రాణములు దక్కినట్లే.

(ప్రకాశముగ) స్త్రీరత్నమా! నీ వెవరు? మదనుని యిల్లాల వగుచిత్రరేఖ వీవే యనుకొందును.

స్త్రీ—(చెవులుమూసికొని) హరి హరీ! పాపము శమించుఁగాత! పురుషవతంసమా! నేను జిత్రరేఖ నేగాని మదనుఁడు, వారివారు, నన్నాతని యిల్లాల ననుకొనుచున్నారు. కాని నేఁగాను. బుద్ధిసాగరుఁడీటఁ బలవంతముగఁ జేర్చుకొని సుతుని వరింపుమనుచున్నాఁడు. నన్న స్వతంత్ర నొనర్చిరి. మదనుఁడు నన్నిడుపక పిశాచమై పీడించుచున్నాఁడు. కదలనీయకున్నాఁడు. ఈ జలాశయమున స్నానమాడు మిషనిందుఁ జేరి నాదుస్థితికిఁ దలపోయుచున్నాను. నన్నీతని బారినుండి తప్పింప నీకు సామర్థ్యమున్న నన్ను రక్షింపుము.

దమ—(స్వగతము)

ఉ॥ ఏదమనుండఁగాను మును - పే కనకం బని ముట్ట మట్టియా;
ఆదనుజాంతకుండు కను - లారఁ గనుంగొన నేఁటితోఁజనెఁ
నాదురితంపుఁబుంజములు - నాతినుడుల్ జనపాలవాలి హా
ర్దోదధినోలలార్చుఁ; బరు - షోక్తులఁ బాల్పడనీకఁ బ్రోచెఁగా॥

(ప్రకాశముగ)

కన్యకామణీ! బుద్ధిసాగరుఁడు మాసుదర్శన భూధవుని నీవు వరింప నంటివనియు మదనునే గాంధర్వ విధినిఁ గేల్పట్టితివనియు నుడివెనే. అంతయును నాకాశపురాణమేనా? కుమారుని దుండగ మెఱిఁగి తనుమాడ నుద్యుక్తుం డయ్యెననియు, నవాబు వారించెననియు వింటిమే.

చిత్ర — అన్నియును మృషలే. రాజప్రశంసయే నాకడ రాలేదు. మదనుఁడే యాతఁడు నాపై నుసిగొలిపెను. అదను కాదని మదను నా పుచుఁ గపటప్రేమను బ్రకటించుచు ముందున్నది ముసళ్ళపండుగ యని యాశపెట్టుచు మానరక్షణ మొనర్చుకొనుచున్నాను. మదనుని కేల్వట్ట నేను ముఖత్వమును జూపక నాలసించుచుండుటచే నన్నితరు లపేక్షింప కుండుట కిట్టి యుద్దంకి సృష్టించిరి. నాసమక్షమునఁ దండ్రి కుమారునిఁ ద్రుంపం బోవుటయు నవాబువారించుటయు నెన్నఁడును జరుగ లేదు. బుద్ధిసాగరుని మాటల విని మీరు మోసపోతిరి. తమరెవ్వరు? తమ నామధేయ మేమి? నన్నుఁ గాపాడఁ గల్గిన వైళంబ దారితీయుఁడు.

దమ — సుదర్శన భూజానికి నేనును బుద్ధిసాగరుఁడును ప్రధానులము. నాపేరు దమనుఁడు. పోనిమ్ము. సుదర్శనుని ప్రోలకే నిన్గొంపోవలసియున్నది. బుద్ధిసాగరుఁడు వెలి పుచ్చిన దురభిప్రాయమున తేఁడు నీయెడఁ గట్టలుకం బూనితన్ను వరింపనంటి వను తామసంబున ముక్కుత్రాడుతో నిన్నీడ్చుకొని రమ్మని యాజ్ఞాపించెను. కన్యాత్వమునకు భంగము కలుగకుండ మెలంగుచుంటినని సవినయంబుగ సహేతుకంబుగ నృపునితో నచ్చెంబల్క వలచి వలపించుకొని రాణివై మెఱఁగుము. దైవము నీకుఁ దోడగుఁగాత! రారమ్ము. (చేతం జూపుచు) ఆపాలకీయం దేగి యాసీనవుగమ్ము. నేనిదె బోయులతో వచ్చెద.

చిత్ర — మహాప్రసాదము. (దమనుఁడు వెడలును)

చిత్ర — నన్బడసితి నను పరమాహ్లాదమున దమనుఁడు మదనుని మాటయే మఱచినట్లున్నది. ఇంతవరకును పను లనుకొని నట్లు నెఱవేఱినట్లే.

తే॥ గీ॥ చానరూపంబు మాఱిచి • జారచోరు
ల వలని భయమ్ము లేక మె • లంగుచుంటి
సోదరికినై వ్రతమును య • శోదతనయ!
పాసితిని; గాచుటెట్లో? శు • భంబదెట్లో॥

పూర్వాపరజ్ఞాన శూన్యుండై దమను దుర్బోధనలం జిక్కి- బుద్ధిసాగరుం బరిభవించిన జనపతి తన్ను వరింపననిన మదను రాణినని మోముం జూడ నొల్లక వేగమె యెట్టి శిక్షను విధించునో? ఆ బుద్ధికుశలు ముఖావలోకన మునర్పక తప్పదు. ఈ సందర్భమున దమునికిం బరాభవముం గూర్చుటయు నవసరము.(యోచన నభినయించి) ఇప్పుడు మెదలునకు దట్లు యోచనయే బాగుగనున్నది. ఇట్లొనర్చెదంగాక.

(వెడలిపోవును)

(తెఱ వ్రాలును.)

—* నాల్గవయంకము *—

తృతీయ రంగము.

(రాజమందిరము: సుదర్శనభూవిభుండు కనకమణిమయాసనాసీనుండై యుండు.)

సుదర్శనుండు—

శా॥ దూరాలోచనచేయుకే నతసికే ◆ దోద్రోహముల్ జేసి న
ట్లారూఢ నను దిట్టుచుందురట మే ◆ లూహింపకజ్ఞానులై
నోరారన్ బలుకాడ నుబ్బు జనులా ◆ నోరెత్తి లెక్కింపనా!
యే రింతా నపదిన్న గర్వితుల నే ◆ సిద్దింతు శిక్షార్థమై॥

ఉ॥ రోజులు సాగుటన్ దమను ◆ ప్రోవల కియ్యదా విఘ్నసంచయం
బా జగడాలమారి సయ ◆ దమ్మిదు దారసిలంగఁ జేసెనన్;
ఓజఁగలంచె మానసము; ◆ నోటమి నిక్కువ; మేల్ ద్రుళ్లుటల్;
వ్యాజమె నిన్నె గూల్చు; నరి ◆ వాఁడవె నాకుఁ దురుమ్మ-పాంసనా॥

తే॥ గీ॥ సాహెంబు మనిఁడెగా బుద్ధి ◆ సాగరుని మ
నుచుట; చెలి విడిపింతు న ◆ నుచు శపథము
నూని నట తిండిమత్తత ◆ నూఁగు తురక
యుండ దయే తెల్పు బలగంపు ◆ టతిశయంబు॥

(తెరలో) మహారాజా! వృద్ధపురోహిత సత్తముండగు రామశర్మగారు హజారముకడ నిల్చి దర్శన మభిలషించు చున్నారు.

సుద—సేవకా! వారిని వేవేగఁ గొనిరమ్ము.

సేవకుఁడు—(తెరలో) చిత్తము.

(రామశర్మ ప్రవేశించును.)

సుద—తాతగారూ! దయచేయుఁడు. ఆయత్తాసన మలంకరింపుఁడు.

రామశర్మ—రాజా! దీర్ఘాయుష్మాన్భవ.

సుద—చిత్తము. (స్వగతము) ఎన్నఁడును రాఁడే; యీతఁడేటికై వచ్చియుండును.

రామ—(లేచి నిలిచి) భూపాలా! మంత్రాంగనిపుణుఁడగు మంత్రిలేమి సభవెన్నెలలేని నిసివలెఁ జిన్నవోయియున్నది. అందు బుద్ధిసాగరుని తేజఃపటలంబునఁ దమమూర్తి ప్రకాశించుచుఁ గన్నులపండువుగ నుండెడిది. తమరునుదమతండ్రిగారును నాపైవారును దేశక్షేమమును, ప్రజల వాంఛితంబులును పాటించుచు, సంపూర్ణవిశ్వాసంబున కునికిపట్టులయి పరమానందమున జను లుబ్బుఁతలూఁగుచు రాజభక్తి ధర్మానురక్తులను సూచింప మంగళమహాశ్రీ లనుభవించిరి. నిన్న మొన్నటిదనుకఁ దమపరిపూర్ణానుగ్రహంబునకును, బితృస్థానంబున నధిష్ఠింపఁజేసి పూజార్హతకును, ప్రజాలోకంబున బాలాది వృద్ధపర్యంతము తలమానికం బని ప్రశంసాపాత్రతకును మూలమైన యమాత్యశేఖరుండగు బుద్ధిసాగర సుధీ మణిని బందినుంచుట ప్రజలలో నసంతృప్తికి దావలంబయ్యె నని మనవిచేసికొనుటకుఁ జింతుల్లుచున్నాను, వారు తమకును, దమకుటంబమువారికిని నొనర్చిన సేవ వర్ణనాతీతము. తమ్మును బసికూనలప్పుడు హస్తగతంబొనర్చి యీబాలుని పురోవృద్ధికి మీరుతక్క నన్యులేరునులేరని యుష్మత్ప్రీతగద్గదకంఠనినాదంబున వాక్రుచ్చ నీధీసంపన్నుఁడు హోరు మనియేడ్చి నాగొంతుక నూపిరియున్నంతవరకుఁ గంటి కగు ఱెప్పనై కాపాడెదనని వాగ్దత్తమిచ్చె. ఆమహామహునికా యిట్టి యిక్కట్టు! తమబాల్యమునఁ బరరాజులు పైకెత్తిరా విచ్ఛిన్న దశ

యందు సామ్రాజ్యమునకుఁ బట్టుగొమ్మయై నిలిచి ప్రాణముల నర్పింప సిద్ధుండై రణాంగణమునఁ బ్రళయకాల రుద్రునివలె నిలిచి వైరుల నుక్కడగించి నందులకా యీసీచకారాగృహవాసము! వారొనర్చినది తప్పుగాదనియు, ప్రభువుల కతఁడు పయత్యంతాల్ప కారణమునఁనో దోషసమన్వితుండని నమ్మిక గల్గినను తన్మూలమున నాతని యమాత్యపదవికేలోటును సంఘటింపఁజేయుట శాస్త్రవిరుద్ధమనియుఁ బ్రజలైకకంఠముగ నభిప్రాయపడుచున్నారు. వ్యక్తులకుఁ గల్గిన విముఖత్వమున రాష్ట్రమును విపద్దశకుఁదెచ్చుట యన్యాయము. వారిలేమి యనర్థము వాటిల్లఁజేయునని ప్రజలు దృఢవిశ్వాసమును వెలువరించుచున్నారు. కావునఁ బ్రభువులు శాంతచిత్తమును వహించి ప్రజల మొఱ యాలకించి దుష్టప్రబోధంబులకుఁ జెవులొగ్గక "ప్రమాదోధీమతామపి" యందురుగాన పశ్చాత్తాపమును వెలిఁబుచ్చుచుఁ బ్రధానమంత్రిని విడుదలచేసి యథోచితంబుగ వారిపదవి యందున వారి నలంకరించి, చిందరవందరయైన వారికుటుంబము నొక్కెడఁజేర్చినఁగాని ప్రజారంజకులను నామము తమరుదక్కించుకొనఁజాలరు. తమపరిపాలనలో నున్న వారెల్లరు నిట్టిదాని నపేక్షించుచున్నారు. బుద్ధిసాగరుఁడు కరుణామయుఁడు. ప్రేమించి విశ్వాసమును సేకరించుకొనెను. పరమశాంతుఁడు. అపకారికేనినుపకారమే కూర్చునుత్తమ పురుషశ్రేష్ఠుఁడు. అతఁడేలోకబంధుఁడు. శమదమాది సద్గుణ సంపన్నుండగు నా యవతారపురుషుని వారముదినములలో, పాలితుల విజ్ఞప్తి దివ్యచిత్తమునకుం దెచ్చి స్వతంత్రు నొనర్పుఁడు. రాజభక్తి పరాయణులగు మాబోంట్ల కలజడి ఘటింపక శ్రీవారే యుచితరీతి మెలంగ సర్వేశ్వరుఁడు ధీసంపన్నులం జేయుఁగాత! రాజా! ప్రజలసంతకములతో నిట్టి విజ్ఞాపనాపత్రములు తమసమ్ముఖమునఁ జేరినట్లు వింటిని.

మద—భూసురశ్రేష్ఠా! గుణగ్రహణపారీణు లొండొరులు లోపాలోపంబుల దిద్దికొనుట ప్రశస్తకార్యము. నవరసపూరితంబై

ప్రణుతి పత్రము విరాజిల్లుచున్నది. సావధానముగఁ దమవాక్యం బుల నాకర్ణించితి. ఉచితరీతి వ్యవహరించెద.

రామశర్మ—రాజా! వయోవృద్ధుండనై పదచలనము మాని త్వదా శ్రయమువలన లభించిన యదృష్టయ భాగ్యోదయమున సర్వ సౌఖ్యంబు లనుభవించుచు శ్రీరామ సంకీర్తన మొనర్చుకొనుచు సుఖినై యుండియు ప్రస్తుత సంక్షోభమును విని నా నేర్చినకొలంది విన్న వించుట విధియని బయలువెడలి వచ్చితిని.

సుదర్శ—మంచిది. పిన్నలకు సన్మార్గము లుద్బోధించుట న్యాయమే కదా? మీ హితము వందనపూర్వకముగ నందుకొంటి.

రామ—భూపాలా! నేను పోయివచ్చెదను. సెలవునంగెదరా?

సుద—స్వామీ! నమస్కారములు.

(రామశర్మ వెడలిపోవును)

సుద—ఓరిపిడుగా! వచ్చితురకా! కాలమహిమ నిన్నింతవాని నొనర్చె నురా! ప్రజానాయకుఁడవా! నీకు దోడుగా నందఱి మతులం జెఱి పితివి.

తే॥ గీ॥ పూర్వులార్జించి పెట్టఁగా - బువ్వమెక్కి
ముండగ్రాసముఁదినుచును - మూలనక్కి
గడ్డపుంజీర పేలన - ఖాలఁగ్రుక్కి
నాయకుఁడవైతె నీదుప్రా - ణము పలుకక్కి॥

ఈయల్పునిలో నేమిగాని బుద్ధిసాగరునిమొద నే కృతఘ్నుఁ డన్నమాట నామనసకు వచ్చినప్పుడు హృదయము దహించుకొని పోవుచున్నది. అయ్యో! పాపమీనవిఫుఁడేల కన్యాన్వేషణంబునకుఁ గడంగె? కడంగిన మాత్రమున వారింపక నేనేల యియ్యకొంటి? ఇయ్యకొన్న మాత్రంబున నిట్టి విపర్యాసంబు లేల ప్రాప్తించ వలయు? ప్రాప్తించెఁబో విభుఁడ నగు నేను మదన తాపజ్వరంబునఁ మండిపడ, శాంతవచనంబులను శీతలోపచారంబులఁ దప్తుండ నగుటకు మారుగ నీర్ష్యాగ్రస్థుండగు దమను తీవ్రవాక్యలధిఁ బడి తెప్పతిల్లలేక సుడి గుండంబునఁ బడితి. దమనా

ఆ నిమిషంబున నంకురించిన యాగ్రహానలముఁ జల్లార్పక విరాజమానమై వెలుఁగ రోషతైల తప్తంబులగు వత్తులోయనఁ దీవ్రభాషణంబుల నతికించుచు నా తను సర్వస్వముపైఁ బూర్ణాధికారమును నీవే వహించి బుద్ధిసాగరునిఁ గారాగారంబునం ద్రోయించితివి. చిక్కులఁ దెచ్చిపెట్టితివి. సామాన్య పరిస్థితులనే స్థిమితపఱచుటకు నేతిలోఁ బడ్డ యీఁగవోలె గిలగిలలాడుదువే యిప్పుడేమందువు? అయ్యకు బెండ్లియయ్యె నను సంతసమేగాని సవతి తల్లిపోరు గుర్తింపలే దన్నట్లు బుద్ధిసాగరుని సాధించితి నను మురిపమేగాని రాజ్యరక్షణా పాటవంబల్పంబుగఁ దోఁచెడి. ఇట్టి యాందోళన విషయము వినిపింప వైతివిగదా.

సేవకుఁడు—(తెరలో) తస్మాసాలా! హజారముకడ నుజ్జయినీపురంబు నుండి దూతవచ్చి దర్శనమునకై నిరీక్షించుచున్నాఁడు.

సుదర్శనుఁడు—సేవకా! వారిలోనం జేర్పుము. ఉజ్జయినీవారు నా ప్రతాపమువిని మందలింపు పంపియుండరుకదా.

[దూత ప్రవేశించును]

దూత—రాజశేఖరునకు వందనములు. జయమగుఁగాక! నేను ఉజ్జయినీ పురంబునుండి పంపఁబడితిని.

సుద—దూతకార్యధురంధరా! ఆ పీఠమలంకరింపుము. ఆగమన వార్తల వివరింపుఁడు.

దూత—ప్రభువర్యా! మాస్వామివచనంబు లవధారుఁడు.

ఉ॥ వార్తవినంగనా సుగుణ ♦ వారిధిచంద్ర; సుదర్శనాఖ్య! స
త్కీర్తిలతల్ దిగంచల వి ♦ కీర్ణత గాంచిన బుద్ధిసాగరున్
ధూర్తుఁడవై చెఱన్ బడఁగఁ ♦ ద్రోసితి వంచుఁ బ్రజాళి విన్నపం
బార్తినిబంపె మాకు సచి ♦ వాగ్రణి వేగ విముక్తుఁజేయఁగన్॥

శా॥ సారాంశంబులఁ బాఱఁజూచి మగుడన్ ♦ శాసింపుమీ వీడుకోల్
భారంబా ప్రజ నాకుఁ బోవుట తుదన్ ♦ వారెల్లనొక్కుమ్మడిన్
మీఱాఁగా, మనలో నెవండో రిపులన్ ♦ మేలందఁ దాఁగూడు నే
తీరుల్బూచినఁ జేటు; మంత్రిచెఱ పు ♦ త్తెంచన్ దమింపన్ దగున్॥

శా॥ ఆమంత్రింత్రునకుఁ బ్రమాణునిలలో ♦ నార్యా! కనంబోము నీ
క్షేమంబెంచి వచింతు, నాతఁ డగు నీ ♦ జీవంబు; నీ వైరు లా
నామంబన్న వడంకి పైకురుకు లే ♦ నాఁడా యటంచున్న వా;
రేమాయం బడఁబోక యా ప్రథితునే ♦ యెన్నందగుఁ మంత్రిగన్॥

తే॥ గీ॥ చిన్నవాఁడవు నీవు న ♦ చివ్వ ననుపమ
గుణనిధానమాళి విడిచి ♦ కొందలంబు
చేతులంగొని తెచ్చెడి ♦ సీతఁగాంచి
మేలుఁ గోరుచుఁ దెల్పితో ♦ మిత్రవినుము॥

తే॥ గీ॥ స్వార్థమును నెంచి తినుఁదన ♦ యండమంటిచి
యెన్నుపైన జవ్వాజినా ♦ నెగు ముఖమున
దీపముండఁగ వెదుకఁగఁ ♦ దివ్వునట్టి
మంత్రి శేఖరు లెందఱో ♦ మహినిఁగలరు॥

తే॥ గీ॥ ప్రభువు నెడ భక్తి ప్రజలనఁ ♦ బాదరక్తి
పరధన విరక్తి, శత్రులు ♦ వణఁకు శక్తి
న్యాయమందున నాసక్తి ♦ నమితయుక్తి
బుద్ధిసాగరుఁగూడి ప్ర ♦ సిద్ధిఁగాంచె॥

సుదర్శనుఁడు—రాయబారీ! మాస్వామివారి యమూల్య వాక్యరత్నంబుల శ్రద్ధాళువునై యాలకించితినని వివరింపుము. నీతివాక్యంబులకు వందన శతంబు లర్పించితి ననుము. నీ వేఁగుము.

దూత—చిత్తము.

[రాయబారి వెడలిపోవును]

సేవకుఁడు—[తెరలో] స్వామీ! దమనామాత్యుఁడు విచ్చేసి లోనం బ్రవేశింపఁ గోరుచున్నారు.

సుద—సేవకా! లోనం జేర్పుము. చిత్రరేఖను జిత్ర విచిత్రగతులం బరిభవింపవలయు. కసిదీర్చుకొనవలయు.

[దమనుఁడు ప్రవేశించును]

దమ—రాజా! జయమగుఁగాక.

సుద—మంత్రివరా! చిత్రరేఖయేది?

దమ—పల్లకితో మీ పడకటి గదిఁ జేర్పఁబంపితి.

సుద—అదేటి విపరీతము?

దమ—మనవినాలకింపుఁడు. చిత్రరేఖ మదనుని కేల్వట్టలేదు. తమ మాటయాపెతో నాదుష్టుఁడు వచింపనేలేదఁట. మదనుని వరింపుమని నిర్బంధించుచున్నాఁడఁట. నేర్పుతో మానరక్షణ మొనర్పుకొనుచు, ఆగుదిబండనువదలించుకొనఁజాలక, విలపించుచున్న ట్లాపె వచోధోరణి నమ్మక మొదవింపఁ గొని తెచ్చితి. తమరును విచారణ సల్పి గర్హ్యమని తోఁచిన రీతి మెలంగుఁడు.

సుద—మంచిది. నే నిదె యాశృంగారవతిం గన నేగెదను. నీవును నేఁగుము. బుద్ధిసాగరుని పరోక్షమునఁగాని యిట్టిది జతపడదని విధి యాతని కొఁగతఁ గల్పించెఁ గాఁబోలు.

[ఇరువురు నేగుదురు]

[తెర వ్రాలును]

—* నాల్గవ యంకము *—

చతుర్థరంగము.

[సుదర్శనుని పడకటిగది—సుదర్శనుఁడు నిలిచియుండును.]

సుదర్శ—

ఉ॥ ఎవ్వరికేరొ, వారి లగి ♦ యించు విరించి సులగ్నమందు నీ
జవ్వని సూనునిం గలుపఁ ♦ జాలెన మంత్రిశ్రమంబెగాని, పైఁ
జివ్వకుఁ గారణంబు, చెలిఁ ♦ జిక్కుట సంభవమయ్యె శక్యమే
చివ్వవిధాత్రవాలు నరు ♦ చే మతిఁబోయిన చేష్ట లిట్టివే॥
తే॥ గీ॥ నిప్పుత్రొక్కిన కోఁతినై ♦ నీచభాష
లాడితినటంచు దమనాఖ్యుఁ ♦ డాడియుండ
రసికతకును సందేహ మే ♦ ర్పడియె నేమొ;
తప్పు సైరించి యొప్పుల ♦ కుప్ప రావె.

తే॥ గీ॥ మర్త్యలోకంపు మదను స • మాగమంపు
నిరసనపు టూహ గుసుమంపు • శరునిదూరి
తొలితినలన్న నినుక నా • తోడఁగూడ
వేగిఁపడు కాఁబోలు? • వెలఁదినిన్ను॥

కన్యామణీ! పర్యంకికనుండి యీవలి కడుగిడి నను ధన్యం జేయుము. కామదోషాంధకారము వ్యాపింపఁ జీకటిఁ బడియున్న నన్ను నీ వదనశశిం జూపి దారి జూపఁ బుణ్యులోఁడవు. రా రమ్ము. చిత్రరేఖా! చిత్రరేఖా!

తే॥ గీ॥ కొలుపోయితి నీకునై • గుణవదాన్య
ప్రజల శిక్షలమగుభక్తి • పడఁతిమిన్న
ఆలసించుట తగవె నీ • వైనఁ గనవె
వసియెటులైనఁ దక్కితి • వింతెచాలు.

తే॥ గీ॥ పిలిచిన కొలంది బిరుసుఁగ • బిగిసికొనుట
కతినులా పురుషులకు యు • క్తమ్ముగాని
మంచువోలెను గఱఁగెడు • మగువ మనము
గడుసుఁదనమిట్లు బూన నా • కర్మఫలమొ॥

[పురుషవేషమున శశిరేఖ ప్రవేశించి]

తే॥ గీ॥ కర్మఫలమే సుదర్శనా • ఖ్యా విజంబు
వివిధబుద్ధులఁ బొడమించె • వెఱ్ఱిఁజేసె
చాలనిగ్రహాళి నడకల • చాయ లివియె
దమను మాయయెగాని నే • తరుణిగాను.

సుద—(పురుషునింగాంచి నివ్వెఱపడి అమితాగ్రహుఁడై, హుం అని పండ్లుకొఱకి) ఓరీ సేవకా! ఎవఁడురా అక్కడ?

సేవ—చిత్తము. ఆజ్ఞనెఱవేర్ప సంసిద్ధుఁడనుగ నున్నాను.

సుద—ఆ మేజాపైని కలమును సిరాబుడ్డియు నొక కాగితము నిట్లందుకొనుము.

(సేవకుం డందీయ రా జేదియో లిఖించి) సేవకా! దీని నత్యంత రయమున సేనాని కడకుం గొనిపోయి యిం దుదహరించిన రీతి

నుత్తరక్షణంబున మెలఁగు మనుమా. మహానీయా! తమరెవరు? ఇటఁ
దామెట్లు చేరితిరి?

పురు—రాజా!

తే॥ గీ॥ ఏను బంధువాడను కళిం ♦ గేశునకును
వేఁటకై వచ్చి నావారి ♦ వీడవలసె
దారిఁదప్పుట బడలికన్ ♦ దాహ మొదవె
నీరుఁ గ్రోలితి, కాసార ♦ తీరమందు
పవ్వళించుటె తెలియు దా ♦ పై నెఱుంగ॥

సుద—మహాశయా!

ఉ॥ తాపస మొందకుండు తమ ♦ దారినిఁ బుత్తు మనీషచంద్రమా
క్షేమముగాఁ బురిం దమరిఁ ♦ జేరుప నాజ్ఞలనిత్తు రంతు మా
గీయునఁ జిన్న విందుగాని ♦ గేహము శుద్ధతరంబుఁ జేయుఁడీ
నా మనవిం గ్రహించి దమన ♦ ప్రథితున్ క్షమియింప నెంచుఁడీ!

(ఇరువురును వెడలుదురు.)

(తెర వ్రాలును).

బుద్ధిసాగరవిజయము.

పంచమాంకము.

ప్రథమరంగము:— చెఱసాల.

[బుద్ధిసాగరుఁడు జైలుదుస్తులతోఁ జింపిరిచాపపై
నాసీనుఁడై యుండును.]

బుద్ధి—

మ॥ దివికిం జేరిన వృద్ధభూధవునితోఁ ♦ దీయంపు వాగ్జాలముల్
చెవులారంగ వచించితిన్ సుతుని ర ♦ క్షింతుం జుమీ తప్పకం
చు, వచోభంగము సంఘటించెఁగద హా ♦ క్రూరుండె యంచందురీ
బవిసిం జేతులఁ దెచ్చుకొంటి విలపిం ♦ పం గారణంబున్నదే॥

ఉ॥ నమ్మినవానినిం జెఱపి ♦ నాఁడను, దుష్కృతులబ్బె, నబ్బురం
బమ్మక చెల్లయుం జనఁగ ♦ నాదరువెడ్డియుఁ గాన దాపదల్
గ్రమ్మ భరింపఁగావలయుఁ ♦ గారకు లీరవికాని వారిఁదీ
ప్రమ్ముగ దూరుటల్, పరమ ♦ పాతకమందువఁ బాదుకొంటయే॥

ఉ॥ అన్నము పున్నమున్ దెలియ - వర్భక! అహ్మదుఖాను బుద్ధియై
పన్నిన పన్నగంబుల జ - వంబున మార్కొనశక్తియున్న నే
నన్నిటి కోడుఁ గారకుఁడ - నంచను సాకట మంతరంగము
దెన్ని విధాలఁగుందిడునొ - ఈశునకెల్లయు గోచరంబెగా॥

తే॥ గీ॥ వలదరాజకంబౌదవు న - వాబ యంచుఁ
జెడ్డపేరొందవుట భువిఁ - జెల్లదంచు
వేవిధంబులఁ గబురంప - వీడఁడాయె
పట్టుపట్టిరి ప్రజలేక - భావులగుచు॥

ఉ॥ లోకములోన నందఱు వి ♦ లోకనఁ జేతురె దూరదృష్టి, నే
నీ కలహాన కంతటికి ♦ నిక్కగు భావనఁ జేసిదూరరే;
మేకొని "తిట్టగ్రుద్దినటు" ♦ మ్లేచ్ఛసహోదరు నాయకత్వ మీ
యేకపుభావమున్ గుదిరె ♦ నే చెలిఁ జేరఁగ దైవికంబుగన్॥

మ॥ ఎవరెల్లించిన నేమి లోటు? భువనా ♦ ధీశుండు మత్కృత్యముల్
నవలోకించిన నాకు నేయఘము పా ♦ త్రాపాత్రమైయొప్పునో
భువనంబంతయుఁ గీర్తిపొందినటులే ♦ పోరం జయంబబ్బినన్
యువనిశ్రీధవు నార్జితంబనుచు ని ♦ త్యంబెంచరే భూజనుల్॥

అయ్యో! నామిత్రులు వినక భూమ్యాకాశంబుల గామే నింగి విశ్వప్రయత్న మొనర్చు చున్నారు కాని

సీ॥ ఆత్మలశోధింప ♦ నవకాశమును గూర్చి
పరితాప మొదవించుఁ ♦ బరమపదము
కష్టంబులం దించి ♦ కలుషఫలంబని
గతమును దలపించుఁ ♦ గార్మణంబు
అఘాఘచయముల ♦ ఖండింప శిక్షలన్
శమనుఁడు ధరఁగల ♦ జ్ఞానమతము
పరచింతలను మాని ♦ పరమాత్మ నెద నిల్పి
జపియింపఁదగు కృష్ణు ♦ జన్మభూమి
తే॥ గీ॥ నిర్మలాత్మను, గర్మంబు ♦ నిగిడి తెలుప
సద్గతులఁజూప, శాశ్వత ♦ సహనమోరి
మి మొదలగు సద్గుణము లీన ♦ మేటిగురువు
బంధ మె! వలవదు ప్రతి ♦ బంధకంబు॥

ఈప్రాంతముల కెవ్వరినో నూతన బాధితునిఁ గొనితెచ్చు చున్నట్లు భటుల హుంకారములును గద్దింపులును గొలుసుల చప్పుడులును వినఁబడెడి.

(దమనుఁడు వేత్రహస్తుల మధ్యగొలుసులచే కాలు సేతులు బంధింపఁబడి ప్రవేశించును.)

బుద్ధి—(లేచి నిలిచి అమితాశ్చర్యమున) ఏమిది! నాకనులు నన్ను మోసగించుచున్నవా! నిక్కువమా!

దమ—మహాత్మా! క్షమింపుము. ద్రోహిని; ద్రోహిని. అసమానుఁడ వనియును, నిరుపమగుణోపేతుఁడ వనియును, యెఱిఁగి యెఱిఁగి, యనిమిత్త వైరకారణ మోర్వలేమిచే సహించి మీ కపకార మొనర్చితి. తత్ఫలానుభవమునకై యచిరకాలంబున నటఁ జేర్పఁబడితి. ధర్మాత్ముఁడవగు నీకెగ్గులం గూర్ప దీర్ఘపరిశ్రమ యొనర్చి నిర్వహించితినని మూడునాళ్లు మురిసితిని. పరులను నిష్కారణముగ వనటల పాల్పడఁజేసిన పాపము రిత్తవోవునే?

బుద్ధి—అయ్యో! సందేహమేల? ఈతఁడు దమనుఁడే. ఓదమనా! ఏమి యీయాగడము! రాజ్యలక్ష్మి సుదర్శన భూజానిని ద్యజించు సమయమేర్పడెనా! మంత్రి లేని రాజ్యమా! నిక్కువముగ సుదర్శన భూధవుఁడు కామాంధకారమున మునింగి మైమఱచె. ఆలోచనలకుఁగంటె; అత్రమధికమయ్యె. మంత్రివర్యా! తమ కిట్టి స్థితి యేలఁ ప్రాప్తించె?

దమ—పాపాత్ముఁడనగు నేను తెమకు ముప్పుంగూర్చుటకో ఁ దనివిఁ జెందక యొసురులు దక్కించుకొన విపినంబులఁ జేరిన మదన చిత్రరేఖలం బ్రభువును సంప్రీతాత్ముం జేయఁ బట్టి తేఁగడంగితి. వెదకి వేసరి తుదకొక వనమధ్యంబున వారిం గాంచితి. దాన హర్షపులకిత శరీరుండనై వేదండము నెక్కినట్లు కరతాళము నొనర్చి తనువుమఱచి చిత్రరేఖను గొంపోయి విభుని మందిరమునఁ జేర్చితి. చిత్ర మాళగవానుని కెరుక. చిత్రరేఖయుని మందిరమునఁ జేర్పఁబడిన స్త్రీ విభుని మోలఁ బురుషుండయ్యె. ఇది నామోసమని ప్రభువు సాగ్రహుఁడై, పిలిపించి విషయంబులనేని విచారింపకయే, యుంట నున్న నన్నింటి నుండియే పురమంతయు నడపించుచు గారాగృహ ప్రవేశమొనర్ప భటులఁబంపె. సత్పురుషున కపకార మొనర్చిన

పాతకియగు నీ పౌరులెల్లరు నాస్థితికి పరమ హర్షంబును సూచించిరి. దయాళుండవగు నీ వొక్కండవే హసించకున్నావు.

తమయెడ సుప్రజనులకుం గల ప్రబలభక్తిశ్రద్ధలచేఁ దమ శత్రువునగు నాకుం జేకూరిన యిప్పటిస్థితికి మీరు తప్ప 'నన్నయో పాప'మనిన వా రెవరు లేరు. నీ వజాతశత్రుఁడవు. అలనాఁటి యజాత శత్రునకుం గృష్ణభగవాను నట్లు నీకు యోధుండగు తురుష్క సహాయుఁడగుచు వ్యవహరించుచున్నాఁడు. మూల విరాట్టువగు సిన్నూపి లోకుల చూపుల నాకర్షించి సంఘీభావములం గుదిర్చి బొటనవ్రేలిక్రింద నణచి యుంచుకొనెను. ఇట్టి నాయకుని గని విని యెఱుంగము. సైతానను కొనిన యాతఁడు సహస్రాక్షుండై వెలసెను. రెండు దినములలో నీకు మోక్షము సంప్రాప్తమగును. నా దోషమే విసర్జింపం జేసి హరించు.

భటులు—అయ్యా! నడువుఁడు. మా యధికారి ఆలస్యంబునకై ప్రశ్నించును.

(దమానుఁడు భటులు వెడలి పోవుదురు.)

(తెరవ్రాలును.)

—* పంచమాంకము *—

ద్వితీయరంగము.

(నవాబుగారి దేవిడి.)

(బురుజుపై నవాబుగారును, రామశర్మయు నిలిచియుందురు.)

రామశర్మ—సాహెబ్ మసీదా! తండోపతండంబులుగ మూఁగుచున్న జనసమూహము గాంచితిరే. సముద్రంబు పోల్కిఁ బొంగి పొంగి వచ్చుచున్నారు. కారణము గడచిన రాత్రి తమ్మును బంధించిరని దిశలెల్ల మాఱుమ్రోసెనఁట. యథార్థమెఱుంగ వచ్చుచున్నారు.

నవాబు—అరే! శర్మావార్! అల్లా! ఎంతాజరం! ఎంతాజరం వచ్చాయి! బుద్ధిసాగర్కీ మేం మిలాఖత్ కావటంలో మేరానాం పైకివచ్చార్. ఆయన మహాతం ఏం చెప్పాలా.

రామ—తురష్కచంద్రమా! తమరెలుగెత్తి పల్కనగాని వారుశాంతి వహించి గృహోన్ముఖులుగారు.

నవాబు—ఏ! భాయిలోగ్. అందర్కీ మీకీ సలాం చేసాం. బుద్ధిసాగర్కీ మాకీజోస్తీ యింతవాడ్కీహై. ఆయనగార్ ఖైదికి యెల్లాటంతో మేం ఉపార్ తిన్నాం. రాజు అన్యాళం జర్గిపించానని అల్లాలో పించార్. మాకీ మాటఅన్నాం. మీకీఅంతాన్సై చెప్పటం ఆధారంపుచ్చాకోసి కసిమే దగాం. జయంపొందాం అన్నమాటే. నాకీపట్కల్లారన్నతో యింతజనం లోస్కరావటం జయంగాదూయే? వాయిదా చెప్పాం, బుద్ధిసాగరు ఎల్లూచెప్పాలో రాజుమన్కివకం, నైతో రాజుగార్ ఒక్కటి, మనంసాబ్బిఒక్కటి. ఆయనకీ మూ కోస్బిచూడం. రా చెప్పం. పో చెప్పం. ఉండూం చెప్పం. కరిచారక్ కోస్బియెల్లర్. హయ్యగార్ హెండి పోవాలా. హల్లీ రాజు మాకీపట్టూ చెప్పాలో పట్టేవాలా కోస్బినై హైకమత్యం హంతాహచ్చిగా ఎక్కిపో యూర్. మనుసుల్మే, మాకీకులాసామే యున్నామ్. దయా యుంచి మీరు హిల్లాకుఎల్లుండి. దైవంరక్షణభీచేసాతో ఎంతమాత్రం ఫర్నై. మనదిల్పకారం పనీ జర్గిపించాలని ఖైవంకీ పారాధనా చేపించటం అవషరం. సలాం; సలాం.

(బురుజుపైనుండి నవాబును రామశర్మయు దిగిపోదురు.)

(రామశర్మ వీరవర్మలు ప్రవేశింతురు)

వీర—శర్మా! ఈశశిభూషణుండెవండోయి?

రామ—కళింగాధీశుని బంధువంట. చిత్రరేఖకై నవాబునకు దోడ్పడు మన్నాండు.

వీర—చిత్రరేఖ దమను నెంత మోసగించెనోయి!

రామ—అట్లు నమ్మక ముదవ మాటాడకున్న సీతండు బొందకుడు టెట్లు? పడకున్న శశిభూషణు నందుంచి తాం దప్పించుకొను టెట్లు?

మన్నుదిన్న పాములాగున నున్న నీనవాబింతటి రాజ్యతంత్రజ్ఞుఁడని చాటుటకే యీ నూతన వికల్పము ప్రాప్తించెఁ గాబోలు. అతి తేలిన వానికన్న వేయిరెట్లు మిన్నగ సామర్థ్యమును బ్రకటించుచున్నాఁడు. ఇన్నాళ్ళీతఁడిట్టివాఁడని లోకమున కపరిచితుఁడు గదా? ఏపుట్టలో నే పామున్నదో కనుగొనుట దుర్లభమనుట యిందుకొఱకే.

వీర — శశిభూషణుఁడు నేర్పరియే; నవాబుని సహలీలకు తగినవాఁడు ద్రోయుంచె. "నవరత్నములన్నియు నొక్క చోటను నత్తగుల్లలొక చోట" నను సామ్యము వినలేదా? దైవము నగుణముగనే పొత్తు గూర్చుచుండు.

రామ — రాత్రి ఇంకొక రహస్యము జరిగె.

వీర — అదెయ్యది?

రామ — మదన చిత్రరేఖలు నవాబు గృహమునం జేరిరి.

వీర — బలే బలే. సంతోషవార్త. ఎట్లొనఁగూడెనోయి?

రామ — నవాబుగారి యాజ్ఞలఁ దీర్చ మన మేగుదము రమ్ము.

[రామశర్మ వీరవర్మ లేగుదురు]

[తెర వ్రాలును]

—* పంచమాంకము *—

తృతీయరంగము.

కారాగారము:—[బుద్ధిసాగరుఁడు దైవధ్యానతత్పరుండయి కనులు మూసికొని సమాధియందుండును] [స్థిమిత చిత్తము లేనట్లేదియో యోచించుచు సుదర్శనుఁడు ప్రవేశించును.]

సుద — [బుద్ధిసాగరుని వైపుంజూచి] ఔరా! ఈతని సామర్థ్యము బాహ్యప్రపంచమున నవీనునట్లు మెలంగుచు నఖండ ధురంధరత్వంబున రాజ్యపాలన మనన్యసామాన్యంబుగ నిర్వర్తించి యనశ్వరకీర్తిం గడించె. ప్రపంచమునకు దూరుఁడై, విషమస్థితికై

చింతింపక ప్రాచీనుల ట్లాధ్యాత్మిక శక్తి నలవరించుకొని భక్తియుక్తుఁ డయి నిశ్చలసమాధిని భగవదారాధనయందు నానంద మొందు చున్నాఁడు. శ్రేష్ఠతముఁడు సూక్ష్మబుద్ధిని నిందిరేశుఁ డనుగ్రహించిన బరిపరివిధంబులఁ బడవడి ట్లుపాదరసమువోలెఁ బ్రాకించుకొన నగు. 'జట్టున్న యమ్మనసే కొంపెప్పుడుం బెట్టఁగలదు.' నేను దుర్మార్గుఁ డనై యెగ్గొనర్చినను నా యెడ నీతఁ డెప్పటికిని కరుణామయుఁడే గాని కోపోద్రిక్తుండు గాఁడు. నిరంతర ధ్యాన పరతఁ బరంధాముని కైంకర్య ప్రాప్తిని సర్వమును మఱచి విరక్తిం గాంచియేమనునో? ఐన నిట్లొనర్చెద. సేవకా! సేవకా!

సేవకుఁడు—చిత్తము. అజ్ఞల శిరసావహింప సంసిద్ధుఁడుగా నున్నాఁడను.

సుద—కారాగృహాధికారిని బిలువుము.

సేవ—చిత్తము.

[కారాగృహాధికారి ప్రవేశించును.]

కారా—ప్రభుసత్తమా! నమస్కారములు.

సుద—బుద్ధిసాగరుఁ డున్న గది కవాటమును వారి తపస్సమాధికి నిర్విఘ్నంబుగఁ గను మెలఁకువతోఁ దాళము తీసి తెఱవవలయును.

కారా—చిత్తము.

(నేర్పుతో నట్లొనర్చును.)

సుద—నీవిఁక వెళ్లుము. మరలఁ బిలిపించెదను.

సుద—(బుద్ధిసాగరమూర్తిం గాంచి) అయ్యో! నే నెంత నిందా పాత్రుండనైతిని! ఏమి నా పితృసమాను దుస్థితి!

తే॥ గీ॥ విలసిత సుభోగ కకట చింపిరిదిచాప
మోటు గొంగళి ముంతయు మూఁకుడులును
గూర్చితిని నా వివేకమ్ము గూలిపోవఁ
బ్రాకృతుల కది భారమై వనటఁ బెంచుఁ
గాని మంత్రి కల్లానను జ్ఞానుఁడే॥

తే॥ గీ॥ మంత్రిగానుండి శ్రీశు నా ♦ మముఁ బుద్ధలఁప
క్షణముతీరక వర్తించి ♦ సావకాశ
ము బ్బెనంచని మురియు చా ♦ హ్లాదవార్ధి
నవశశియునంగ స్మేరాన ♦ నమున వెలుఁగు॥

తే॥ గీ॥ వెలగల దుకూలముల వేయు ♦ విత్తవాంఛ
డంగికేకయొ చెడ్డి దా ♦ ల్పం గలింగి
మాయురూపమ్మఁ బూని నా ♦ మహిమ యుదితుఁ
బాయునే వన్నెగుణి మసి ♦ పాతనున్న॥

నా ప్రార్థన నీతఁ డంగీకరించునో లేదోకదా. నా తప్పిదంబుల మన్నించునట్లు దైవమా! యాతనికి బుద్ధిఁబుట్టింపుము. దూరాలోచన యొనర్పక మిడిసిపడితి. తల బొప్పెలు కట్టినది. ఈ ప్రయత్నంబునఁగూడ వంచింపకుము. దైవమా! శ్రీశా! నీ పదములే నమ్మి ప్రస్తుతించెద. భంగపా టొదవించితేని ప్రాణములపై యాశ లేదు. బుద్ధిసాగరుని సాయమునంగూర్చి శుభంబు లందఁజేయుము.

తే॥ గీ॥ తడిసి గుడిసెకట్టు మొరఁగుఁ ♦ దాఁక నగ్రు;
తాకివచ్చుట నమ్మించు ♦ దాఁకఁ వేటు
శరణమును లేక శ్రీ బుద్ధి ♦ సాగరాఖ్య!
పాద పద్మాలఁబడితి నీ ♦ పాదుకానుము.

ప్రసన్నుఁడవగు దాఁక లేవఁబోను. (సుదర్శనుఁడు సాష్టాంగపడును)

బుద్ధి—(ఇంచుక తడవునకుఁ గనులు తెఱచి) ఆ ఏమిది! నా మందిర ద్వారము తెఱచియున్నది. (పదములకడనున్న వారింగాంచి యదరిపడి లేచి జాగ్రత్తగ నంగిమూచి చేతందట్టుచు) నాయన సుదర్శన భూపా! మొక్కు లందం దగువాఁడవు పాదాక్రాంతుండవగుటయా! లేలెమ్ము. (సుదర్శనుఁడు లేచి నిలుచును) రాజా! ఇదేటి విపరీత కృత్యము! ఇట్లేల యొనర్చితిరి?

సుదర్శనుఁడు—మంత్రివరా! ఏమి చెప్పఁగలను? మతిపోయినది. అసంఖ్యాకంబులగు నాయాసంబులు నన్నాకొట్టపెట్టెడి. నన్నుమించిన

యోచనలో మునిఁగిపోయి దరిఁగానక తల్లడిల్లుచు నీవే తరుణో
పాయంబని నీపాలంబడితి.

ఉ॥ దాసుని తప్పులన్నియును ♦ దండముతో సరియన్నయట్లు నా
వేశముపూని నాదగు వి ♦ వేక విహీనదశ సహించి, సం
దేశము నాలకించి, చను ♦ దేరఁగదయ్య; తుణావకాశమా
నాశనహేతు నా జనుల ♦ నాయకుఁడే! నృపుఁడే! తరాజు నే॥

ఉ॥ నాయపచారమెంచక చ ♦ నందగు మీపదవి గ్రహింపఁ, ని
న్యాయుట, శిక్షయుంచుటయుఁ ♦ బాలితులెల్లరు నెత్తుదొంచి ర
న్యాయమటంచు, నా ర్జన ♦ వాదమువిన్న నృపాళికూడ నా
కూయి సమంజసంబనిరి ♦ కోరికఁదీరుపఁ జెంతఁజేరితిన్॥

బుద్ధి—రాజా! తమరు నన్నింతగఁ బ్రాధేయ పడుటేల? తమ
యాజ్ఞల కే బద్ధుండ గానా?

సుద—పితృసమానా! నా మనవిని వినుఁడు. అజ్ఞానినై చపల
చిత్తంబున నేనొనర్చిన లోపంబులన్నిటి మఱచి పూర్వపు బుద్ధి
సాగరులై రాజ్యపాలనమును మీ కరమున వహింపుఁడు. నా భార
మును దించి మోదావహుం జేయుఁడు. మా తండ్రి తమచేతుల
నప్పడిపోయిన మాట మఱువకుఁడు.

బుద్ధి—నాయనా! మీపూర్వులయెడ నాకుంగలభక్తివిశ్వాసం
బులును నీయందలి కుమారవాత్సల్యంబును నీచర్యలెట్టివైనను
నన్నాగ్రహాపేతుం జేయవు. మనకిరువురికి భావభేదములు లేవు.
కాని రాజనీతిం బరికింపవలయు. ప్రజాభిప్రాయంబునకు వెలివి
నన్వదలినట్లుండరాదు. అట్లైన మంత్రిగౌరవభంగమును, ప్రజాశక్తికి
నాధిక్యమును గూర్చిన వారమగుదుము. అది స్వయంకృతాపరాధ
ము. అంతరంగికాభిప్రాయ మెట్లుండినను నటనఁజూపవలెను.

సుద—తమచిత్తమువచ్చినరీతి నాచరింపుఁడు. పూర్ణాధికారము నిచ్చు
చున్నాను

బుద్ధి—దమను నిచటికిఁ బిలిపింపుఁడు. నవాబునకు, బుద్ధిసాగరుని విషయమై పునర్విచారణ జరుపబడునుగాన విచ్చేయుఁడని కబురంపుడు.

సుద—సేవకా! కారాగృహాధికారి వద్దనుండి కాగితమును గలమును సిరాబుడ్డియుం దెమ్ము.

సేవ—చిత్తము మహాప్రభూ!

సుద—(సేవకు డందిచ్చిన వానింగొని వ్రాసి) సేవకా! నీ విద్దానిఁగొని తీవ్రజవంబున నవాబుగారి దేవిడి కేగి వారి కీయుత్తర మందఁజేసి రమ్ము.

సేవకుఁడు—(అందుకొని) మహాప్రసాదమట్లే యొనర్చెదను.

బుద్ధి—(తలవంచుకొనియుండును.)

సుద—(స్వగతము) మత్కృతాపరాధ మీతనితో ముచ్చటించుటకు మనసొప్పకున్నది. ఆహా! ఏమి యీతని శాంతగుణము! అనిమిత్త కారణంబున నలజడిం గూర్చిన నన్నొక్క పరుషోక్తు నేని నాడఁడు. ఔను; సత్పురుషుల లక్షణము లిట్టులే యుండును. ఎదిరికి గుణపాఠంబుల నిట్లే నేర్పుదురు. ఈతని ప్రేమపుంజూడ్కులును నిష్కల్మష హృదయంబును నాకఠినమనసమునఁ బశ్చాత్తాపంబు నంకురింపఁజేసి నాలోపంబుల దీపించుచు మూర్ఖంబు నెత్తనీకున్నది.

బుద్ధి—రాజా! నీచేత్రొక్కనంది పాపకూపంబునం బడితి. ప్రమత్తావస్థయందు ప్రమాదము సంఘటించె.

సుద—(స్వగతము) చచ్చినపామును జంపువిధమిద్దియె. (బహిరంగముగా) మహాత్మా! నాత్రొక్కు సహిత మఘకారణమయ్యెగా? నేనెంతటి కట్టడినైతిని! అనంతంబులగు నాదోషపుంజంబుల పరిహారంబులగుడు "నిండమునిఁగినవానికిఁ జలియేమి" అన్నట్లుండలకై నాకేచింతయులేదుగాని నాయనర్హతకుఁ జింతించుచుంటి.

బుద్ధి—రాజా! మీరు ప్రభువులు; నేను సేవకుఁడను. ఆయుద్దేశమున నే నట్లంటిని. విపరీతార్థములకు స్థానమొసంగకుఁడు.

సేవకుఁడు—(తెఱలో) స్వామీ! నవాబుగారును శశిభూషణుఁడుగారును దర్శన మపేక్షించుచున్నారు.

సుద — సేవకా! వారినిలోఁ దెచ్చుచు గారాగృహాధికారితోఁ దమనుని గూడ నాసముఖమునకుఁ దెచ్చుమనుము.

(ఒకపార్శ్వమునుండి నవాబును శశిభూషణుఁడును వేఱొకపార్శ్వము నుండి సంకెలలతోఁ దమనుండును ప్రవేశింతురు)

నవాబు సాహెబ్జీ! శశిభూషణార్యా! ఆస్థానపదముల నాసీనులుకండు. శశిభూషణార్యా! తమరెపుడు దయచేసితిరి?

శశి — రాజా! కార్యాంతరమునచే నేనిందే యున్నాఁడను.

సుద — దమనాఖ్యా! బుద్ధిసాగరుకడఁ జేరంబోకుము.

నవా — [బుద్ధిసాగరుం జూపుచు] మహాత్మాజీబోరామే మాకీయుర్హాసన్నంమే. [అని నేలం గూరుచుండును.] శశిభూషణుఁ డట్లె యొనర్చును. దమనుఁడు బుద్ధిసాగరుఁజేరం బోవును]

సుద — సాహెబ్ మన్నిండు! బుద్ధిసాగరుఁడు గొప్పవాఁడు. మాకుటుంబము వారికే మేలు నవారంబుగ నొనర్చినవాఁడు. ఇందేదియును నేను గాదనను. అవసరంబుగఁ జెట్టుకొట్టి పైనవేసికొనెను. వాఁడే కన్య నన్వేషింపఁ దనకున్నై తాను ముందంజవైచి సురూపందెచ్చి కుమారునికిం గూర్చెను. ఇది యింతనిదోషము.

సాహె — అజీ! సర్కార్! బుద్దిసాగర్ కారణం అన్నమాట జూటా. అజీ! దమక్ భాయి! అబ్ సచ్ చ్ బోలో. హమ్ కీ చెప్పాలా. నీకీ చెప్తుందిబోలో.

దమ — రాజశేఖరా! బుద్ధిసాగరుఁడు కన్యంగే నెగడిసి మదనునకే పెట్టిన దుర్మతిని నేనే. అంతలం బోక బుద్ధిసాగరునకు శృంగభంగమును గూర్ప సాయపడుమని నిచుండనై యీ మానసీయుండగు మహమ్మదీయప్రభువు నెలజ్జవీడి వేఁడితిని. చిత్రరేఖ పురుషుఁడుగ నెట్లుమాఱెనో ఆవిషయము నాకగమ్యముగ నున్నది. ఈసందర్భమున నే నేకుట్ర నొనర్పలేదు. చిత్రరేఖ నాతోఁ నేల బుద్ధిసాగరునిఁ గూర్చియు మదనునిఁ గూర్చియు వెగటుగ మాటాడెనో యూహింపఁ జాలకున్నాను. ఈశశిభూషణ మహాశయుఁడు నిజము దాఁపక నిశ్చితాంశంబుల వివరించిన మేలొనగూర్చినవాఁడగు.

శశి—నృపాల వతంసమా! నావారిని గాపాడను దుర్బుద్ధుల మాయలు ప్రబలకుండుటకును, కొంత చొరవ కలిగించుకొని నేనును గొన్ని యనృతము లాడవలసివచ్చె. అందులకు మన్నింపుఁడు. నేను బురుషుఁడను గాను. చిత్రరేఖ చెల్లెలను శశిరేఖ యను నామముదాన. మదన చిత్రరేఖలు కాననంబులకుఁ జేర్పం బడిన ట్లీ ముసలమాను నవాబుగారి మహాలమున వింటి. చాలదినములనుండియు నేను పురుష వేషముననే తిరుగుచున్నాను. నవాబుగారి మహాలముననే చేయఁగల సాహసకార్యమెఱిఁగి పురుష వేషమున నీ దమనుని వెన్నాడి, మదన చిత్రరేఖలంగని, వారికి, దమనుఁడు వారిం బందీకృతులఁ జేసి గొంపోవ నెంచుఁ బ్రవేశించిన వృత్తాంతము విశదపఱచి, వారల సాగనంపి నేనే చిత్రరేఖనై తిరుగాడుచుంటి. దమనుఁడు నన్నే చిత్రరేఖయనుకొని ప్రశ్నించె. అతఁడు నమ్మునట్లన్నియుఁ బలికి నమ్మించితి. పల్లకిఁ జూపి ప్రవేశింపుమని పాప మాతఁడు బోయులతో రానేగ. నేనీలో నా పురుష వేషమున నందుఁ జేరితి. పై విషయము శ్రీవారికి విశదము. కార్యార్థినై నే నాడిన మృషలకు నటించిన కార్యములకు ప్రభువు లాగ్రహపడకుందురు గాత.

దమ—రాజా! ఏదెట్లున్నను ఆరంభమునుండియు నన్ని దుష్కృత్యంబులనంతంబులు. బుద్ధిసాగరునిపై యారోపింపఁబడిన నేరంబులకు మూలము నేననఁజెల్లు. అతఁడు నిర్దోషి.

బుద్ధి—దమనార్యా! అదేటిమాట? నరేశు సబలయుతు న్వనర్పంగ శపథమూని నిగ్గింపఁ గల్గితివే?

నవాబు—ఈనోగార్ మదన్‌కీ యిస్కా చెప్పటం అసల్ మూలం నైతో మదన్ చిత్రేకీ సూడటం కైసా. ఆజీ! సర్కార్! మాకీ మాట హమారు చెప్పార్ లేదూ.

సుద—నవాబా! నీనుడులు యథార్థములు.

సుద—మంత్రులారా!

తే॥ గీ॥ కలుగు నధికారబలమునఁ ♦ గనులమూసి
గాసి మిముఁబెట్టఁ బరమాత్మ ♦ కనులుఁదెఱువ
నొత్తిడీసిఁదెచ్చెఁ బ్రజల ♦ నోరెత్తనిచ్చి
జనులచే నీతులంకు న ♦ జ్ఞానినైతి
చెఱయె మెఱుఁ గవమాన దు ♦ స్థితులకన్న॥

తే॥ గీ॥ ముప్పురియందున లోపము ♦ లవిలియుంటఁ
జేకురంజేసెఁ దలవంపు ♦ శేషశాయి
యాగ్రహాన్మత్తతఁ బడినే ♦ నాచరించి
నట్టి కృత్యముల్మఱవఁగా ♦ నేను మీకు॥

తే॥ గీ॥ దమన! యిచ్చితి మరలఁ బ్ర ♦ ధానపదవి
నెఱిఁగి భవదీయలోపము ♦ లెక్కవనుచు
నొచ్చుకొనుచుంట వదలఁగ ♦ నిచ్చలేక
ముందు జాగ్రత్తవహియించి ♦ యుందుగాక॥

మీరిపుడును చెఱనుండి విముక్తులైతిరి. తేపు తమ రాస్థానమున మంత్రిస్థానము నలంకరింపఁదగు. సేవకా! కారాగృహాధికారిం బిల్వుము.

సేవకుఁడు—చిత్తము.

బుద్ధి—ఆహా! ఏమి నీ పశ్చాత్తాపము!

ఉ॥ నీ సములేరి పృథ్వీధర ♦ ణీపతి సద్గుణ రాజచంద్రమా?
చేసినలోపము ల్దలఁపు ♦ చేకురుశే కఱవద్ది యుబ్బినన్
వాసిదొలంగు, గౌరవపు ♦ భంగముకూర్చుఁ బ్రతిష్ఠతగ్గుఁజేఁ
జేసిన మార్పులంచుఁ బ్రభు ♦ చిత్తము తత్తరమందుచుండుఁగా॥

[కారాగృహాధికారి ప్రవేశించును]

సుద—ఓయీ! వీరి నీక్షణముననే విడిపించి వారిగృహంబులకు శకటారూఢులం జేసి పంపుము. నీవు వెళ్ళుము.

కారా—చిత్తము.

నవాబు—అజీ! రాజాసర్కార్! మేరా ఆత్మ ఆనందహోగయా,

బుద్ధి—రాజా! దమనుని యాత్మం జొచ్చి దైవము ప్రేరేపించి దమనుడ కటి గదిం జేర్చిన శశిభూషణుం డను వ్యవహార నామము వహించిన యీపూర్ణశశి నేని హాసించు ముఖారవిందమున నొప్పు శశిరేఖను దమనుపాణిగ్రహణ మొనర్చుట యుత్తమమని యోఁచెడి. శశిభూషణా! నిన్నిక నేను శశిరేఖాయని యనియెదను.

శశిభూ—(తలవంచుకొని మారాడక పురుషుల దుస్తులన్ని విడిచి స్త్రీరూపమునఁ బ్రత్యక్షము గాఁ బ్రయత్నించుచుండు)

బుద్ధి—నాకోడలి చెల్లెలివగుటచే స్వతంత్రత వహించి మారాజును నీవు వరియింప వలచెదవా యని ప్రశ్నింతునా?

నవాబు—బుద్ధిసాగర్ భయ్యా! దుస్రాభాత్ నైనా సైయన్న మాట కావా.

సుద—(నవ్వుచు) మంత్రిసత్తమా! కడుంగడుజాణవోలె నిదర్శనపూర్వకంబుగఁ జర్యలగుపడుచుండ నీయమాయకుడేరీతి వరింప నర్హుడు.

శశి—మామగారి యాజ్ఞలకు నేనుబద్ధురాలను. నిజే........నరేశుని పల్కులకు కాదనే విజ్ఞప్తి నర్పించు కొంటిని.

బుద్ధి—దైవదత్తంబగు కన్యకామణియే రాణి యగుగాఁత.

[సేవకుఁడు ప్రవేశించును]

సేవకు—స్వాములారా! ఇవిగో! తమకు వస్త్రములు. [శృంఖలఁదీయును]

[బుద్ధిసాగరదమనులు వస్త్రధారులై ముందునకు వత్తురు]

బుద్ధి—[రాజుకరమును శశిరేఖకరమును చేర్చిపట్టి]

తే॥ గీ॥ ఒండొరులయెడఁ దీరని ♦ మెండుప్రేమ
గలిగిన కలిమికినిఁ దోడు ♦ కడుపుఫలము
సంతతానందమును ధర్మ ♦ సత్యనిరతి
ఏడుగడయందు న తిథుల ♦ యెడలభక్తి
దంపతులకిడుతఁ బురాణ ♦ దంపతులును॥

తే॥ గీ॥ రాణినింగూడు భాగ్యమీ ♦ రాజవరున
కీముహూర్తమందున విధి ♦ యేరుపఱుప

మనుజయత్నము లేపాటి యనువుపడును
దైవసంకల్పమునుగూడఁ దారసిలక॥
[నవాబును కౌఁగలించుకొని]
తే॥ గీ॥ బాల్యమైత్రి నెంచి చెలిమి వదలఁజేయ
జాతిభేదము లెంచుట నీతి కాద
టంచు బోధించి జనులలో నైకమత్య
మమరిచి విభులఁగ అపుడే మహిమఁదెలుపు॥

శశిరేఖ—నాయిప్పటి యుచ్ఛస్థితికి నిలువెడలఁ దరిమిన సవతితల్లియు తరువాత బుద్ధిసాగర బుధేంద్రునిమూలమున దుష్టులబారినుండి తప్పింపఁబడి సులు జేర్పంబడిన మదీయసోదరియు, పిమ్మట సోదరికై యిందుఁజేరి నెమకునెడ దర్శనప్రాప్తినొసఁగి గౌరవించి కర్తవ్యముం దెలిపి సాయమొనర్చిన నవాబును, తదనంతరము శ్రీవారిందర్శింపఁ గారణుఁడైన దమనాఖ్యుండునుఁ, దుదకుఁ ప్రాణనాయకుం గూర్చిన బుద్ధిసాగరాఖ్యుం బరఁగు మామగారును ముఖ్యులు. మఱచితిని; మామగారు పై ముఖ్యులలో నగ్రస్థాన మలంకరింపఁదగినవారు. వారు మాచిత్రరేఖం గ్రహింపకున్న నింతింతల కవకాశము లుండియుండవు.

మద—మంత్రులారా! సాహెబ్ వారు! కోలాహలమెద్ది?

సేవకు—[పరలో] రాజేంద్రా! జనులు తండోపతండంబులుగ మూఁగి వచ్చుచున్నారు. రామశర్మగారును, తల్లియు, పిల్లాలును దోసరా మదనాఖ్యుండును ద్వారముకడ విచ్చేసి యిటఁజేరం గాక్షించుచున్నారు.

(పైవారు ప్రవేశింతురు)

బుద్ధిసాగరుని యిల్లాలును, మదనుండును, చిత్రరేఖయు, బుద్ధిసాగరునికి సాష్టాంగ నమస్కార మొనర్చి లేచి నిలచియుందురు)

బుద్ధి— రామశర్మా! నమస్కారములు. మీరు నాయెడఁగల యనురాగము వెల్లడించి ధన్యులొనర్చితిరి. కుమారా! ఏల తల వంచి యున్నావు? నీమూలమున నిట్లయ్యెనని వగవకు. అంతయును

కాలగతి. చిత్రరేఖా! చెల్లెలు చేరగా లేదని చుఱచుఱఁ జూడకు. రాజు కరమంది రాణియయ్యె.

సుద — మంత్రిసుతా! మదనా! బాల్య మిత్రత్వమును బాటింపక నే నెగ్గుఁ గూర్చితి. మన్నింపుము.

మద — అయ్యో! అట్లు కాదు. అగ్రతాంబూలమునకు నే నర్హుండను.

నవాబు — ఫిర్ షాబ్బీబాతాం హైకుజీ. ఏకేకద్మీ మనుసుల్ మే హెంతహెంత బుద్ధుల్ ఉన్నాయి చూపించార్ అల్లావార్. అందర్ చల్లాగా ఉన్నాయి. ఈల్లాకి జనం నూట్టానికీ భార్ అయినా.

సుద — నవాబా! నీ వచనంబులు యథార్థములు. ఆలసించు టొప్పదు. పెక్కుర కాశాభంగము గలిగించుచున్నారము. రామశర్మా! భరతవాక్యమనుఁడు.

రామ —

తే॥ గీ॥ కొఱఁత లేకుండ జనులకుఁ ♦ గోరికలును
కార్యదీక్షయు సత్పథ ♦ కాంక్షితమును
ప్రజలభావమ్మునకుఁ దగు ♦ పాలనమును
శ్రీపతి యనుగ్రహించి ♦ రక్షించుఁగాత॥

అందఱు — తథాస్తు. తథాస్తు.

(అందఱు వెడలిపోవుదురు.)

[తెర వ్రాలును.]

సమాప్తము.

వేంకటరమణ గ్రంథమాల.

పల్లె వేంకటసుబ్బారాయ కృత గ్రంథములు.

1 సువర్ణముఖి (నవల)	(Approved)	రు	0-12-0
2 గంగాబాయి (చరిత్రాత్మకము నవల)	డిటో	,,	0-12-0
3 ప్రతిభారతము (వచనము)	డిటో	,,	0-12-0
4 దుర్యోధన పరాభవము (నాటకము)		,,	0-10-0
(Approved for Libraries)			
5 త్రిభువనము (నవల)			అచ్చులోనున్నది.
6 హనుమద్విజయము (వచనము)			డిటో

మయిలవరపు వేంకటరామయ్య కృత గ్రంథములు.

1 పౌరుషలీల (పద్యకావ్యము)	రు	0-6-0
2 భజగోవింద శ్లోకములు, వివేకసరియును శేటగీత పద్యములు.	,,	0-1-0
(3) Practical Geometry in Telugu Part I (Approved)	,,	0-8-0

ఇతర గ్రంథములు.

1 కళాపూర్ణోదయము (మంచి అచ్చు)	రు	1-0-0
2 లలనాశతకము (వింజమూరి సుబ్బారాయ కృతము)	,,	0-2-0
3 అవ్వయార్ మవ్వపునీతులు	,,	0-1-6
4 పతివ్రత	,,	0-3-0
5 యుధిష్ఠిరచక్రవర్తి (వచనము) (Approved) (శ్రీమతి దేశిరాజు లక్ష్మీనరసమాంబా విరచితము)	,,	0-6-0

రోషనార.

కొప్పరపు సుబ్బారాయ విరచితము.

ప్రౌఢకూర్పు. అతిముఖ్యములగు సవరణలు. అత్యద్భుతములగు కీర్తనలు. ఆంధ్రదేశమునందలి ప్రసిద్ధ రాజమునందును ప్రదర్శింపఁబడి మేటికీర్తిగాంచినది. పెక్కు పత్రికలచే, పండితులచే, నటులచే కీర్తింపఁబడినది. "These scenes of Roshanara have few parallels and certainly no superiors in the field of Telugu Historical Drama" అని స్వరాజ్యపత్రికచే ప్రశంసింపఁబడినది. వెల రు 1-4-0. [illegible] వలయువారు గుంటూరు, కొత్తపేటయందున్న గ్రంథకర్తకు వ్రాయవలయును.

కాశీవిజయము.

వెల : రు 0-10-0

ఐదంకముల శ్రీ[illegible]నాటకము - చరిత్రాత్మకము
మునగల రామమూర్తి విరచితము.

Apply to:—

P. V. RAMANAIYA & Son,
Opticians, Booksellers, Publishers, etc.,
GUNTUR.